# ప్రజా విముక్తి

లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| మిషన్ కాకతీయ | ....5 |
| నరహంతకుడు నయీం | .....7 |
| నవ్యాంధ్ర రాజధాని | ....10 |
| మల్లన్న సాగర్ వ్యతిరేకత | .....12 |
| జిల్లాల పునర్విభజన | ......15 |
| సి. వారసత్వ ఉద్యోగాలు | ......17 |
| తెలంగాణలో విద్య | .......20 |
| సిద్ధాంత వ్యాసం | ......21 |
| ఏ.పీ.కి ప్రత్యేక ప్యాకేజీ | .......25 |
| హరిత హారం | .......28 |
| అమరవీరుల చరిత్రలు | .....31 |
| బొజ్జా, మహాశ్వేతాదేవి | ....36 |
| పోరాట వార్తలు | .....38 |
| పత్రికా ప్రకటనలు | .....40 |




భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక

సంపుటి:1 సంచిక:3 జులై-సెప్టెంబర్, 2016


## ప్రత్యేక తెలంగాణలో రెండేళ్ళు

## తెలంగాణ స్వయం పాలన కాదు-కే.సీ.ఆర్. స్వ (స్వాహా) పాలన

తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ కోసం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టాడు. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రాణాలపై ఆశతో నిమ్మరసం తాగి నిరాహారదీక్షను విరమించాడు. చంద్రశేఖర్ రావు ద్రోహాన్ని ఎండగడుతు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు ఉద్యమాన్ని వుధృతం చేసారు. తెలంగాణలోని సబ్బండ వర్ణాల ప్రజలు కులం, మతం, జాతి, వర్గాలకతీతంగా విద్యార్థులకు అండగా నిలబడ్డారు. ప్రత్యేక తెలంగాణకై అసెంబ్లీ ముట్టడి, మిలియన్ మార్చ్, సాగర హారం, సకల జనుల సమ్మె, ధూంధాంలతో రకరకాల పోరాటాలతో, బలిదానాలతో లావాల ఉప్పొంగుతున్న వుద్యమానికి ఢిల్లీ పెద్దల గుండెలు బేజారెత్తాయి. ప్రజా పోరాటాలకు భయపడి బ్రిటీష్ వాడు అర్ధరాత్రి అధికార మార్పిడి చేసినట్టుగా ఢిల్లీ పెద్దలు అర్ధ రాత్రి ఆంక్షలతో కూడిన తెలంగాణను ప్రకటించినారు. ప్రకటన వెలువడిన వెంటనే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణను నేనే సాధించాను అంటూ బీరాలు పలుకుతు పోరాట కారుడిలా ఫోజులు పెట్టాడు. వాస్తవంగా సబ్బండ వర్ణాల సమరశీల పోరాటం, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే తెలంగాణకు కావలి కుక్కలా వుంటానని, తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి దళితుడేనని, అనేక బహిరంగ సభల్లో వాగ్దానం చేసిన కే.సీ.ఆర్. అమలు చేయలేదు. ప్రజల పోరాటాలకు, త్యాగాలకు విలువనివ్వలేదు. తన దొర స్వభావాన్ని బయటపెట్టుకున్నాడు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టి ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్నాడు.

ప్రత్యేక తెలంగాణ ఏర్పడకముందే ఆంధ్ర దోపిడీదార్లతో లోపాయికారి ఒప్పందం చేసుకుని ప్రకృతి సంపదను, వేలాది ఎకరాల భూములను నీటముంచి ఆదివాసులను నిర్వాసితం చేసే పోలవరం ప్రాజెక్టును కట్టుకోవడానికి, ఏడు మండలాలను ఆంధ్రాలో కలపడానికి ఢిల్లీ పెద్దల సమక్షంలో సంతకాలు చేసి తెలంగాణకు ద్రోహం చేయడం మొదలుపెట్టాడు.

టీ.ఆర్.ఎస్. పార్టీని గెలిపిస్తే బంగారు తెలంగాణను చేస్తానని బహిరంగ సభలల్లో ప్రజలకు హామీ ఇచ్చినాడు. ఎన్నికల్లో ప్రజలు నమ్మి మెజారిటీ సీట్లతో టీ.ఆర్.ఎస్. పార్టీని గెలిపించారు. కే.సీ.ఆర్. అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కాడు.

తెలంగాణలో స్వయం పాలన మచ్చుకు కూడ కానరాదు. రెండేళ్ళ కే.సీ.ఆర్. పాలనలో పీడిత ప్రజల బాధలు, గాధలు చూద్దాం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో స్వయం పాలన నినాదం ఇచ్చాం. అది నేడు ఒక ఆకర్షక నినాదంగా మిగిలింది. ప్రజల అర్థవంతమైన నిజమైన స్వయం పాలన తెలంగాణలో ఉందా? 2సం॥ల టీ.ఆర్.ఎస్. ప్రభుత్వ పాలన ప్రత్యక్షంగా చూశాక ఇప్పుడు లేదు అని నమ్మకంగా చెప్పవచ్చు. ఒక పాలకవర్గ ముఠా స్థానంలో మరో

పాలకవర్గ ముఠా అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వ నిర్ణయాలు, పాలనా విధానాలు పారదర్శకంగా లేవు. వ్యక్తి ప్రధానమై నిరంకుశంగా ఉన్నాయి. నేడు తెలంగాణలో పాలనను, విధానాలను నిర్ణయిస్తున్న స్వప్రయోజన శక్తులు ఎవరో? వాళ్ళ ప్రయోజనాలే నెరవేరుతాయి. వాళ్ళు కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, విద్యా, వైద్య వ్యాపారులు. వీరికి అధికార పార్టీ రాజకీయ నాయకులతో, ప్రభుత్వాధికారులతో దగ్గర సంబంధాలు, డబ్బు లావాదేవీలు ఉంటాయి. పైరవీలు, దందాలు ఇంకా నీతి బాహ్యమైన కార్యకలాపాలు నడపగల శక్తివంతులు.

స్వయం పాలన, ఆత్మగౌరవం కావాలని అలుపెరగని పోరాటం చేసి సాధించిన ప్రత్యేక తెలంగాణలో వివిధ రంగాలలో నేడు నెలకొన్న పరిస్థితుల్ని చూద్దాం. వేల కొద్ది ఉద్యోగాలు దొరకలేదు. లక్షల కొద్ది అవకాశాలు కానరావడం లేదు. నిరుద్యోగ యువత నిరాశా నిస్పృహల్లోకి జారుకున్నారు.

**విద్యారంగం:** కే.జీ.నుండి పీ.జీ. ఉచిత విద్య గాలికొదిలేశారు. పర్మినెంటు ఉద్యోగాల స్థానంలో డిప్యూటేషన్ టీచర్లు, వాలంటరీ టీచర్లతో పాఠశాలలు నడపడం, వేల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలను మూసివేయడం చేస్తున్నారు. విద్యా ప్రమాణాలు కుదించబడడం, ప్రాథమిక విద్య సంక్షోభంలోకి నెట్టివేయబడడంతో ప్రైవేటు విద్యా సంస్థలు లాభాల బాటలో విరాజిల్లుతున్నాయి. ఉన్నత విద్యా సంస్థలలో, విశ్వవిద్యాలయాల్లోని నియామకాల్లో ప్రమాణాలు పాటించక పోవడంతో అన్ని స్థాయిల్లో అస్థవ్యస్థత నెలకొన్నది.

**వైద్యరంగం** లో కూడా 2 సం॥లలో చేసినది ఏమిలేదు. ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో డయాలసిస్ సెంటర్లు పెట్టడం వలన ప్రైవేటు వ్యక్తులే లాభ పడుతున్నారు. జిల్లాకి వంద పడకల ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు పెంచడం, వైద్య సిబ్బంది నియామకం జరగలేదు. పారా మెడికల్ సిబ్బంది నియామకం కూడా జరగలేదు. ఆరోగ్య శ్రీ పథకానికి ఇచ్చే 700 కోట్ల రూ॥లు ప్రైవేటు వైద్య రంగానికే పోతున్నాయి. వైద్యాభివృద్ధి జరిగింది శూన్యం.

**వ్యవసాయ రంగం**లో కరువు విలయతాండవం చేస్తుంది. వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడమే దీనికి నిదర్శనం. దుర్భిక్షం నెలకొన్న ప్రాంతాలను కూడా ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించని దుస్థితి నెలకొన్నది. రైతులకిస్తానన్న లక్ష రూపాయల రుణమాఫీ అమలు కాలేదు. రైతు ఆత్మహత్య చేసుకుంటే మాత్రం 6 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంటుంది ప్రభుత్వం. కౌలు రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వలేదు. ప్రభుత్వం ధరలు నిర్ణయించడం లేదు. మద్దతు ధరను ఇవ్వడం లేదు. పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే సబ్సిడీతో పోల్చితే రైతులకు ఇచ్చే సబ్సిడీ లెక్కలోకి రాదు. దేశంలో 52శాతం రైతులు అప్పుల్లో ఉంటే తెలంగాణలో 89శాతం రైతులు అప్పుల్లో వున్నారు. వ్యవసాయ విస్తరణ జరగలేదు. విత్తన చట్టం తెచ్చినా ఉచిత విత్తనాలు అందలేదు. క్రిమిసంహారక మందులు లేవు. కొత్త ఒరవడి లేదు. పాత ఒరవడిలోనే ఆత్మహత్యలు జరిగిపోతున్నాయి.

**నీటి పారుదల** చూస్తే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు కే.సీ.ఆర్. పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్‌లతో పాటు 25వేల కోట్ల రూ॥లతో పెండింగ్ ప్రాజెక్టుల పని పూర్తి చేస్తానని అన్నాడు. ఇదంతా ప్రకటనల గొప్పేగాని నీళ్లు వచ్చే జాడ కానరావడం లేదు. మిషన్ కాకతీయ లక్ష్యం 46 వేల చెరువులు పూడికతీత పేరుతో ప్రభుత్వ ఖజానా కొల్లగొట్టడం, ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో వ్యయాన్ని పెంచి పంచుకోవడం ద్వారా గత వై.ఎస్.ఆర్. అవినీతి పాలనను కొనసాగించడం తప్ప మరొకటికాదు.

**పారిశ్రామిక రంగం** చూస్తే 5 స్కైవేలు, 11 కారిడార్లు, 60 రహదార్లు, సాగర తీరంలో ఆకాశహర్మ్యాలు వంటి గొప్పలు చెప్పి ఇదే అభివృద్ధి అంటున్నారు నేటి తెలంగాణ పాలకులు. గతంలో కూడా రోడ్లు, ఫ్లై ఓవర్లు, బహుళ అంతస్థులు చూపించి ఇదే అభివృద్ధి అన్నారు. 16 వేల కోట్లు మిగులు నిల్వ లేమయ్యాయి. ఇప్పుడు వేల కోట్ల రూపాయల అప్పులు చూపిస్తున్నారు. 'టీ హబ్'లతో ఆకలి తీరుతుందా? నిరుద్యోగం తగ్గుతుందా? ఖాయిలా పడ్డ పరిశ్రమల మాటేమిటి? నూతన పారిశ్రామిక విధానంతో బహుళజాతి సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. ప్రజల్ని మరింత దైన్య పరిస్థితుల్లోకి నెడుతున్నారు.

**విద్యుత్ రంగం:** కరువు పరిస్థితుల కారణంగా విద్యుత్ వినియోగం వ్యవసాయంలో 42శాతం తగ్గింది. లేకుంటే విద్యుత్ సంక్షోభం రాష్ట్రాన్ని కుదిపేసి ఉండేది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో విద్యుత్ ఒప్పందం వలన తెలంగాణ రాష్ట్రానికి 10 వేల కోట్ల రూ॥లు అదనపు ఖర్చు వస్తుంది. విద్యుత్ ఉత్పత్తి కోసం కొత్తగా చేసింది ఏమిలేదు.

**సామాజిక, రాజకీయ రంగంలో** ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం వైపు ప్రభుత్వ దృష్టిలేదు. గతం నుండి కొనసాగిన సమస్యలే ఇప్పుడు కొనసాగుతున్నాయి. సాంస్కృతిక విషయాలపై అధిక శ్రద్ధపెట్టి బతుకమ్మలు, కృష్ణా, గోదావరి పుష్కరాలు, యజ్ఞాలు వైపు ప్రజల దృష్టిని మళ్ళించి హిందూ మత మౌఢ్యాన్ని పెంచుతుంది. రైతుల ఆత్మహత్యలు, అత్యాచారాలు, హత్యలు, నయీంలాంటి గ్యాంగ్‌స్టర్‌ల ఆగడాలు ఆగలేదు. వలసలు, గల్ఫ్‌కు పోవడాలు, ఆడపిల్లల్ని అమ్మడాలు, అవినీతి లాంటివి కొనసాగుతూనే ఉన్నాయి. టీ.ఆర్.ఎస్. పార్టీ విలువలు మరిచి పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించి అవకాశవాద రాజకీయాల్లో ముందున్నానని నిరూపించుకుంది.

**హక్కుల అణిచివేత-నిర్బంధం:** ప్రత్యేక తెలంగాణలో కూడా ఎన్‌కౌంటర్లు కొనసాగాయి. అరెస్టులు, చిత్రహింసలు సర్వసాధారణమయ్యాయి. ప్రజాస్వామిక హక్కులు హరించబడ్డాయి. రాజద్రోహ నేరాలు బనాయించడం మళ్ళీ మొదలయ్యింది. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలపై ఉక్కుపాదం మోపింది. ఒక్క మాటలో చెప్పాలంటే పోలీసు రాజ్యమే నడుస్తున్నది.

**ప్రజాపంపిణి వ్యవస్థ** లో నూతన మార్పు కానరాలేదు. పప్పు ధర 200 రూ॥లు అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ధరల నియంత్రణలో

ప్రభుత్వం బాధ్యత పడలేదు.

సబ్బండ వర్ణాల మేలు కలయికతో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణలో ప్రజలందరినీ సమాన స్థాయిలో అభివృద్ధి పథంవైపు నడపాలి. దానికి భిన్నంగా కే.సీ.ఆర్. పాలన వర్గ వ్యత్యాసాలు అధికమయ్యే విధంగా సంపన్న వర్గాల అభివృద్ధి లక్ష్యంగా పాలన కొనసాగుతుంది.

**లక్ష ఉద్యోగాలు:** అధికారంలోకి వస్తే లక్ష ఉద్యోగాలు ఇస్తానని మాట ఇచ్చి, వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తానని చేయకుండా పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడానికి పోలీసు వుద్యోగాలకు ఉత్తర్వులు జారిచేశాడు. లక్ష ఉద్యోగాలకు ఎగనామం పెట్టాడు. పోలీసు వ్యవస్థను ఆధునీకరించి పోలీసులకు విస్తృత అధికారాలను కట్టబెట్టిండు. తను చేయబోయే ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజలు తిరగబడితే అణచివేయడానికి ముందస్తు చర్యగా జాగ్రత్తపడ్డాడు.

**మావోయిస్టు ఎజెండా:** ఎన్నికల్లో గెలిస్తే మావోయిస్టు ఎజెండానే అమలు చేస్తానని, పౌరహక్కులను కాపాడుతానని, ముఖ్యమంత్రి కావడం కన్నా హక్కుల సంఘానికి నాయకుడిగా ఉండడమే గౌరవంగా భావిస్తానని చెప్పిన కే.సీ.ఆర్. ప్రజాస్వామిక ప్రత్యామ్నాయ వేదిక నిర్వహించిన కార్యక్రమాన్ని జరుగకుండా పశుబలంతో అడ్డుకున్నాడు. కే.సీ.ఆర్. తన అసలు స్వరూపాన్ని బయటపెట్టుకున్నాడు.

**"ఎన్‌కౌంటర్స్ లేని తెలంగాణ":** తెలంగాణలో ఎన్‌కౌంటర్లు వుండవని, ప్రైవేటు హత్యలు జరగవని అధికారికంగానే హత్యలు చేయిస్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లాలో 'ఆపరేషన్ బండి' పేరుతో దళాలను మట్టుబెట్టడానికి దళంపై రెండుసార్లు కాల్పులు చేసాడు. వరంగల్ జైలులో ఉన్న వికారుద్దీన్ అతని సహచరులను కోర్టు వాయిదాల పేరుతో తీసుకవచ్చి గొలుసులతో వ్యాన్‌లో కట్టివేసి, తుపాకులతో కాల్చి అధికారికంగా హత్య చేసినాడు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ బార్డర్‌లో తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు లంకపల్లి వద్ద కామ్రేడ్స్ కమల, సోని, వివేక్‌లను కాల్చిచంపాయి. వరంగల్ జిల్లా మొద్దుగుట్ట వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో కామ్రేడ్స్ మహిత, సాగర్‌లు ప్రాణాలతో దొరికితే కామ్రేడ్ మహితపై సామూహిక అత్యాచారం చేసి ఇద్దర్ని అతి కిరాతకంగా హత్య చేసినారు. మానవ విలువలను మంట గలిపిన పోలీసుల దుర్మార్గ చర్యకు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంది. తెలంగాణ ప్రజలు కోపోద్రిక్తులై 370 ప్రజా సంఘాలు, 9 వామపక్ష పార్టీలతో కలిసి తెలంగాణ ప్రజాస్వామిక వేదికగా ఏర్పడింది. వేలాది మంది ప్రజలు ఉప్పెనలా కదిలి హంతకులను శిక్షించాలని ముక్తకంఠంతో నినదిస్తే టీ.ఆర్.ఎస్. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుకు చీమ కుట్టినట్లయిన లేదు.

ద్రోహి ఇచ్చిన సమాచారంతో తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు కాటేపల్లి వద్ద కామ్రేడ్స్ చార్లెస్, ముఖేష్, దినేష్‌లను ప్రాణాలతో పట్టుకొని చిత్రహింసలు పెట్టి హత్యచేసి, కాటేపల్లి అడవిలో శవాలను వేసి, తెలంగాణ గ్రేహౌండ్స్, సీ-60 కమాండో బలగాలు కలిసి జరిపిన "ఎన్‌కౌంటర్లో" ముగ్గురు మావోయిస్టులు చనిపోయారని నిస్సిగ్గుగా ప్రకటించుకున్నాడు. కామ్రేడ్ చార్లెస్ శవాన్ని చూడడానికి ప్రజలను రానీయకుండా గ్రామానికి దూరంగా పోలీసులు దగ్గరుండి హడావుడిగా దహనం చేసినారు. శవాన్ని బొందపెడితే హక్కుల సంఘం వాళ్ళు రీపోస్టుమార్టం చేయిస్తే నిజాలు బయటపడతాయని 'శవాలు కూడా నిజాలు' చెపుతాయని భయంతో ఆనవాళ్ళు లేకుండా చేసి చేతులు దులుపుకున్నారు.

**మూడెకరాల భూపంపిణీ:** దళితులకు, ఆదివాసులకు, పేదలకు ఒక్కొక్కరికి ఉచితంగా మూడెకరాల భూమి ఇస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కే.సీ.ఆర్. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అటకెక్కించి, ఆదివాసులు, దళితులు, రైతులు దశాబ్దాల నుండి సాగుచేసుకుంటున్న పోడు భూముల్లో హరితహారం పేరుతో మొక్కలను నాటిస్తున్నాడు. మూడు ఎకరాల భూమి ఇవ్వకపోగా అనేక సంవత్సరాల నుండి సాగుచేసుకుంటున్న పోడు భూముల్లో మొక్కలు నాటించే ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా దళితులు, ఆదివాసులు, పేదరైతులు తిరగబడుతుంటే టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం ఫారెస్టు అధికార్లతో, పోలీసు బలగాలతో దాడులు చేపిస్తూ పోడు భూములనుండి దళితులను, ఆదివాసులను బేదఖలు చేస్తున్నారు.

**పరిశ్రమలు:** ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర దోపిడీ పాలకవర్గాలు కుట్ర పూరితంగా తెలంగాణకు అన్యాయం చేస్తూ తెలంగాణలోని పరిశ్రమలను మూసివేసినారు. (ఉదాహరణకు: ఆల్విన్, హెచ్.ఎమ్.టీ., అంతర్గం స్పిన్నింగ్ మిల్, అజాంజాహి మిల్, సర్‌సిల్క్ మొదలగునవి.) వేలాది కార్మిక కుటుంబాలను వీధిపాలు చేశారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీ.ఆర్.ఎస్. పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్ర పాలకులు మూసివేసిన పరిశ్రమలను తిరిగి తెరిపిస్తానని అధికారంలోకి వచ్చిన టీ.ఆర్.ఎస్. పార్టీ ముఖ్యమంత్రి కేసీఆర్ మూతపడిన పరిశ్రమల గురించి ఒక్క మాట కూడ మాట్లాడకుండా అదేబాటలో సిర్‌పూర్ పేపర్ మిల్లును మూసివేసి 5వేల మంది కార్మికులను రోడ్డు పాలు చేసి తన వర్గ స్వభావాన్ని బయటపెట్టుకున్నాడు.

**ఓపెన్‌కాస్టుల రద్దు:** కే.సీ.ఆర్. ఉత్తర తెలంగాణను బొందల గడ్డగా మారకుండా తన ప్రాణాలను అడ్డుపెట్టి ఓపెన్‌కాస్టులను అడ్డుకుంటానని, సింగరేణిలో డిస్మిస్ట్ కార్మికులను తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటానని, ఇన్‌కంటాక్స్‌ను రద్దు చేస్తానని, డిపెండెంట్‌లకు వుద్యోగాలు కల్పిస్తానని, కార్మికుల సొంత ఇంటి కలను నెరవేరుస్తానని, ఓపెన్‌కాస్టులను రద్దు చేసి సాంప్రదాయక బొగ్గు బావులను తవ్వించి వేలాది మందికి ఉపాధి కల్పించి కార్మికుల జీవితాల్లో వెలుగు నింపుతానని సింగరేణి ప్రాంత ప్రజల్లో ఆశలు రేకెత్తించాడు. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వెంటనే 19 గ్రామాలను కనుమరుగు చేసి, వేలాది మందిని వీధుల పాలు చేసి 3 మండలాలను బొందలగడ్డగా మార్చే 14 ఓపెన్‌కాస్టు బొగ్గు బావులను తవ్వుకోవడానికి సింగరేణి యజమాన్యానికి పర్మిషన్ ఇచ్చాడు. ప్రభుత్వ

నిర్ణయానికి వ్యతిరేకంగా ఓపెన్‌కాస్టుల రద్దు కొరకు సింగరేణి ప్రాంత ప్రజలు పెద్దెత్తున తమ నిరసన గళాలను విప్పి ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు తీశారు. సర్వేకు వచ్చిన సింగరేణి యజమాన్యాన్ని, పోలీసులను అడ్డుకుంటూ, శిలాఫలకాలను ధ్వంసం చేశారు. నిరాహారదీక్షలు చేపట్టి పోరాడుతున్న ప్రజలపై ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పోలీసులను ఊసిగొల్పి లాఠీచార్జి చేపించి, అరెస్టులు చేసి, అక్రమ కేసులు బనాయించి జైళ్ళలో పెడుతున్నాడు. ప్రభుత్వ దమనకాండను ఖండిస్తూ పోరాడే ప్రజలకు మద్దతునిస్తున్న ప్రజా సంఘాలను, హక్కుల నాయకులను, ప్రజాస్వామ్య వాదులను తెలంగాణ ద్రోహులని, అభివృద్ధి నిరోధకులని ముద్రలు వేస్తున్నాడు.

**ఉచితవిద్య:** కే.జీ.నుండి పీ.జీ. వరకు ఉచిత విద్యను అందిస్తానని, కామన్‌స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెడతానని, విద్య ప్రైవేటీకరణను రద్దు చేస్తానని ఎన్నో బహిరంగసభల్లో వాగ్దానాలు చేసిండు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిండు. కూలిపోతున్న ప్రభుత్వ పాఠశాల భవనాలను పునర్నిర్మాణం చేసి పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించలేదు, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చెయ్యక పోగా రేషనలైజేషన్ ప్రక్రియ విధానం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదువుకోవడానికి రావడం లేదనే సాకుతో వందల ప్రభుత్వ పాఠశాలలను మూసివేశాడు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంకు లాభాలు చేకూర్చే విధంగా ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు ఇస్తున్నాడు. పేద విద్యార్థులకు రావలసిన ఫీజు రీయెంబర్స్‌మెంటును కూడా చెల్లించకుండా విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు కల్పిస్తున్నాడు. ప్రభుత్వ విధానాలను ధిక్కరిస్తూ విద్యార్థులందరూ ఐక్యంగా తమ నిరసన గళాలను విప్పి కే.జీ.నుండి పీ.జీ. వరకు ఉచితవిద్యను ప్రవేశపెట్టాలని, ప్రైవేట్ పాఠశాలలను, కళాశాలలను రద్దు చేయాలని ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహారదీక్షలతో తమ నిరసనలు తెలియజేశారు. అంతేకాక, ఉస్మానియా క్యాంపెస్ భూమిని అక్రమించి టీ.ఆర్.ఎస్. ఎం.ఎల్.ఏ. కట్టబోయే స్టార్ హోటల్‌పై దాడి చేస్తే తెలంగాణ ముఖ్యమంత్రి ఈ విద్యార్థుల పోరాట శక్తిని జీర్ణించుకోలేక విద్యార్థులపై పోలీసు మూకలను ఉసిగొల్పి లాఠీచార్జి చేయించి, చిత్రహింసలు పెట్టి అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టినారు.

**ఆదివాసులు:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలోనే పాలకులు కుట్రచేసి ఆదివాసులు జలసమాధి అయినా పర్వాలేదని దుర్మార్గమైన ఆలోచనతో ఆదివాసులు నివసించే 7 మండలాలను పోలవరం ప్రాజెక్టు కోసం సీమాంధ్రకు బదిలిచేశారు. తెలంగాణ పాలకులు బంగారు తెలంగాణ అంటూనే సింగపూర్, చైనా, మలేషియా బహుళజాతి సంస్థల పెట్టుబడులను ఆహ్వానిస్తూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న ఆదివాసీల జీవితాలను నాశనం చెయ్యడానికి పూనుకున్నాడు.

ప్రాజెక్టులు, ఓపెన్‌కాస్టులు, పవర్ ప్లాంట్స్, మైనింగ్, టూరిజం, టైగర్‌జోన్స్ పేర్లతో ఆదివాసీ గూడాలను ఖాళీ చేయించుటకు కుట్ర చేస్తున్నారు.

1/70 చట్టం (భూ బదలాయింపు చట్టం), పెసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం, ఆదివాసీల రక్షణ కొరకు ఉన్న చట్టాలను అమలు చెయ్యకుండా తెలంగాణ కొత్త రాష్ట్రంలో "హరితహారం" పేరుతో దశాబ్దాల కాలంగా ఆదివాసీలు సాగుచేసుకుంటున్న పోడుభూముల్లో బలవంతంగా చెట్లు నాటించి, భూములనుండి గెంటివేస్తున్నారు. ఆదివాసీ గూడాల చుట్టూ ఫారెస్టు అధికారులు కందకాలు తవ్వి అడవులలోకి పశువులు మేతకు వెళ్ళకుండా, అటవీ సంపద తెచ్చుకోకుండా, ఇంటికొరకు వంట చెరుకు తెచ్చుకోకుండా చంద్రశేఖర్ రావు ప్రభుత్వం ఆదివాసీలను అడవి నుండి బేదఖల్ చేయిస్తున్నాడు. నిజాం నిరంకుశ పరిపాలనను తలపింపచేస్తున్నాడు.

టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం రెండున్నర సం॥ల పరిపాలనా కాలంలో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను భ్రమల్లో ముంచుతున్నాడు. రైతులకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ అది నెరవేర్చకపోగా తెలంగాణలో దాదాపు 1800 మంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడితే కనీసం పట్టించుకున్న పాపానపోలేదు. తమ గౌరవ వేతనం కోసం ఆశావర్కర్లు దాదాపుగా 260 రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రికి కనీసం చీమకుట్టినట్లు లేకపోగా మహిళలని కూడా చూడకుండా వారిపై పోలీసులను ఉసిగొల్పి లాఠీచార్జి, టియర్‌గ్యాస్ లతో వారి దీక్షలను భగ్నం చెయ్యడానికి ప్రయత్నం చేశాడు. పేదలందరికీ ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు నిర్మించి ఇస్తుందని ప్రచార సాధనాల్లో హోరెత్తించింది. కానీ కార్యరూపం దాల్చలేదు. పైగా గోదావరి జలాల ద్వారా లక్ష ఎకరాలకు నీరందిస్తానని మెదక్ జిల్లాలో 'మల్లన్న సాగర్' ప్రాజెక్టు పేరుతో 14 గ్రామాలను మూడు పంటలు పండే భూములను ఖాళీ చెయ్యాల్సిందిగా హుకుం జారీ చేశాడు. ప్రజలు మల్లన్నసాగర్‌కు వ్యతిరేకంగా సంఘటితమై ప్రజా ఉద్యమం చేపడితే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా మల్లన్నసాగర్ బాధితులపై లాఠీచార్జి చేయించి, ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించి ప్రజలపై కాల్పులు జరిపించాడు. కే.సీ.ఆర్. నియంతృత్వ పాలనకు ఇది అద్దం పడుతుంది. ఎన్నికల హామీల్లో లక్ష ఉద్యోగాలు ఇస్తానని ప్రగల్భాలు పలికిన కే.సీ.ఆర్. దాదాపు 3 సం॥లు కావస్తున్నా ఇంతవరకు వాటి ఊసే ఎత్తడం లేదు. కాంట్రాక్టు ఉద్యోగాలు క్రమబద్ధీకరిస్తానని, కే.జీ.నుండి పీ.జీ.వరకు ఉచిత విద్యను అందిస్తానని, ఆంధ్రా పాలనలో మూసివేసిన పరిశ్రమలను పునరుద్ధరిస్తానని, దళితులకు 3 ఎకరాల భూపంపిణీ, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని, ఓపెన్‌కాస్టులను రద్దు చేస్తానని హామీ ఇచ్చి తీరా అధికార పీఠమెక్కాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడు.

తన రెండు సం॥ల పరిపాలనా కాలంలో సమస్త వృత్తులను సంక్షోభంలోకి నెడుతూ బంగారు తెలంగాణను నిర్మిస్తానంటూ భజన చేస్తూ ప్రజాధనాన్ని యజ్ఞాలు, యాగాల పేరుతో ఖర్చు చేస్తూ సమస్యల

**(మిగతాది 16వ పేజీలో)**

# "మిషన్ కాకతీయ" పథకంలో అడుగడుగునా అవినీతి

## మట్టిని చల్లారు కాంట్రాక్టర్లు కోట్లు కొట్టేశారు.

నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ తెలంగాణ ఉద్యమంలో అతి ముఖ్యమైన నినాదాలు. సమైక్య పాలనలో కాకతీయ రాజుల కాలంలో తవ్వించిన గొలుసుకట్టు చెరువులన్నీ సర్వనాశనమయ్యాయని, ప్రత్యేక రాష్ట్రంలో చెరువులను బాగుచేసుకుందామని ఉద్యమ కాలంలో నాయకులు కోడై కూశారు. అనుకున్నట్టుగానే రాష్ట్రం సిద్ధించిన తర్వాత చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇందు కోసం వందల కోట్ల రూపాయలను కేటాయించారు.


కాకతీయ రాజుల స్ఫూర్తితో చెరువుల అభివృద్ధి పనులకు "మిషన్ కాకతీయ" అని నామకరణం చేసారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాల్లో అవినీతి అక్రమాలు పెరిగిపోయి కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నది. ఈ అవినీతికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ రైతాంగం పోరాడవలసిన కర్తవ్యం తెలంగాణ రైతాంగం ముందు ఉంది.

తొలుత రెండవ దశలో అభివృద్ధి చేయాల్సిన చెరువులను గుర్తించారు. టెండర్లు పిలవగా బినామీ పేర్లతో అధికార పార్టీ (టి.ఆర్.ఎస్.పార్టీ) నేతలు కాంట్రాక్టులు దక్కించుకున్నారు. ఉద్యమ కాలంలో చేసిన వాగ్దానాలు పనుల్లో చూపించలేక పోయారు. కాంట్రాక్టరు లాభాపేక్షతో చెరువుల్లో నాసిరకం పనులను చేసి అందినంతా దండుకుంటున్నారు. ఆ తర్వాత రెండో దశ చెరువు పనుల సొమ్మును దోచుకునేందుకు సిద్ధమయ్యారు. గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కొనసాగించిన జలయజ్ఞం కార్యక్రమం ధనయజ్ఞంగా మారినట్టుగా, నేటి "కాకతీయ మిషన్" కార్యక్రమం 'కమీషన్ దందా"గా మారిపోయింది.

వరంగల్ జిల్లాలో మొత్తం చిన్ననీటి వనరుల చెరువులు 5,839 కాగా, మిషన్ కాకతీయ మొదటి దశలో 1,173 చెరువుల పరిపాలనా అనుమతి లభించింది. 1,066 చెరువు పనులు పూర్తయ్యాయి. ఇంకా 99 చెరువుల పనులు పూర్తి కావాల్సి ఉంది. రెండో దశకు సంబంధించి 1,258 చెరువుల పునరుద్ధరణ లక్ష్యం కాగా, 1,082 చెరువులకు పరిపాలన అనుమతి లభించింది. ఇందులో 1,043 చెరువుల్లో మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. కాగా మొదటి దశ చెరువు పనులకు సంబంధించి 967 చెరువులకు రూ॥ 174.39 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు. రెండో దశకు సంబంధించి చెరువుల పునరుద్ధరణకు జిల్లాకు రూ॥ 403.24 కోట్లు కేటాయించారు.

### చెరువు కట్టలపై మట్టిని చల్లారు కోట్లు కొట్టేశారు

"మిషన్ కాకతీయ" పనుల్లో నాసిరకం పనులు జరుగుతున్నప్పటికీ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. కాంట్రాక్టర్ల దోపిడీ జరుగుతున్నా అడ్డుకోలేకపోతున్నారు. కొంత మంది అధికారులు నిజాయితిగా నాసిరకం పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తే స్థానిక ఎం.ఎల్.ఎ.ల సమక్షంలో కాంట్రాక్టర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో చెరువుల పనుల్లో కాంట్రాక్టర్లు నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టా రాజ్యంగా దోపిడీకి తెగబడుతున్నారు.



చెరువుకు గండిపడి వృధాగా పోతున్న నీరు

కాంట్రాక్టర్ల స్వార్థాల వల్ల ఇపుడు ఏకంగా చెరువుల ఉనికికే ప్రమాదం ముంచుకొచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టలపై నామమాత్రంగా చల్లిన మట్టి చిన్న పాటి వర్షానికే చెదిరిపోయి గండ్ల రూపంలో బయటపడుతుంది. చెరువు కట్టలను వెడల్పు చేస్తూ పటిష్టపరిచేందుకు మట్టిని పోసి రోలర్‌తో తొక్కించాల్సి ఉండగా, నిబంధనలను పాతరవేసి కేవలం చెరువు కట్టలపై మట్టిని చల్లారు. గ్రామస్తులు నిలదీస్తారన్న ఆలోచనతో కట్టపై మట్టిపోసి రోలర్‌తో తొక్కించినట్లు ఫోటోలకు ఫోజులిచ్చారు. దీంతో చిన్న నీటి వర్షాలకే కట్టమీద పోసిన మట్టి అంతా చెదిరిపోతుంది. 2016 వర్షకాలంలో భారీ వర్షాల మూలంగా తెలంగాణలోని దాదాపు 100 చెరువులు గండ్లు పడ్డాయి. చాలా చెరువుల మట్టి కొట్టుకుపోయింది. కరీంనగర్ జిల్లాలోని మధ్య మానేరు డ్యామ్‌కు గండిపడి వేలాది ఎకరాల భూములు ముంపుకు గురి అయినాయి.

సాధారణంగా చెరువులో పూడిక తీయడంతో గతం కంటే చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. అదే స్థాయిలో కట్టల నిలువ సామర్థ్యం పెరిగినప్పటికీ కట్ట పటిష్టత పెరగలేదు. దాంతో చెరువుల ఉనికి ఇపుడు ప్రమాదంలో పడింది.

### 'మిషన్ కాకతీయలో" కమీషన్ దందా

మిషన్ కాకతీయ పనులకు అధికార పార్టీ బడా నాయకుల గ్రహణం పట్టింది. కమీషన్ ఇవ్వాలంటూ సదరు నాయకులు కాంట్రాక్టర్లను డిమాండ్ చేయడంతో పనులు ప్రారంభం కావడం లేదు. వరంగల్ జిల్లా రఘునాథపల్లి మండలంలోని నిడిగొండ గ్రామంలోని ఊర చెరువును మిషన్ కాకతీయ రెండో దశ కింద మరమ్మతులు చేపట్టేందుకు రూ 82.60 లక్షలు మంజూరయ్యాయి. నేటికి పనులు మాత్రం ప్రారంభం కాలేదు. "పనులు ప్రారంభించాలంటే మంజూరైన నిధుల్లో 5 శాతం మాముళ్లు ముందుగానే ముట్ట చెప్పాలంటూ" అధికార పార్టీ నాయకుడు హుకుం జారిచేసాడు. దాంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. వర్షకాలం నెత్తిమీదికి వచ్చినా కాని నేటికి పనులు ప్రారంభం కాలేదు. రెండు నెలలక్రితం ఇదే నాయకుడు కాంట్రాక్టర్‌లతో

తన నివాసంలో సమావేశం ఏర్పాటు చేసి పనులు దక్కించుకున్న ప్రతి కాంట్రాక్టరు 5 శాతం పర్సేంటేజ్ ఇవ్వాల్సిందేనని, లేని పక్షంలో పనులు చేయరాదని ఆర్డర్ చేసాడు. కాదంటే ఇక్కడ పనులు చేయలేరు. "మా ఏరియాలో మేమే పనులు చేస్తాం" అంటూ గట్టిగా నాయకులు హెచ్చరించారు. ఈవిధంగా "మిషన్ కాకతీయ" పనులు తెలంగాణలోని అన్ని జిల్లాలలో ఆగిపోయి తెగిపోయిన చెరువులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. పడుతున్న వర్షపు నీరు చెరువులో చేరే నీరంతా వృధా అయ్యే అవకాశం ముందుకు వచ్చింది.

**నట్టేట ముంచిన 'మిషన్ కాకతీయ"**

మిషన్ కాకతీయలో భాగంగా చేపట్టిన చెరువుల అభివృద్ధి పనుల్లో అవినీతి చోటు చేసుకుంది. చెరువు పనుల్లో నాణ్యత లోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పథకంలో భాగంగా వరంగల్ జిల్లా మంగపేట మండలం మారుమూల గ్రామమైన బామ్మాయి గూడెంలో లొద్దికుంట చెరువుకు రెండో విడతలో రూ॥ 15॥ లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో చెరువు పునరుద్ధరణ పనులకు కాంట్రాక్టరుకు టెండర్ ద్వారా అప్పచెప్పింది. సదరు కాంట్రాక్టరు చెరువు పూడికతీతతో పాటు, రెండు తూములు, మత్తడిని, చెరువుకట్ట నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పనులు సదరు కాంట్రాక్టరు వర్షకాలంలో చేపట్టడంతో తూముల వద్ద షట్టర్స్‌ను సరిగా బిగించకపోవడం, మత్తడి నిర్మాణం ఎత్తుగా నిర్మించాడని, పనులు నాసిరకంగా చేపట్టినట్లు ఆయకట్టు అదివాసీ రైతులు ఆరోపిస్తున్నారు. ఆ కాంట్రాక్టరు జోరు వానలో సైతం పనులు చేపట్టి అర్థాంతరంగా ముగించారు.

వర్షకాలంలో కురిసిన వానలకు ఈ చెరువు నిండింది. కానీ ఆ నీరు నిల్వ ఉండకుండా చెరువుకట్టకు పలుచోట్ల బుంగలు పడటం, తూములకు షట్టర్స్ సరిగా బిగించకపోవడంతో చెరువు నీరు తూముల నుంచి బయటకు వెళ్ళిపోయాయి. ఈ చెరువు కింద ఆదివాసీ రైతులు ఎంతో కష్టంతో వరినార్లు పోసుకోని, నాట్లు కూడా వేసుకున్నారు. తీరా ప్రస్తుత సీజన్‌లో వానలు కురవక పోవడంతో వేసుకున్న నాట్లకు సాగునీరు లేక ఎండి పోయినాయి. 150 ఎకరాల ఆయకట్టు భూమి కొత్త చెరువు నిర్మాణంతో చుక్క నీరు నిల్వ లేకుండా వృధాగా పోవడంతో వేసిన వరినాట్లు పూర్తిగా ఎండిపోయాయని రైతులు లబోదిబోమంటున్నారు.

"మిషన్ కాకతీయ" పనుల వలన మాకు ఒరిగిందేమి లేదని, చెరువులో నీరు లేక పంటలు పండక ఈ సం॥రం మొత్తం తమ కుటుంబాలు అరిగోస పడుతున్నారు. మిషన్ కాకతీయ పథకం వలన లొద్దికుంట చెరువు అభివృద్ధి దేవుడెరుగు కాని, ఉన్న నీరు పొలాలకు లేకుండా గోదావరి నదిలో వృధాగా కలిసిపోయాయని ఆయకట్టు ఆదివాసీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తలాపున మున్నేరు ఉన్నా చెరువుల్లో చుక్క నీరు లేదు**

తలాపునే మున్నేరు వాగు ప్రవహిస్తున్నా చెరువుల్లో చుక్క నీరు లేని దుస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామ రైతుల పోరాట ఫలితంగా 2015 సం॥లో గుండ్రాతిమడుగు ఎత్తిపోతల పథకానికి మైనర్ ఇరిగేషన్ నిధులు రూ7.34 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ ఎత్తిపోతల పథకం పనులు పూర్తికావచ్చాయి. ఆయకట్టు క్రింద రైతులంతా పత్తి సాగు చేస్తున్నారు. ఈ వర్షాలు పత్తిసాగుకు సరిపోతుండటంతో ఎత్తిపోతల పథకం నీటిని రైతులు వాడుకోవడం లేదు. దాంతో గుండ్రాతిమడుగు ఎత్తిపోతల పథకం నీటిని వాడుకోకపోవడంతో నీరంతా వృధాగా పోతుంది.

గుండ్రాతి మడుగు ఎత్తిపోతల పథకం క్రింద మహదేవుని, ఎల్లారెడ్డి, శంబుని చెరువులు ఉన్నాయి. ఇందులో శంబుని చెరువు రైల్వే ట్రాక్ అవుతల ఉండటంతో ఈ చెరువుకు లిఫ్ట్ పైప్‌లైన్ వేయడం పూర్తికాలేదు. కాబట్టి మిగతా రెండు చెరువులను లిఫ్ట్ నీటితో నింపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ రెండు చెరువులను నింపితే 300 ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని రైతులు పేర్కొంటున్నారు.

గ్రామంలోని చెరువులను నింపాలంటే ఆయకట్టు పరిధిలోని రైతులంతా ఎకరాకు రూ॥ 500 ఇవ్వాలని కాంట్రాక్టర్ డిమాండ్ చేస్తున్నాడు. రైతాంగం నీటి సమస్యను ప్రధానంగా ఎదుర్కొంటున్నారు. 'మిషన్ కాకతీయ' పథకం ద్వారా రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన నీటి సమస్యను ప్రభుత్వం పరిష్కరించడం లేదు. నీటి సమస్య పరిష్కారం కొరకు ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడం రైతాంగం యొక్క తక్షణ కర్తవ్యం.

ప్రియమైన ప్రజలారా!

తలాపున జీవనదులు ప్రవహిస్తున్నా తెలంగాణ గుక్కెడు తాగునీళ్ళకు నోచుకోలేదు. భూములు నెర్రెలు బాసిన తీరు మన తలరాతను తలపించాయి. అందుకే చుట్టూ నీళ్ళున్నా చుక్క నీరు దొరకని ఎడారిగా మారిన తెలంగాణను గోదావరి, కృష్ణ నదీ జలాలతో సస్యశ్యామలం చేయాలని కలలుగని కోటి ఆశలతో కొత్త రాష్ట్రం కోసం ఎదిరి చూసాం. నియోజకవర్గానికి లక్ష ఎకరాల చొప్పున కోటి ఎకరాలకు సాగు నీరు కావాలని ఉద్యమం నాడు గొంతెత్తి చాటింది. టి.ఆర్.ఎస్. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నదీ జలాల వినియోగానికి సమగ్ర జల విధానం రూపొందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంది. తీరా చూస్తే 'నోటితో నవ్వి నోసలుతో ఎక్కిరించినట్లు'గా ప్రాజెక్టుల నిర్మాణ ప్రతిపాదనలు కనిపిస్తున్నాయి. "మిషన్ కాకతీయ", "మిషన్ భగీరథ" పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ రైతాంగానికి గొప్ప వరంగా గొప్పలు చెప్పుకుంటున్నది. ప్రాజెక్టుల రీడిజైనింగ్ ఒక అన్యాయమని ప్రశ్నిస్తే అధికార పార్టీ ప్రతి విమర్శే జవాబు అంటుంది. బాధితులకు అండగా ఉన్న ప్రజా సంఘాలపై బెదిరింపు చర్యలకు దిగుతుంది. ఆనాటి కాకతీయ రాజులపాటి చిత్తశుద్ధి గాని, ప్రజల పట్ల బాధ్యతగాని చూపని టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం నడుపుతున్న అవినీతి సామ్రాజ్యానికి వ్యతిరేకంగా, ఐక్యంగా పోరాడుదాం.

★

## ఈ హంతక ప్రభుత్వాలు 'నయీం' లాంటి వాళ్ళను సృష్టిస్థాయి. అంతమొందిస్థాయి

## ఈ ఫాసిస్టు రాజ్యాన్ని కూల దోయడం ద్వారానే

## 'నయీం' లాంటి నరహంతకులను లేకుండా చేయగలం

నల్లదండు ముఠా నాయకుడు, అత్యంత కిరాతకుడు, గ్యాంగ్‌స్టర్ అయిన మహమ్మద్ నయీమోద్దీన్ (నయీం) మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ లోని మిలినీయనమ్ అపార్ట్‌మెంట్‌లో ఆగస్టు 8 ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో హతమయ్యాడు. నయీంగా పేరు మోసిన ఈ హంతకుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలియని ప్రజలెవరు వుండరంటే అతిశయోక్తి కాదు. ఈ కాల్పుల అనంతరం టీ.వీ. ప్రసారాల్లో, వార్తా పత్రికల్లో నయీం గురించిన వార్తలు పుంఖాను పుంఖాలుగా వెలువడుతున్నాయి. పోలీసులు జరుపుతున్న విచారణలో కోట్లాది రూపాయల నగదు, బంగారం, వెండి, భూకబ్జాల డాక్యుమెంట్లు, డైరీలు, కంప్యూటర్లలో సెటిల్మెంట్లు వివరాలతో పాటు 22 ఇండ్లు, వాడి ఇతర అకృత్యాల వివరాలు చాల వాటిని పోలీసులు ప్రకటించారు. ఈ వార్తలు బయటికొచ్చిన వెంటనే టీ.డీ.పీ. మాజీ మంత్రి ఉమా మాధవరెడ్డి ఈ కేసులో నన్ను ఇరికించాలని ప్రభుత్వం చూస్తున్నదని ప్రకటన చేసింది. ఒకప్పటి రాష్ట్ర పోలీసు ఇంటలిజెన్స్ అధిపతి శ్రీరాం తివారీ మాట్లాడుతూ మావోయిస్టుల అణిచివేతకు నయీంను వుపయోగించుకొన్నామని ఒకటి రెండు సార్లు కలిసానని ప్రకటించాడు. మాజీ డీ.జీ.పీ., ప్రస్తుత బీ.జే.పీ. నాయకుడైన దినేశ్‌రెడ్డి తాను డీ.జీ.పీ.గా ఉన్న సమయంలో నయీమోద్దీన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించామని, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు తాను ఆదేశాలు కూడ జారీ చేశానని, కాని అప్పటి ప్రభుత్వాలు నయీంను పట్టుకొనే విషయంలో అంతగా ఆసక్తి చూపలేదని, నయీంతో మాజీ డీ.జీ.పీ.లకు సంబంధాలు వున్నాయని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని అందమైన అబద్ధాన్ని చెప్పాడు. "అయితే నయీంతో ఎస్.ఐ.బీ., డీ.ఐ.జీ.లకు సంబంధాలున్నాయని ఒప్పుకున్నాడు. ఈ చీకటి సామ్రాజ్యంతో రాజకీయ నాయకులకు, ఎం.ఎల్.ఏ.లకు, పోలీసు అధికారులకు గల సంబంధాలపై పత్రికల్లో వస్తున్న వార్తలు ప్రజలను అబ్బుర పరుస్తున్నాయి.

నయీం ఎన్‌కౌంటర్ తర్వాత ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి, దర్యాప్తుకు ఆదేశించింది. సిట్ దర్యాప్తులో 72 కేసులు నమోదు చేశామని, 80 మందిని అరెస్టు చేశామని, హైదరాబాద్‌తో సహా నల్గొండ, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ కేసులు వెలుగు చూశాయని సిట్ ఉన్నతస్థాయి సమావేశంలో చర్చకు వచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారు.

అయితే అధికారికంగా ప్రభుత్వం ఇప్పటివరకు నయీంతో రాజకీయ నాయకులు, పోలీసు అధికారులకు గల సంబంధాలను బయట పెట్టక పోవడంతో విభిన్న వర్గాల నుండి సోషల్ మీడియాలో 12 మంది రాజకీయ నాయకులు, 21 మంది పోలీసు అధికారుల పేర్లు బహుళ ప్రచారంలో ఉన్నాయి.

నయీం అనే నల్లదండు ముఠా నాయకుడు, నేర సామ్రాజ్యంలో ఇంతగా ఎదగడానికి వెనుక రాజ్యం ఏ పాత్ర వహించిందో తెలుసుకోవలసి ఉంది. పోలీసులు, రాజకీయ నాయకులు చివరకు న్యాయస్థానాలు కూడ యిందుకు ఎలా సహకరించాయో కూడ వివరంగా తెలుసుకోవాలి.

రాజ్యం తన నాలుగు స్తంభాల ద్వార ప్రజా ఉద్యమాలను, తిరుగుబాట్లను అణిచివేస్తుంది. వీటితో పాటు స్వయంగా కొన్ని వ్యవస్థలను రూపొందించుకుంటుంది. ప్రైవేట్ వ్యక్తులను, గ్యాంగులను చేరదీస్తుంది. వీరి ద్వారా విప్లవకారులపై, ప్రజాస్వామిక వాదులపై దాడులు చేయిస్తుంది. ఈ దాడుల్లో రాజ్యం హస్తం లేనట్లుగా ప్రచారం చేసుకుంటుంది. ఇలాంటి విధానాల ద్వారానే ఈ నల్లదండు ముఠాలు ఉనికిలో వస్తాయి.

యాంటీ ఇన్‌సర్జన్సీ, ఎల్.ఐ.సీ. పాలసీలో భాగంగా ప్రపంచమంతటా పాలకవర్గాలు ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చాయి. సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా ఇజ్రాయిల్ అనేక దేశాల్లోని పోలీసు అధికారులకు ఈ శిక్షణను యిస్తున్నాయి. పాలస్తీనా ఉద్యమాన్ని అణచడానికి అమెరికా, బ్రిటన్‌ల సహకారంతో ఇజ్రాయిల్ ఈ విధానాన్ని అతి క్రూరంగా అమలు చేస్తున్నది. ఇలాంటి విధానాన్ని వుమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసులు 80 వ దశకం నుండి అధ్యయనం చేయడం ప్రారంభించారు. అందులో భాగంగా స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరోను, గ్రేహౌండ్స్ కమోండో బలగాలను వ్యాస్ నాయకత్వంలో తీర్చి దిద్దారు. ఈ రాష్ట్రంలోనే గాక దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయడంలో భాగంగా ఈశాన్య రాష్ట్రాల్లో పంజాబ్, కశ్మీర్‌ల్లో ముందుకు వచ్చిన గెరిల్లా పోరాటాన్ని అణచడానికి ప్రయోగించారు. ప్రస్తుతం మావోయిస్టు నాయకత్వంలో జరుగుతున్న దండకారణ్య, బీహార్, జార్ఖండ్ పోరాటాలను అణచడానికి ఈ ఎత్తుగడలను ప్రయోగిస్తున్నారు. ఈ ఫాసిస్టు క్రూర దమనకాండలో భాగంగా నల్లదండు ముఠాలను ఏర్పాటు చేసి విప్లవకారులను హత్యలు చేయించడం జరుగుతున్నది. కశ్మీర్‌లో కుక్కేప్యార్ నాయకత్వంలో ఇలాంటి ముఠాలు ఏర్పడి పనిచేశాయి. పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ విధమైన ముఠాలను ఏర్పరిచింది.

ఛత్తీసగఢ్‌లో ఉద్యమం నుండి దిగజారిపోయిన వారితో జిల్లా బలగాలను ఏర్పాటు చేసి విప్లవకారులపై దాడులు చేయడమే గాక సల్వాజుడుం లాంటి పరమ నిరంకుశ హత్యాకాండలో రాజ్యం అనుసరించిన హేయమైన పద్ధతులు నాగరిక సమాజాన్ని దిగ్భ్రాంతికి

గురిచేశాయి. రాజ్యం ప్రయోగించిన వ్యక్తులు, సంస్థలు జరిపే ఈ హత్యాకాండ సమాజాన్ని భయకంపితుల్ని చేస్తుంది.

80వ దశకంలో సీ.పీ.ఐ.(ఎం.ఎల్.) పీపుల్స్‌వార్ నాయకత్వంలో జరుగుతున్న విప్లవోద్యమం పాలకవర్గాలకు కలవరం పుట్టించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమాన్ని అణచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అనేక నిర్బంధ విధానాల్ని చేపట్టాయి. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రయోగశాలగా ఎంచుకొని నిర్బంధాన్ని వివిధ పద్ధతుల్లో అమలు చేశాయి. అందులో భాగంగా కోవర్ట్ ఆపరేషన్‌లు నిర్వహించడం, నల్లదండు ముఠాలను సృష్టించి చీకటి హత్యలు చేయడం ప్రారంభించాయి. అలా 1993 నవంబర్ 18న మొదటిసారి కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో ఆర్గనైజర్ (దళ కమాండర్) అయిన భూపతిని, యిద్దరు సహచరులను వారు నిద్రలో ఉండగా చంపి, ఆయుధాలాతో సహ లొంగిపోయిన కత్తుల సమ్మయ్య ఉదంతంతో ప్రారంభించి, నల్లగొండ జిల్లాలో 1998 ఏప్రిల్ 4న సోమ్లానాయక్ అనే కోవర్ట్ నిద్రలో ఉన్న కృష్ణపట్టి దళ నాయకుడుతో పాటు నల్గురు కామ్రేడ్స్‌ను కాల్చి చంపాడు. కరీంనగర్ జిల్లాలో 1998 ఏప్రిల్ 11 రాత్రి కరీంనగర్ జిల్లా కార్యదర్శి, స్పెషల్‌జోన్ కమిటీ సభ్యుడైన మల్కాపురం భాస్కర్‌ను నిద్రలో ఉండగా కాల్చిచంపిన జడల నాగరాజు అనే కోవర్టు రాత్రికి రాత్రే పారిపోయి పోలీసుల రక్షణలో చేరాడు.

ఈ కోవర్టు ఆపరేషన్లను ప్రభుత్వం బాహటంగా సమర్థిస్తూ వీరందరికి భారీ నజరానాలను యివ్వడంతో పాటు వారికి రక్షణ కల్పించింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కోవర్టు ఆపరేషన్లను సమర్థిస్తూ బాహటంగా ప్రకటనలు యిచ్చాడు. 2004 సం॥లో పీపుల్స్‌వార్ పార్టీకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చర్చలు జరుగుతున్న సందర్భంలోనే వరంగల్–ఖమ్మం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యాదన్నపై కోవర్టు లక్ష్మణ్ చేసిన దాడిలో కా. యాదన్న గాయపడగా ఇద్దరు కామ్రేడ్స్ అమరులైనారు. చర్చలను రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించిన నిర్బంధంలో నిజామాబాద్ జిల్లా మానాలలో కోవర్టు ఆపరేషన్ చేపట్టి అతి పాశవికంగా జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రమేష్‌తో పాటు 13 మందిని హత్య చేసింది. ప్రభుత్వం యిలాంటి కోవర్టు హంతకుల పైన హత్యానేరం మోపకుండా బహుమతులు యివ్వడంపైన పౌరహక్కుల సంఘం నాయకుడు బాలగోపాల్ కోర్టులో వాజ్యం వేయగా, 2002 ఫిబ్రవరి 6న కోర్టు యిచ్చిన తీర్పుతో ఈ వ్యవహారంలో న్యాయస్థానం జోక్యం అవసరం లేదని కొట్టివేసింది. రాజ్యం తన అంగాలను అన్నింటిని సమన్వయించి ఎలా అణచివేత కొనసాగిస్తుందో ఈ ఉదాహరణ చక్కగా బహిర్గత పరుస్తున్నది.

నయీమోద్దీన్ వ్యాస్ హత్య కేసులో ముద్దాయిగా జైలు జీవితం కొనసాగిన కాలంలోనే పోలీసులతో సంబంధాలు పెట్టుకొని, క్రమంగా పోలీసులకు నమ్మినబంటుగా మారాడు. జైలునుండే తన కుటుంబానికి ఆదేశాలు యిచ్చి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈదన్నను హత్య చేయించాడు. ఈ వ్యవహారం జైలు కమ్యూన్‌లో చర్చకు రాగానే కమ్యూన్ కమిటీ నయీంను కమ్యూన్ నుండి బహిష్కరించింది. అప్పటినుండి నయీం పోలీసులకు మరింత దగ్గరవుతూ పార్టీపై కక్ష పెంచుకున్నాడు. జైలు నుండే నల్లగొండ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దివాకర్‌ను హత్య చేయడానికి కుట్ర పన్నాడు. ఈ ప్రయత్నాలు బెల్లి లలితకు తెలిశాయని ఆమెను 1999 మే లో పరమ క్రూరంగా హత్య చేయించాడు. జైలు నుండి వచ్చిన నాలుగైదు నెలల్లోనే అప్పటి రంగారెడ్డి జిల్లా ఎస్.పీ. సురేందర్ బాబు గైడెన్స్‌లో పౌరహక్కుల సంఘం సంయుక్త కార్యదర్శి కామ్రేడ్ టి. పురుషోత్తంను 1999 నవంబర్ 23న పట్టపగలు హత్యచేశాడు. ఇలా విప్లవ కారులను బహిరంగంగా హత్య చేయడంతో రాజ్యం, పోలీసులు నయీంను మరింతగా ఉపయోగించుకోవడం ప్రారంభించారు. అప్పటి నుండి నయీం గ్యాంగ్ చేతిలో ఆజంఅలీ, కనకాచారి, మన్నెం ప్రసాద్, కళింగరావు, గంటి ప్రసాదం, ఆకుల భూమయ్య వంటి విప్లవ ప్రజా సంఘ నాయకులను హత్యలు చేసాడు. తన చీకటి కార్యకలాపాలకు అడ్డంకిగా ఉన్న మరెందరినో హత్యలు చేశాడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న కాలంలో యధేచ్ఛగా నయీం హత్యాకాండ కొనసాగింది. గ్రీన్‌టైగర్స్, క్రాంతి సేన పేర్లతో హత్యాకాండ, బెదిరింపులు నిత్యం జరుగుతూ వచ్చాయి. నయీం కార్యకలాపాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనే కాక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాలకు విస్తరించాయి. మావోయిస్టులను అణచడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన ఐ.జీ. కల్లూరితో కూడ సంబంధాలు వున్నాయని వార్తలు వచ్చాయి. ఎస్.ఐ.బీ. దేశవ్యాప్తంగా విప్లవకారులపై నిఘాపెట్టి అరెస్టు చేసి నాయకత్వాన్ని హత్యలు చేయడానికి నయీం ముఠాను వాడుకున్నట్లుగా నిర్ధారణ అవుతున్నది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వలన రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాలు లాండ్ సెటిల్‌మెంట్లకు కేంద్రాలుగా మారాయి. రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు ఈ సెటిల్‌మెంట్లు చేపట్టి కోట్ల రూపాయలు వెనుకేసుకునే పథకంలో భాగంగా నల్లదండు ముఠా నాయకులను ఉపయోగించుకోవడం ప్రారంభించారు. అందులో భాగంగా నయీం, బయ్యపు సమ్మిరెడ్డి, జడల నాగరాజు లాంటి వారిని రంగంలోకి దింపారు. ఈ రంగంలో నయీం తన మాఫియా సామ్రాజ్యాన్ని విస్తరించాడు. తన సామ్రాజ్యానికి అడ్డు వచ్చిన వాళ్లను తొలగించాడు. అందులో భాగంగా బయ్యపు సమ్మిరెడిని హత్య చేసాడు. నయీం చచ్చిన తర్వాత తమ భూములను అన్యాయంగా ఆక్రమించుకొన్నాడని పేద రైతులు ఎందరో బహిరంగంగా ప్రకటిస్తున్నారు. తమ వారిని కిడ్నాప్ చేసి మాయం చేసాడని బాధితులు చెబుతున్నారు. నయీం చేసిన హత్యలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.

తెలుగుదేశం, కాంగ్రెస్ పాలనలోనే గాకుండా ప్రత్యేక తెలంగాణ

రాష్ట్రం ఏర్పడి తెలంగాణ రాష్ట్ర సమితి (టీ.ఆర్.ఎస్.) అధికారానికి వచ్చిన రెండేళ్ళ పాటు నయీం తన కార్యకలాపాలను తిరుగు లేకుండా కొనసాగిస్తూ వచ్చాడు. టీ.ఆర్.ఎస్. పార్టీలో ఉన్న నల్లగొండ జిల్లా రాజకీయ నాయకులు నయీంతో సంబంధాల్లో ఉన్నారు. గత ప్రభుత్వాల్లో పోలీసు అధికారిగా నయీంతో సంబంధాలు ఉన్న ఎస్.ఐ.బీ. చీఫ్ శివధర్ రెడ్డిని నయీం సంఘటన తర్వాత బదిలీ చేసింది. నిజానికి చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రి కాగానే నల్లగొండకు చెందిన ఈ పోలీసు అధికారిని విశాఖ పట్నంలో పోస్టింగ్ నుండి ఏరికోరి తెచ్చుకున్నాడు. గత రెండేళ్ళుగా ఈ ప్రభుత్వంకు చెందిన రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు నయీంను వాడుకోవడం జరుగుతూనే ఉంది.

ఈ కాలంలో నయీం భూసెటిల్మెంట్లలో, భూములు కొనుగోలులో టీ.ఆర్.ఎస్. ప్రభుత్వానికి సవాలుగా మారాడు. సోలీపేట రాం లింగారెడ్డి, ఈటెల రాజేందర్, వేముల వీరేశం, ఫైళ్ళ శేఖర్ రెడ్డి లాంటి మంత్రులు, ఎం.ఎల్.ఏ.లకు బెదిరింపులు వచ్చినా ప్రభుత్వం స్పందించలేదు. దాంతో నయీం మాత్రం మరింత రెచ్చిపోయి ముఖ్యమంత్రి కే.సీ.ఆర్.కు సమీప బంధువులైన రామేశ్వర్‌రావుతో పాటు ఏం.పీ. విశ్వేశ్వరావు లాంటి వారికి బెదిరింపులు రావడం, యాదాద్రి భూముల్లో నయీం దందాలు నడపడంతో కే.సీ.ఆర్. నయీంను తొలగించి వేయడానికి నిర్ణయం తీసికోకతప్పలేదు.

అంతేగాక సోహ్రబుద్దీన్, కేసర్ బీ ఎన్‌కౌంటర్‌లో సీ.బీ.ఐ. దర్యాప్తులో ఏకైక సాక్షి నయీం కూడ కావడం వలన అమిత్ షా, నరేంద్ర మోడీలు ఎప్పటికైనా యిరుకాటంలో పడే అవకాశం ఉన్న కారణంగా బీ.జే.పీ.కి నయీంను తొలగించడం అవసరం కాగా, టీ.ఆర్.ఎస్. బీ.జే.పీ.కి రోజు రోజు దగ్గర కావడానికి ప్రయత్నిస్తుండడం వలన నయీంను తొలగించే పనికి వెంటనే ముఖ్యమంత్రి పూనుకోవాల్సి వచ్చింది.

ఒక వ్యవస్థ పెంచి పోషించిన వ్యక్తి, ఆ వ్యవస్థకే ముప్పుగా మారినప్పుడు తొలగించుకోక తప్పదు. అధికారంలో ఉన్నవారికి ఈనాటి పరిస్థితుల్లో ప్రమాదంగా మారినపుడు పాలకవర్గం నయీంను ఎన్‌కౌంటర్‌లో చంపించింది. కాని నయీంను చేరదీసిన పాలకవర్గాలు గత 26 ఏళ్ళుగా రాష్ట్రంలో ఎంత విధ్వంసం సృష్టించాయో చెప్పనక్కరలేదు.

పాలకవర్గాలు నయీంను అడ్డు తొలగించుకొన్నప్పటికీ, ఆ వ్యవస్థకు అలాంటి వ్యక్తులు అవసరం ఉండనే ఉంటుంది. అందుకే మళ్ళీ క్రాంతి సేన అంటూ బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. ఈ బెదిరింపుల ద్వారా నయీంను వదిలించుకొన్న సందర్భంలో సమాజంలో తొలగిపోతున్న భయవాతావరణాన్ని అలాగే నిలిపి ఉంచడానికి పాలకవర్గాలు చేస్తున్న మరో ప్రయత్నం తప్ప వేరేమి కాదు. అసలు మావోయిస్టులను, ప్రజాసంఘాల నాయకులను హత్యలు చేసిన వారిని ఇప్పటివరకు అరెస్టు చేయకుండా వదిలి పెడుతున్నారు.

అంతే కాకుండా ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లాల ఐ.జీ. కల్లూరిని హత్య చేయడానికి మావోయిస్టులు నయీంతో డీల్ కుదుర్చుకున్నారనే నమ్మశక్యంగాని విష ప్రచారాన్ని మీడియాలో పోలీసులు ప్రచారంలో పెట్టారు.

ఈ వ్యవస్థయే నయీం లాంటి హంతకులను సృష్టిస్తుంది. అక్కర తీరిపోగానే అంతం చేస్తుంది. కాని ఎప్పుడూ నల్లదండు ముఠాలను సృష్టిస్తూ ఉంటుంది. ఈ రాజ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి, దాన్ని అంతం చేయడం ద్వారానే ఇలాంటి దుర్మార్గాలను అంతం చేయగలమని ప్రజలంతా గుర్తించాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామ్య హక్కులను, విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి పాలకవర్గాలు నడిపిన ఈ క్రూర విధానాలు ఎంతటి విధ్వంసం సృష్టించాయో ప్రజలందరికీ నయీం ఉదంతం వలన మరో మారు అవగాహన అయింది.

కాబట్టి ప్రజలందరూ ముక్తకంఠంతో ఈ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలు ఖండించాలి. వీటికి వ్యతిరేకంగా పోరాడాలి. నయీం మాఫియా ముఠాతో హత్య చేయబడిన విప్లవ కారుల హత్యలపై, పౌర హక్కుల సంఘాల నాయకుల హత్యలపై, ప్రజాస్వామిక వాదుల హత్యలపై న్యాయ విచారణ జరిపించాలి. నయీం ముఠా లూటీ చేసిన పేద ప్రజల ఆస్తులు వారికి తిరిగి యిప్పించాలని, ఈ నేర సామ్రాజ్యానికి సహకరించిన రాజకీయ నాయకులపై, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, నిష్పక్షపాత విచారణ కోసం సిట్ స్థానంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపాలని ప్రజలంతా డిమాండ్ చేయాలి.

★

---

**(11వ పేజీ తరువాయి)**

ఫలాలు ఆ ప్రాంత ప్రజలకే దక్కాలి. ఆ ప్రాంత ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన కనీస బాధ్యత ఆ ప్రభుత్వాల కర్తవ్యం. ట్రాక్టర్లు, లారీలు లాంటి రవాణ వాహనాలను కూడా ఈ నిర్మాణాలలో ఉపయోగించడం లేదు. ఇవన్నీ బయట నుండి తెచ్చుకుంటున్నారు. దీని వల్ల కూడా ఈ ప్రాంత ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది.

ప్రపంచబ్యాంకు ఏజెంటైన చంద్రబాబు ఈ విధంగా కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ ఈ రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువాల కార్పోరేట్ కంపెనీలకు అమ్మివేస్తూ నవ్యాంధ్ర రాజధాని నిర్మాణంలో పీడిత ప్రజలను సమిధలను చేస్తున్నాడు. సమిధలవుతున్న పీడిత, శ్రామిక ప్రజలందరు మిలిటెంట్ పోరాటాలను కొనసాగించడం ద్వారా తమ హక్కులను కాపాడుకోగల్గుతారు. ప్రజల ప్రత్యామ్నాయ ప్రభుత్వ నిర్మాణం ద్వారా మాత్రమే ప్రజానుకూల రాజధానులను నిర్మించుకోగల్గుతాం. ప్రత్యామ్నాయ ప్రజల అధికారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నాం. ★

# నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఎవరి కోసం?

సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను నెరవేర్చే విధానంగానే పాలక వర్గాలకు నరేంద్ర మోడీగాని, చంద్రబాబుగాని రాజధానులను, సిటీలను నిర్మిస్తారు తప్ప పీడిత ప్రజల కోసం నిర్మాణం చేయరు. ప్రజల అభివృద్ధి పేరుతో బహుళజాతి సంస్థల, వ్యక్తుల అభివృద్ధి నామూనానే అమలు చేస్తారు. నవ్యాంధ్ర రాజధాని విషయంలో చంద్రబాబు ఉన్నత వర్గాలకు ఉపయోగపడే విధంగా, పీడిత ప్రజలను నాశనం చేసే రాజధానిని నిర్మాణం చేయబోతున్నాడు. వీటితో పాటు ఇంకా బహుళజాతి సంస్థలకు మేలు చేసే అనేక పథకాలు కొనసాగిస్తున్నాడు.

**నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణం**

ఈ రెండు సం॥రాల పాలనలో జరిగిన అతిపెద్ద ప్రజావంచన రాజధాని నిర్మాణం. దీనికోసం ఒక కమిటీని నియమించి దాని సిఫారసులను బుట్టదాఖలు చేసి ప్రత్యేక చట్టం తెచ్చారు. అది 5 కోట్ల ప్రజల పాలనా అవసరాలు తీర్చే రాజధానిని ఏర్పాటు చేసే చట్టంగా కాక, ప్రజల పాలన అవసరాలు తీర్చే రాజదానిని ఏర్పాటు చేసే చట్టంగా కాక, పిడికెడు మంది రియల్‌ఎస్టేట్ వ్యాపారుల, కార్పోరేట్ల ప్రయోజనాల కోసం తయారయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నూతన రాజధాని అవసరమని, దానిని కృష్ణా నది తీరంలో పుష్కలమైన నీటివసతి వున్న జరీబు భూముల్లో తుళ్ళూరు ప్రాంతంలో సింగపూర్ సిటీ తరహాలో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించాడు. దేశంలో ఎక్కడా అమలులో లేనటువంటి భూసేకరణ అనే కొత్త చట్టాన్ని తీసుకువచ్చి, రైతుల వద్ద నుండి భూములు లాక్కునే ప్రయత్నం మొదలు పెట్టాడు. ఈ ప్రయత్నం వలన సంవంత్సరానికి మూడు పంటలు పండిచే, నిత్యం పచ్చగా ఉండే పంటపొలాలు బీడులుగా మారాయి. ఆ భూములను రియల్‌ఎస్టేట్‌గా మార్చి ఎకరాల్లో కొని గజాల్లో అమ్మే దళారులకు అప్పగించడానికి మార్గం సుగుమం చేయడం, ప్రభుత్వమే అధికారిక రియల్‌ఎస్టేట్ బ్రోకర్‌గా పని చేయడానికి సిద్ధపడడమే ఆ చట్టం యొక్క లక్ష్యం. భవన నిర్మాణాలలో వాటా, నష్టపరిహరం, ఆర్థిక ఆదాయం, భవిష్యత్తు ఆదాయం వంటి మాయమాటలతో కొందరు రైతులను ఆకర్షించి భూమి సేకరించి ఆ ప్రాంతంలో భూమి లేని నిరుపేదలకు, వ్యవసాయం మీద, ఇతర సేవావృత్తుల మీద ఆధారపడిన లక్షలాది ప్రజలకు తీరని అన్యాయం చేశాడు. దేశంలో కొత్తగా ఏర్పడిన చాలా రాష్ట్రాలు పాత నగరాల పక్కన కొత్త రాజధాని నగరాలు నిర్మించుకున్నాయి.

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అంతవరకు వున్న నగరాలకన్నా మెరుగైన రాజధానిని నిర్మించాలని అనుకోవడం తప్పు కాదు. కాని ఆంధ్ర ప్రదేశ్ రాజధాని సమస్య అంత సులభమైనది కాదు. రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాంతాలలో అప్పటికే రెండు ప్రాంతాల ప్రజలలో వివక్షకు గురవుతున్నామన్న భావన ఉంది. రాయలసీమ ప్రజలలో గతంలో ఆంధ్ర రాష్ట్ర, రాజధాని తమకు ఇచ్చినట్టే ఇచ్చి తప్పించారనే మనస్తాపం ఉంది. ఆ మనస్తాపాన్ని బలోపేతం చేసే శ్రీబాగ్ ఒడంబడిక ఉల్లంఘన ఉంది. రాష్ట్రంలో అన్ని రకాలుగానూ మొదటి స్థానంలో ఉన్న విశాఖపట్నం రాజధాని అయితే బాగుండునని ఉత్తరాంధ్ర ప్రజల్లో కోరిక ఉంది. కాని ప్రజా ఆకాంక్షలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా తొక్కివేస్తూ తెలుగుదేశం ప్రభుత్వం అమరావతిని రాజధాని చేసింది.

నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం పేరుతో 34 వేల ఎకరాల భూమిని భూసమీకరణలో తీసుకోవడం వలన ప్రధానంగా తుళ్ళూరు, మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో ఉన్న 20 గ్రామాల శ్రామిక ప్రజలు, రైతులు, మహిళలు, కౌలురైతులు, వ్యవసాయాధారిత చేతివృత్తుల వారి జీవితాల్లో పెను విధ్వంసాన్ని సృష్టించాడు. ఈ విధ్వంసం వల్ల బాగా నష్టపోతున్నది యస్‌సి. యస్‌టి, బిసి, మైనార్టీ రైతులు, మహిళలు. ఈ పొలాల్లో పని చేసే వీళ్ళకు, వీరి కుటుంబ సభ్యులకు పనిలేక, తినడానికి తిండిదొరకక, పిల్లల చదువులకు ఫీజులు కట్టలేక అతిహీనమైన పరిస్థితులలో నేడు బ్రతుకుతున్నారు.

రైతుల దగ్గర భూములు తీసుకున్న చంద్రబాబు జరీబు భూములకు మంచి ప్యాకేజీ పేరుతో 400 గజాల కమర్షియల్ ఏరియా 1000 గజాల నివాస ప్రాంతమని కేటాయించాడు. ఇది కాకుండా 10 సంవత్సరాల వరకు ఎకరానికి 50 వేల చొప్పున కౌలు చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. అదే మెట్ట ప్రాంత భూములకు 200 గజాల కమర్షియల్ ఏరియా, 800 గజాల నివాస ప్రాంతమని సంవత్సరానికి 30 వేల కౌలుగా 10 సం॥రాలు ఇస్తానని కూడా హామీ ఇచ్చాడు. కాని దశాబ్దాల తరబడి ఆ భూములనే నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటున్న కౌలు రైతులకు ఎర్రని ఏగాని కూడా చంద్రబాబు చెల్లించలేదు. సమీకరణలో భూములు ఇవ్వని రైతులపై అక్రమ కేసులు బనాయించి, పంటలను తగలబెట్టి రాజధాని ప్రతిపాధిత గ్రామాల్లో పోలీసు కవాతులు చేయించి ప్రజల్ని భయ భ్రాంతులకు గురిచేశాడు. తరతరాల నుండి ఆ భూముల్నే నమ్ముకొని వ్యవసాయం చేసుకొంటున్న కౌలు రైతులు ఇప్పటి వరకు రైతువారిగా గుర్తింపు, గౌరవంతో బ్రతికారు. భూములు కోల్పోయిన తర్వాత చేయడానికి ఏ విధమైన పని దొరకక ఆత్మ గౌరవాన్ని చంపుకొని ఏదైనా పని చేద్దామని పక్కనే ఉన్న పట్టణాలకు వెళ్ళితే పనులు దొరకని పరిస్థితిలో ఉన్నారు. పుట్టిన గడ్డను, ఇప్పటి వరకు నమ్ముకున్న భూమిని, గ్రామంతో ఉన్న బంధాన్ని, అనుబంధాన్ని వదులుకొని దూర ప్రాంతాలకు వలస వెళ్ళి దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితులు అలా ఉంటే, రాజధాని ప్రాంతంలో సుమారు 70 వేల మంది శ్రామిక రైతులు, మహిళలు నిరంతరం వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఒక్క శ్రామిక రైతు, మహిళా రోజుకు రూ. 300 నుండి రూ. 500 వరకు సంపాదిస్తారు. అదే పూలతోటలో పని చేసే మహిళలు రోజుకు రూ. 800 వరకు సంపాదిస్తారు. వీళ్ళందరి బ్రతుకుల్లో సింగపూర్ తరహ రాజధాని నిర్మాణం పేరుతో పాలకులు నిప్పులు పోస్తున్నారు. ఈ రోజు చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం వలన 70 వేల శ్రామిక కుటుంబాల్లో ఒక కుటుంబానికి ఐదుగురు చొప్పున ఉన్న 3.5 లక్షల మంది శ్రామిక ప్రజలు రోడ్డున పడ్డారు.

శ్రామిక ప్రజల కుటుంబాల్లో ఎక్కువ శాతం పురుషులు

పెయింటింగ్, రాడ్‌బెండింగ్ వంటి భవన నిర్మాణ పనులకు వెళ్తున్నా, ఆ పని సరిగా దొరకక ఆ వచ్చిన కూలి డబ్బులు సారాకి తగలేస్తున్నారు. చంద్రబాబు నాయుడు గ్రామ గ్రామాన మద్యాన్ని బెల్టు షాపుల ద్వారా యేరులై పారిస్తున్నాడు. దీని వలన కుటుంబాల్లో అశాంతి, అలజడులు పెరుగుతున్నాయి. రైతులకు రకరకాల ప్యాకేజిలు ఇచ్చిన ప్రభుత్వం శ్రామిక మహిళలకు, చేతివృత్తుల వారికి, కౌలు రైతులకు ఏ విధమైన ఉపాధితో కూడిన నష్టపరిహారం చెల్లించడం లేదు. ఈ భూములను ప్రభుత్వం లాగేసుకోవడం వలన కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు ఉపాధి కోల్పోయి దిక్కుతోచని పరిస్థితిలో చావలేక, బ్రతకలేక బ్రతుకులీడుస్తున్నారు.

ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు పోరాటాలు చేసిన పిదప ప్రభుత్వం రకరకాల ఏజెన్సీల ద్వారా తప్పుడు సర్వేలు చేయించి 70 వేలుగా వున్న వ్యవసాయ కూలీల సంఖ్యను 18 వేలుగా తేల్చి, ఆ 18 వేల మంది నుండి కూడా సరైన ఆధారాలు లేవని 5 వేల మందిని తొలిగించారు. ఆ తర్వాత రాజధాని ప్రాంత 29 గ్రామాల నుండి 13 వేల మందికి మాత్రమే వ్యవసాయ కూలీలని తేల్చి నెలకు ఒక కుటుంబానికి ఒకరికి మాత్రమే రూ. 2,500 పెన్షన్ రూపంలో ఇస్తున్నారు. ఈ రూ 2.500 లు కూడా బ్యాంక్ ఎకౌంట్స్ ఎవరి పేరుతో ఉన్నా, పురుషులు మాత్రమే ఆ డబ్బు తీసుకోవడం వలన అవి కూడా సక్రమంగా ఇంటికి చేరకుండా మధ్యలో మద్యం మహమ్మారి ఆ డబ్బును మింగేస్తున్నది.

పెన్షన్ రూపంలో ఇచ్చి మద్యం రూపంలో ప్రభుత్వం లాగేసుకుంటున్నది. 70 వేల శ్రామిక కుటుంబాలే కాకుండా ఆ ప్రాంతంలో భూముల మీద ఆధారపడిన చిన్న వ్యాపారస్తులు కొన్ని వేలమంది ఉన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, రకరకాల పండ్లు, పూల వంటి వాటి మీద ఆధారపడి వందలాది మంది బ్రతుకుతున్నారు. అలాగే వేలాది మంది గేదెలను మేపుకుంటూ వాటి ద్వారా పాల వ్యాపారం చేస్తున్నారు. ఇవే కాకుండా ఈ ఉత్పత్తుల ద్వారా నగరాల్లో వ్యాపారం చేసుకొని కుటుంబాలను పోషించుకొనే వారు అనేక మంది ఉన్నారు. శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుండి కంది, అరటి, చేమ దుంపలను తీయడానికి వందలాది శ్రామిక కుటుంబాలు ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడే గుడారాలు వేసుకొని తమకు అవసరమైన డబ్బు సంపాదించుకొని వెళ్లుతుంటారు. వీరందరి జీవితాలను చంద్రబాబు రాజధాని పేరుతో విధ్వంసం చేసి ప్రజల్ని పుట్టకొకర్ని, చెట్టుకొకర్ని చేశాడు. ఏ రాష్ట్ర ప్రభుత్వమైన భూసేకరణ చేసేటపుడు 70శాతం రైతుల ఆమోదం ఉంటేనే భూములు తీసుకోవాలని, అదే పారిశ్రామిక కేంద్రాలకు ఇవ్వడానికైతే 80 శాతం రైతుల ఆమోదం ఉండాలని చెప్పే భూసేకరణ చట్టాన్ని తుంగలో త్రొక్కి, రైతుల్ని భయపెట్టి బలవంతంగా భూములు లాక్కున్నాడు. రైతుతో సహ ఆ భూముల మీద పరోక్షంగా ఆధారపడ్డ ప్రతి ఒక్కరికి కూడా ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలనీ భూ సేకరణ చట్టంలో ఉంది. కానీ రైతుకూలీల ప్రస్తావనే లేకుండా, ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టకుండా, 34 వేల ఎకరాల భూముల్ని లాక్కున్న ఏకైక ప్రజాద్రోహి ముఖ్యమంత్రిగా చంద్రబాబు చరిత్రలోకి ఎక్కాడు.

శ్రామిక ప్రజల, శ్రామిక కుటుంబాల, కౌలు రైతుల విషయంలో ఇంత కఠినంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు రాజధాని ప్రాంతంలో దళితుల చేతుల్లో ఉన్న భూమి అసైన్డ్ భూమి అని రైతులందర్ని మభ్యపెట్టి బెదిరించాడు. ఎకరానికి 2 కోట్లు విలువున్న ఆ భూమిని 10లక్షల నుండి 20 లక్షలవరకు మాత్రమే అమ్ముకునే విధంగా, అది కూడా తన సామాజిక వర్గానికే దక్కే విధంగా కుటిల ప్రయత్నం చేశాడు. ఈ విధంగా తన పార్టీ వారికి, తన సామాజిక వర్గానికి 20 వేల ఎకరాల్ని పరోక్షంగా కట్టబెట్టాడు. ఈ 20 వేల ఎకరాల్లో వ్యవసాయం చేసేది దళిత, పీడిత కులాల రైతులే. తన సామాజిక వర్గం, తన దళారీ వర్గం కొన్న అసైన్డ్ భూమి మొత్తాన్ని రెగ్యులైజ్ చేసి తన వారికి అప్పగించే కుట్రలో భాగంగానే ప్రభుత్వం చట్టం చేస్తోంది. ఇదే కాకుండా అబ్బరాజుపాలెం నుండి ఉండవల్లి దాకా ఉన్న వేలాది ఎకరాల లంక భూముల్ని కూడా ప్రభుత్వంలో ఉన్న పెద్దల పేర చేసుకుంటున్నారు. బలహీనవర్గాల రైతుల్ని బెదిరించి స్వాధీనం చేసుకుంటున్నారు. కౌలు రైతుల, వ్యవసాయ కూలీల, పేద ప్రజల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు తన వర్గానికీ మాత్రం అన్నీ కట్టబెడుతున్నాడు.

నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం పేరుతో సింగపూర్, జపాన్, జర్మనీ వంటి ప్రపంచదేశాలు తిరుగుతున్నాడు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తూ, మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి, ఇక్కడ ఏ విధమైన ప్రతిఘటనా పోరాటాలు లేవు, హక్కులు అడిగే యూనియన్లు, కార్మిక సంఘాలు గాని లేవు, మీరు స్వేచ్ఛగా మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి ఇక్కడ సంపదను దోచుకోవచ్చు అని అంటున్నాడు. మీ పెట్టుబడులకు భరోసాగా మా ప్రభుత్వం ఉంటుందని భూమి, నీరు, విద్యుత్ అన్నీ ఉచితంగానే ఇస్తామని ప్రపంచ పెట్టుబడిదారుల దగ్గర సాగిల పడుతున్నాడు.

మన రాజధాని-మన అమరావతి అని ఉద్యోగస్తుల నుండి, స్కూలు పిల్లల దాకా చందాలు వసులు చేసి, అంతటితో ఊరుకోక, నా ఇటుక-నా అమరావతి అని ఇటుకలు కొనిపించాడు. ఊళ్ళ నుండి అర చెంబెడు నీళ్ళు, ముంతెడు మట్టి తెప్పించుకున్నాడు. మోడీ తెచ్చిన పార్లమెంటరీ మట్టితో పావనం చేసి వేద మంత్రాలతో రాజధాని నిర్మాణం ప్రారంభించాడు. లౌకికవాద దృక్పథంతో పారిపాలన చేయవల్సిన ముఖ్యమంత్రి రాజధాని శంకుస్థాపనకు ఆ ప్రాంత రైతులు, ప్రజలతో సంబంధం లేకుండా దేశ, విదేశీ పెట్టుబడిదారులను కలుపుకొని హిందూ మతాచారాలతో పూజలు జరిపించాడు. శంకుస్థాపనలు, భూమి పూజల పేరుతో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడు. తాత్కాలిక రాజధాని పేరుతో భవనాల నిర్మాణాలను, సామ్రాజ్యవాద కంపెనీలకు, బడా పారిశ్రామిక వేత్తలకు కాంట్రాక్టులు కట్టబెట్టి కమీషన్ల కొరకు కక్కుర్తి పడుతున్నాడు.

రాజధాని నిర్మాణంలో పని చేయడానికి ఆ ప్రాంత ప్రజలెవరు అర్హులు కానట్టు, కాంట్రాక్టర్లు ఇతర ప్రాంత కార్మికుల చేత పనులు చేయించుకుంటున్నారు. ఎక్కడైనా తమ భూమిగాని, తమ ఇంటినిగాని ప్రభుత్వం తీసుకొని అభివృద్ధి చేస్తే ఆ అభివృద్ధి ఆ ఆదాయం, అభివృద్ధి

**(మిగతాది 9వ పేజీలో)**

# మల్లన్నసాగర్ రద్దు కోసం పోరాడుతున్న ప్రజలకు అండగా నిలబడదాం

**మల్లన్న సాగర్ ప్రాజెక్టు** నిర్మాణం జరిగితే తెలంగాణ ప్రజలకు ఒరగబోయేది ఏమీలేదు. దానివల్ల తెలంగాణలో 14 గ్రామాలు, ఇరవై వేల ఎకరాల భూమి, వేలాదిమంది ప్రజల జీవితాలు ఛిద్రం అవుతాయి.

తెలంగాణ ప్రజలకు సాగు, తాగునీరు అందించడానికి స్వయంగా ముఖ్యమంత్రి కే.సి.ఆర్. అసెంబ్లీలో ఈ ఆర్థిక సంవత్సరంలో 25 వేల కోట్లతో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి నీరు అందిస్తామని వాగ్దానం చేసి రెండు సంవత్సరాలు దాటినా, ఇప్పటివరకు మాటలు కోటలు దాటినాయి కాని ఆచరణలో అడుగు ఆవగింజను దాటలేదు. గత ఉమ్మడి రాష్ట్రంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు నీటి ప్రాజెక్టులను నిర్మాణం చేస్తానని జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞంగా మార్చినాడు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు 'మిషన్ కాకతీయ' పేరుతో కాసుల కాకతీయగా మార్చినాడు.



హైవే రోడ్డును దిగ్బంధం చేస్తున్న మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు

మిషన్ కాకతీయ లక్ష్యం 46 వేల చెరువులను మరమత్తు చేయడం. ఇప్పటి వరకు పావు వంతు చెరువులు కూడా పూర్తి కాకున్నా సాగు నీటిని పరుగులెత్తిస్తున్నామని ప్రచార ఆర్భాటంతో ఊదరకొడుతు ప్రజలను మభ్యపెడుతున్నాడు. తెలంగాణలో పూర్తి కాని ప్రాజెక్టులను రీడిజైనింగ్ పేరుతో వేల కోట్ల వ్యయాన్ని పెంచి ప్రజా ధనాన్ని బడా కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ప్రభుత్వం సిద్ధమైంది. గతంలో కట్టిన ప్రాజెక్టులతో ముంపుకు గురైన గ్రామస్థులకు పునరావాసం కొరకు ఇప్పటివరకు ఎలాంటి ఆధారం చూపించక పోగా కనీసం నష్టపరిహారం ఇవ్వలేదు. ముంపు బాధితులు గత ప్రభుత్వాలకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ఆలకించిన నాధుడు లేడు. కొంత మంది గ్రామస్తులు బతకడానికి ఎలాంటి ఆధారం లేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఎవరు కాదనలేని సత్యం.

మల్లన్న సాగర్ ముంపు గ్రామం ఏటిగడ్డ కిష్టాపూర్ వాగులో, కోమటి చెరువులో కరువుకాలంలో కూడా నీళ్ళు ఉంటాయి. వాగు ఒడ్డున ఎక్కడ తవ్వినా నీళ్లు ఊరుతాయి. ఆ గ్రామాల భూముల కింద నీటి నిలువలు ఉండడంతో సంవత్సరానికి రెండు పంటలు, కొందరు మూడు పంటలు పండిస్తారు. భూమి లేని రైతు కుటుంబాలు ఈ గ్రామాల పై ఆధారపడి కూలి పని చేస్తు జీవిస్తారు.

పుష్కలంగా నీరు వుండి పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్న నిరుపేద రైతు కుటుంబాలకు జీవనాధారం కల్పిస్తున్న గ్రామాలను మల్లన్న సాగర్ రిజర్వాయర్ కోసం నీటిలో ముంచడానికి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు వ్యూహరచన చేస్తున్నాడు. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 21 గ్రామాలు 3,112 ఇండ్లు, వేలాది ఎకరాల వ్యవసాయ భూములు నీట మునిగి పోతాయి. 15 వేల మంది ప్రజలు ఎలాంటి జీవనాధారం లేక రోడ్డున పడతారు.

మల్లన్న సాగర్ బాధితులు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం కావాలంటే ప్రాజెక్టు వ్యతిరేకులుగా చిత్రించి ప్రభుత్వమే పక్క జిల్లాలోని రైతులను రెచ్చగొట్టి ముంపు బాధితుల పై దాడికి పురిగొలుపుతుంది. ప్రభుత్వ దుశ్చర్యలను నిరశిస్తూ మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు తమ గళాలను విప్పి మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో "మా భూములతో పాటు మా బతుకులు నాశనం అవుతాయని ధర్నాలు చేపట్టి మా భూములను ఇవ్వమని, మా ప్రాణాలు ఉన్నంత వరకు మా భూముల కొరకు పోరాడుతామని" ప్రాజెక్టును అడ్డుకుంటున్న ప్రజలపై లాఠీచార్జి చేసి అరెస్టులు చేసి అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతున్నది. ఇది అన్యాయమని మల్లన్న సాగర్ ముంపు బాధితుల న్యాయ పోరాటానికి మద్దతుగా నిలబడిన ప్రజాస్వామిక వాదులపై, పౌరహక్కుల నాయకులపై ఎదురు దాడిచేస్తున్నది. వారిని అభివృద్ధి నిరోధకులని, తెలంగాణ ద్రోహులని టి.ఆర్.ఎస్. ప్రభుత్వం మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంది. ప్రజలకు మద్దతు లేకుండా చేస్తుంది.

తెలంగాణ వస్తే బంగారు తెలంగాణ చేస్తానని మత్తులో ముంచినాడు. మీ కాలికి ముల్లు గుచ్చుకుంటే నా పంటితో తీస్తానని మాయ చేసినాడు. ఇప్పుడేమో 14 ఊర్లను, పంట భూములను ముంచి 15 వేల మంది ప్రజలను అనాథలను చేసి నడి రోడ్డుపైకి వెళ్లగొడుతున్నాడు. అధునాతన పద్ధతులతో వ్యవసాయం చేయాలని ఇజ్రాయిల్ తరహా పద్ధతులని, పాలి హౌజులలో లాభదాయకంగా రకరకాల పంటలు పండించ వచ్చని, వ్యవసాయ క్షేత్రాలను విడిది కేంద్రాలుగానూ, రిసార్ట్‌లుగాను పచ్చటి పంట పొలాలతో కళకళలాడుతు వుండవచ్చని ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపెడుతున్నాడు. "ముఖ్యమంత్రీ! నువు చెప్పినన్ని డబ్బులు మా దగ్గర లేవు. వందల ఎకరాల భూములు లేవు పేదవాళ్లకు బ్యాంకులు అప్పులు ఇవ్వవు. ఒకవేల బ్యాంకులు అప్పులు ఇచ్చిన వాటిని తిరిగి చెల్లించే శక్తి ప్రజలకు లేదు. మాకు కావలిసింది నీవు చెపుతున్న బంగారు తెలంగాణ కాదు. అందులో భూమి సాగు చేయరాదు. పంటలు పండవు. ప్రజల బ్రతుకులు మారవు. మాకు కావలసింది

భూమి. భూమిని నమ్ముకుని భూగర్భ జలాలతో ఉన్నంతలో సాగు చేసుకుంటు పంటలు పండించుకుంటు కరువు, కాటకాలు తెలియకుండా మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు బ్రతుకుతున్నారు. కాని, మల్లన్న సాగర్ నిర్మాణంతో 14 గ్రామాల ప్రజల జీవితాలు ఛిద్రం అవుతాయి" అని ప్రజలు అంటున్నారు.

తాత ముత్తాతలు, తల్లి దండ్రులు ఈ మట్టిలో పుట్టి ఈ మట్టిలో పెరిగి ఈ మట్టిలోనే నేల కొరిగినారు. వారి బిడ్డలుగా పుట్టి పెరిగి వారసత్వంగా సంక్రమించిన భూములను దున్నుకుంటు, పూర్వీకుల స్మృతి చిహ్నాలను చూసుకుంటు, వారి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటు, జీవిస్తున్న 14 గ్రామాల ప్రజలను రోడ్డున పడవేసి పంట పొలాలను, ఇండ్లను నీటిలో ముంచుతున్న మల్లన్న సాగర్ రిజర్వాయర్ ఎవరికోసం? ఒక వేల ప్రజల కోసమైతే ముంపుకు గురౌతున్న ప్రజలకు ఈ నీటితో సాగుచేసుకొని, పంటలు పండించుకోవడానికి భూములు ఇప్పిస్తారా! అలా చేస్తే, మా పూర్వికుల బొందల పై నుండి వచ్చిన నీటితో భూములు సస్యశ్యామలమై, పొలాలు పచ్చని పైర్లతో పంటలు పుష్కలంగా చేతికి వచ్చినాయని సంతృప్తి చెందుతాం. ఇవేమి చేయకుండా ఎకరాకు ముష్ఠి 5, 6 లక్షలు మొఖాన పడవేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారు. మీరు ఇచ్చే ఐదు, ఆరు లక్షలతో వందగజాల ఇళ్ళ స్థలం కూడా రాదు. మరి బతకడానికి వ్యవసాయ భూముల సంగతి ఏమిటి? రోజు కూలీ చేసుకొని వృత్తులపై ఆధారపడి జీవించే వారు ఏమి కావాలి?" అని అడుగుతున్నారు.

**2013 భూసేకరణ చట్టం** ప్రకారం ప్రాజెక్టులు నిర్మించేటపుడు దాని వల్ల ఏర్పడే పరిణామాలు తెలుసుకోవాలి. ప్రాజెక్టు నిర్మాణంతో ప్రభావితమయే గ్రామాల, గ్రామ పంచాయితీల గ్రామసభల్లో చర్చ జరపాలి. పర్యావరణ నష్టం, ప్రజలకు జరిగే లాభనష్టాలు వివిధ అంశాలను పరిగణలోకి తీసుకొని అంచనా వేయాలి. దీనిని అంతటిని 'ఎక్స్‌పర్ట్ కమిటీ' పారదర్శకంగా పరిశీలన చేసి భూసేకరణ చేపట్టడం సరైనదా? కాదా అని తెలియ చేయాలి. వీటి సమాచారం మొత్తం అందరికి అందుబాటులో ఉంచాలి. నీటి సౌకర్యాలు ఉండి, రెండు పంటలు పండే భూములను ప్రాజెక్టుల కొరకు సేకరించరాదు. ప్రత్యామ్నాయం లేకపోతే సేకరించ వచ్చు. అది కూడా జిల్లా, రాష్ట్రం మొత్తంలో వ్యవసాయ భూపరిమితికి లోబడి వుండాలి. ఇలా సేకరించిన భూములకు సమానమైన బీడు భూములను వ్యవసాయ భూములుగా సాగులోకి తీసుకురావాలి. ప్రభుత్వం ఆహార భద్రతను పెంచడం కొరకు ఆ భూమికి సమానమైన విలువను మొత్తం జమ చేసి వ్యవసాయంలో పెట్టుబడిగా పెట్టాలి.

ప్రాజెక్టుల నిర్మాణంలో వ్యవసాయ భూములు కోల్పోయిన ఆ గ్రామ ప్రజలకు ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో కనీసం ఎకరం భూమిని కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీలకైతే వారు కోల్పోయిన భూమికి సమానమైన భూమిని కేటాయించాలి. అలాగే ముంపునకు గురయ్యే గ్రామ ప్రజలకు నష్ట పరిహారంగా పునర్నిర్మాణం చేసే కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించాలి. రోడ్లు, డ్రైనేజీ, సురక్షిత మంచి నీరు, పశువులకు తాగేనీరు, పశువులను మేపుటకు భూములు, రేషన్ షాపులు, పోస్టాఫీసులు, రవాణా వసతులు, స్మశాన వాటికలు, కరెంటు సరఫరా, అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఆట స్థలాలు, కమ్యూనిటి హాలులు, పశుసేవ సంస్థలు మొదలగునవి ముంపు గ్రామ బాధితులకు ప్రభుత్వం కల్పించాలి. కానీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి మల్లన్నసాగర్ ముంపు బాధితులకు ఎకరాకు 6 లక్షలు మొఖాన కొట్టి చేతులు దులుపుకోవాలనుకున్న ప్రభుత్వం నిర్ణయాన్ని ధిక్కరిస్తు "మా జీవితాలను నాశనం చేసి మా బతుకులను రోడ్డున పడవేసే" మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ముంపు గ్రామ ప్రజలు నిరసన గళాలను విప్పారు. ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులతో పోరాటాలు చేస్తుంటే భరించలేని ముఖ్య మంత్రి చంద్రశేఖర్ రావు 'పిడికెడు మంది లేని మీరు నా నిర్ణయాన్ని దిక్కరిస్తారా' అని ఫ్యూడల్ ఆహంభావంతో పోలీసులను ఉసిగొల్పి లాఠీ చార్జీ చేయించి, అరెస్టులు చేసి, అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టించాడు. అంతటితో ఆగకుండా పోలీస్ బాసుతో మంతనాలు జరిపి మల్లన్న సాగర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న ప్రజలపై పోలీస్ నిర్బంధం పెంచి ఏటిగడ్డ కిష్టాపూర్‌లోని నిరహారదీక్ష చేస్తున్న రైతులపై లాఠీచార్జి చేయించాడు. గ్రామంలో (బి.ఎస్.ఎఫ్.) క్యాంప్ పెట్టి భయోత్పాతం సృష్టించాడు. పోలీసులు అతి ఉత్సాహంతో స్వామి భక్తిని చాటుకునేందుకు 'మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకించండి' అని గిరాయిపల్లి దళం పేరుతో రెండు వాల్‌పోస్టర్లు రాసి, గ్రామంలో అతికించి గతంలో మావోయిస్టులతో సంబంధాలు వున్నాయని నాయిని స్వామి, నూనె నరసింహులు అనే ఇద్దరు యువకులను తోగుట పోలీసులు అరెస్టు చేసి తీవ్రమైన చిత్రహింసలు పెట్టారు. మీ రాతలు అవునా, కాదా తెలుకుందామనే సాకుతో కొన్ని పోస్టర్లను వాళ్లతో రాయించి ఆ పోస్టర్లను గ్రామాలలో పోలీసులే వేసి 5 రోజుల తరువాత 124 (ఏ) సెక్షన్ క్రింద రాజద్రోహం కేసు పెట్టి జైలుకు పంపినారు. కేవలం మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలను అణిచి వేయడానికి అన్ని రకాల కుతంత్రాలు పన్నుతున్నాడు.

**ఇంజనీర్లు చెప్పుతున్న నిజాలు**

జలాశయాలు ఎక్కడ నిర్మించినా ఆవిరి అయిపోవడం, ఇంకిపోవడం జరుగుతుంది. మల్లన్న సాగర్ 50 టి.ఎం.సి.ల నీటి ప్రాజెక్టు అనుకుంటే అందులో ఉండే నీరు 40 శాతం మాత్రమే. ప్రభుత్వం ప్రకటించినట్లు పరిశ్రమలకు 10 టి.ఎం.సి.ల నీరు విడుదల చేస్తే ఇక మిగిలేది 30 టి.ఎం.సి.ల నీరు మాత్రమే. ఒక టి.ఎం.సి.తో పదివేల ఎకరాలకు నీరు అందించవచ్చు. 30 టి.ఎం.సి.ల నీరు 3 లక్షల ఎకరాలకు సరిపోతుంది. ప్రభుత్వం మాత్రం 18 లక్షల ఎకరాలకు అంటూ, మెదక్ జిల్లాతో పాటు పక్కనున్న నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలకు సాగు నీరు అందిస్తామని డాంబికాలు పలుకుతుంది. ప్రభుత్వం చెపుతున్నట్టు భువనగిరి, ఆలేరు ప్రాంతాలకు, కామారెడ్డి,

ఎల్లారెడ్డి ప్రాంతాలకు సింగూరు, నిజాంసాగర్ జలాశయాలకు నీరందించడం సాధ్యంకాదు. వాస్తవాలు ఇలావుంటే ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చి అవాస్తవాలను, వాస్తవాలుగా ప్రచారం చేస్తూ మాటలగారడితో ప్రజలను మభ్యపెట్టి 'గాలిలో మేడలు కట్టి' 'ఊహల్లో విహరింప చేస్తు నిజామాబాద్, నల్లగొండ జిల్లాల రైతులను రెచ్చగొట్టి మల్లన్న సాగర్ నిర్మాణానికి అనుకూలంగా ఆందోళనలు సృష్టించే కుహనా రాజకీయాలతో నీచపు ఎత్తుగడలకు పూనుకుంటున్నారు.

**మల్లన్న సాగర్ కట్టాలని పంతం పట్టిన ముఖ్యమంత్రి**

మల్లన్న సాగర్ ముంపుకు గురి అవుతున్న గ్రామాలు వేములగట్టు, తురక బజార్‌పల్లి, పల్లేసాడు, దస్తగిరి నాగారం, తిప్పారాం సింగారం, ఎర్రవల్లి, మంగోలు, కాశెగుడిసెలు, కోవాయిపల్లి, ఒడ్డెర కాలని, తుక్కాపూర్, తోగుట, ఎల్లారెడ్డి పేట, మాతేపల్లే, మేదినిపూర్, ముద్దారం ఈ పద్నాలుగు గ్రామాల భూమి పొరల్లో పుష్కలంగా నీటి వనరులు వున్నాయి. తాగటానికి నీళ్లున్నాయి. చెరువులు, కుంటలతో పాటు కూడవెల్లి వాగునీటితో కళకళలాడుతు వుంటుంది. రెండు చెక్ డ్యామ్‌లు, వందలాది మోటర్లతో నీళ్ళు తీసి సంవత్సారానికి రెండు, మూడు పంటలు పండిస్తారు. సంవత్సరం మొత్తం కూరగాయల సాగు చేస్తారు. పచ్చని పంట పొలాలతో సస్యశామలంగా ఉన్న గ్రామాలను నీటిలో ముంచడానికి మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాడు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు నీరు అందించి లక్షల కుటుంబాల అభివృద్ధి కొరకు మీరు ఈ మాత్రం త్యాగం చేయాలని అబద్దాలను నిజాలుగా ప్రచారం చేస్తున్నాడు.

గ్రామాలను ముంచి పొలాలను నీటిపాలు చేసి 'మా బతుకులను, మా పిల్లల భవిషత్తును' నాశనం చేసే ఈ ప్రాజెక్టును కట్టవద్దని ముంపు గ్రామ ప్రజలంతా ముక్త కంఠంతో నినదిస్తే పాశవికంగా పశుబలంతో అణిచివేయ చూస్తుండు. ముంపు గ్రామ ప్రజలకు అండగా మద్దతు తెలియజేస్తున్న ప్రజలను, ప్రజాస్వామిక వాదులను, మేధావులను అభివృద్ధి నిరోధకులని, తెలంగాణ ద్రోహులని ముద్ర వేసి ఎదురు దాడి చేస్తున్నాడు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు నీరు పారడం అటుంచి ఈ ప్రాజెక్టు నీళ్ల మొదటిగా ఎర్రవల్లి గ్రామానికి పోతాయి. ఆ గ్రామంలో ముఖ్యమంత్రి ఫార్మ్‌హౌజ్ ఉంది. ఆ భూముల ధరలకు రెక్కలు వచ్చి ఆకాశాన్ని అంటుతాయి. వీటితో పాటు సాగర్ పొడుగూతా రెండు వైపుల వున్న చంద్రశేఖర్ రావు, కే.టీ.ఆర్., హరీష్‌రావు భూములతో పాటు వారి బంధువుల, అనుయాయుల భూములకు కూడ విపరీతమైన ధరలు పెరుగుతాయి. ఈ భూములను పరిశ్రమలకు అమ్ముకొని వందల కోట్ల రూపాయాలను దండుకోవాలనే ధనాశతో మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి పథకం రూపొందించినాడు.

**తడ్కపల్లి చెరువుకు** బదులు మల్లన్న సాగర్ నిర్మాణం ఎందుకు? మల్లన్న సాగర్ నిర్మాణం ఎవరికి లాభం? తడ్కపల్లి స్వయాన నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు అత్తగారి గ్రామం. తడ్కపల్లి చెరువును జలాశయంగా మారిస్తే అత్తగారి గ్రామం ముంపుకు గురౌతుంది. అత్తగారి గ్రామాన్ని కాపాడడానికి అల్లుడు హరీష్‌రావు ప్రాజెక్టు స్థలాన్ని మార్చాడు. ఏటిగడ్డ కిష్టాపూర్ వేములగట్టు ప్రాంతంలో మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేస్తే ఒక వైపు ముఖ్యమంత్రి ఫార్మ్‌హౌజ్, పొలాలు. మరొక వైపు కొడుకు నియోజకవర్గం ఇంకో వైపు అల్లుడి నియోజకవర్గంలలో వారి బంధువులకు, అనుయాయులకు సొంతంగాను, బీనామిగాను వందల ఎకరాల భూములు వున్నాయి. ఆ భూములకు నీరు అందించడానికి, ఆ భూములను అమ్ముకొని అధిక సొమ్మును చేసుకోవడానికి, పరిశ్రమలకు నీరు అందించడానికి ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కొడుకు, అల్లుడు కలిసి 14 గ్రామాలను, వేల ఎకరాల వ్యవసాయ భూములను, 3,112 ఇండ్లను నీటిలో ముంచి 15 వేల మంది గ్రామస్తులను రోడ్డున పడవేసే ప్లాన్ రూపొందించారు.

నిజానికి ఈ ప్రాంతంలో 50 టి.ఎం.సి.ల నీటి ప్రాజెక్టు అవసరం లేదు. ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు వున్నాయి. కూడవెల్లి వాగులో ఎండాకాలంలో కూడా నీళ్ళు ఉంటాయి. ఈ వాగు మీద చెక్ డ్యామ్‌లు కూడ వున్నాయి. చుట్టుపక్కల ఎక్కడ తవ్వినా పైననే నీళ్లుపడుతాయి. ఎండ కాలంలో కూడ వందలాది మోటర్లతో నీళు ృతోడి పంటలతో పాటు కూరగాయలు పండిస్తారు. ఒక్క ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామం నుండి రోజు హైదరాబాద్ రైతు బజారుకు రెండు లారీల కూరగాయాలు తరలిస్తారు. వర్షకాలంలో ఏకంగా 5000 మోటర్లతో వరి పొలాలకు నీరు అందిస్తారు. పచ్చని పంట పొలాలతో, కూరగాయల సాగుతో కళకళలాడుతున్న గ్రామాలను ప్రభుత్వం తన స్వార్ధ ప్రయోజనాల కొరకు మల్లన్న సాగర్ జలాశయంలో ముంచడానికి కుట్ర చేస్తున్నది.

పాలకవర్గాల కుట్రలకు వ్యతిరేకంగా మల్లన్నసాగర్‌లో ప్రారంభమైన మల్లన్నసాగర్ వ్యతిరేక పోరాటాన్ని రాష్ట్ర వ్యాపిత నిర్వాసిత వ్యతిరేక పోరాటంలో భాగంగా మిలిటెంట్‌గా ముందుకు తీసుకుపోదాం.

★


**(20వ పేజీ తరువాయి)**

కొంతమంది మేధావులు రాష్ట్రంలో విద్య ప్రమాణాలు పెరుగుదల కోసం క్షేత్ర స్థాయిలో సమాచారం సేకరించడానికి చేస్తున్న ప్రయత్నాలకు సహకరిద్దాం బదుగు, బలహీన వర్గాల పిల్లలు అందరికీ ప్రాథమిక విద్య అందించే ఉద్దేశ్యంతో 2009 సంIIలో ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం వచ్చింది. ప్రభుత్వ బాధ్యతను రాజ్యాంగం స్పష్టం చేసింది. ప్రాథమిక విద్య ప్రాథమిక బాధ్యత: విద్యను పొందడం పౌరుల ప్రాథమిక హక్కు. మన రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు కోసం వుద్యమించడం మన బాధ్యత. విద్యను నిర్లక్ష్యం చేయడం, అవినీతితో విద్యా ప్రమాణాలను దెబ్బతీయడం చేసే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అన్ని సెక్షన్ల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

★

# టీ.ఆర్.ఎస్. రాజకీయ ప్రయోజనాల్లో భాగమే జిల్లాల పునర్వ్యవస్థీకరణ

తెలంగాణ రాష్ట్రంలో పాలనా వికేంద్రీకరణ చేస్తున్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తున్నట్లు టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం చెబుతుంది. తెలంగా ణలోని 10 జిల్లాలు విభజన జరిగి 31 జిల్లాల తెలంగాణగా మారింది. శాస్త్రీయంగా, ప్రజాస్వామికంగా, ప్రజా ప్రయోజనాలే గీటురాయిగా, అన్నివర్గాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కొత్త జిల్లాల ఏర్పాటు జరిగిందా? నిజంగా పాలనా వికేంద్రీకరణ జరిగి, అభివృద్ధి ఫలాలు కూడా అందరికీ అందితే అందరూ హర్షించవలసిందే. అటువంటి చిత్తశుద్ధి పాలకులకు వుంటే అదే చేస్తారు. కాని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటికీ, టీ.ఆర్.ఎస్. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుండి నిరంకుశాధికార కేంద్రీకరణ పెరిగింది. అభివృద్ధి కొన్ని వర్గాలకే చేరుతుంది. ప్రజా ప్రయోజనాలు గీటురాయిగా, అన్ని వర్గాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా, ప్రజాస్వామికంగా పరిపాలించడం లేదని గత 2సం॥ల కే.సీ.ఆర్. నాయకత్వంలోని ప్రభుత్వ పాలన చెప్పకనే చెబుతుంది. తెలంగాణలో రోజురోజుకు పెరుగుతున్న సమస్యలు, ప్రజాందోళనలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి. కాబట్టి జిల్లాల విభజన ఎవరి ప్రయోజనాలకోసం జరుగుతుందో లోతుగా పరిశీలించాల్సి ఉంది.



తెలంగాణలో మొదటిసారి సాలర్‌జంగ్ సంస్కరణల్లో భాగంగా 1860లలో తెలంగాణను 5 జిల్లాలుగా ఏర్పాటు చేశారని, 1905లో 8 జిల్లాలుగా పునర్విభజన చేశారని, హైదరాబాద్ తొలి ప్రభుత్వంలో మరో జిల్లా ఏర్పడిందని, ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడిన తర్వాత 1978లో రంగారెడ్డి జిల్లా ఏర్పడి మొత్తం 10జిల్లాల తెలంగాణ రూపుదిద్దుకుందని చరిత్ర చెబుతుంది. 38సం॥ల తర్వాత నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పునర్విభజన జరిగి 31జిల్లాల తెలంగాణ ఏర్పడింది. కొత్తగా 120 మండలాలు పెరిగి మొత్తం 584మండలాలు, 21 రెవెన్యూ డివిజన్లు పెరిగి మొత్తం 68 డివిజన్లు ఏర్పడతాయని, అలాగే కొత్తగా 2,200 పోస్టులు క్రియేట్ చేయాలని అంటున్నారు.

తెలంగాణ రాష్ట్రం మొత్తం విస్తీర్ణం 1లక్షా 14వేల 840 చ.కి.మీ. ఉంది. జనాభా 3కోట్ల 60లక్షల మంది ఉన్నారు. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగా జిల్లాల సంఖ్య తక్కువగానే ఉంది. తెలంగాణలో పెరిగిన జనాభా, వారి అవసరాల రీత్యా చూసినా నూతన జిల్లాల ఏర్పాటు అవసరమే. జిల్లా కేంద్రాలు సుమారు 150 కి.మీ. దూరం ఉన్న మహబూబ్‌నగర్, అదిలాబాద్ లాంటి జిల్లాలకు విభజన అత్యవసరం. పాలనా యంత్రాంగం ప్రజలకు దగ్గరగా వచ్చి, జిల్లా కేంద్రాలు అందుబాటులోకి వస్తే ప్రజలకు కాలం వృధా కాకుండా ఖర్చులు తగ్గి కొంత ఉపశమనం లభిస్తుంది. కాని ఈ విభజన వలన అధికార యంత్రాంగానికి ప్రజలపై పూర్తి నియంత్రణ ఉంటుందనే విషయం మనం మరిచిపోకూడదు. కొత్త మార్పుల వలన జిల్లాకు 2 1/2 లక్షల నుండి 4లక్షల వరకు జనాభా ఉంటుంది. జిల్లా కేంద్రం ఇప్పుడు 70 కి.మీ. దూరం లోపలనే ఉంటుంది.

తెలంగాణ ప్రభుత్వం ప్రజాప్రయోజనం పేరుతో తెస్తున్న జిల్లాల విభజనలో టీ.ఆర్.ఎస్. పార్టీ రాజకీయ ప్రయోజనాలు కలగలిసి ఉన్నాయి. గత ఎన్నికల్లో గెలిచిన ఇతర పార్టీలకు చెందిన ఎం.ఎల్.ఏ.లను రాజకీయాలు, విలువలు పక్కన బెట్టి టీ.ఆర్.ఎస్.లో చేర్చుకున్నారు. రానున్న ఎన్నికల్లో అధికారాన్ని టీ.ఆర్.ఎస్. పార్టీ తిరిగి పొందేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా అందరికీ ఎం.ఎల్.ఏ. సీట్లు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంది. వారికి సీట్లు ఇవ్వకపోతే ఆస్థులు సంపాదించుకోవడానికి, సంపాదించిన ఆస్థులు కాపాడుకోవడానికి వచ్చిన ఆ ఎం.ఎల్.ఏ.లు ఈ పార్టీలో ఉండరు. వారికి మంచి అవకాశం కల్పించి రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేసుకోవాలన్న అత్యాశకూడా కే.సీ.ఆర్.కు ఉంది. అందుకే సెప్టెంబర్‌లో ఢిల్లీకి వెళ్ళి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి శాసనసభ స్థానాలను 119 నుండి 153కు పెంచాలని కోరాడు. జిల్లాల పునర్విభజన చేస్తున్న విషయాన్ని చాలా వివరంగా మాట్లాడి హామీ పొంది వచ్చాడు.

ప్రభుత్వ నిర్లక్ష్యం, బహుళజాతి సంస్థల విచ్చలవిడి దోపిడీ, వడ్డీ వ్యాపారుల పీడన అన్నీ రైతాంగాన్ని ఆత్మహత్యలకు పురికొల్పుతున్నాయి. స్వంత ఊర్లో పనిలేక, మరో ఉపాధి దొరకక పోవడంతో వ్యవసాయ కూలీలు పొట్ట చేత పట్టుకుని పాలమూరు వలస కూలీల బాట పడుతున్నారు. తెలంగాణ పల్లెలు వలస పోతున్నాయి. ప్రభుత్వం బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం లక్షల ఎకరాల భూముల్ని బలవంతంగా లాక్కుంది. ఆదివాసుల్ని కూడా అడవితల్లి నుండి దూరం చేసింది. ఆ రైతాంగమంతా దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. భూమిలేదు, పనిలేదు, నీడలేదు, బతుకు భారంగా మారింది. బంగారు తెలంగాణ, తెలంగాణ అభివృద్ధి నమూనాలు వర్గ వ్యత్యాసాలను పెంచుతున్నాయి. పేదల్ని దోచి సంపన్న వర్గాల్ని మరింత సంపన్నులను చేస్తున్నాయి.

ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించే విధంగా అభివృద్ధి నమూనాలు ఉండాలి. అభివృద్ధి, ఆత్మగౌరవం, స్వేచ్ఛా స్వతంత్రాలు, ప్రజల హక్కులను కాపాడే విధంగా పాలనా విధానాలు ఉండాలి. ప్రజల పట్ల బాధ్యత, జవాబుదారీ తనం ఉంటే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయి. ఆదివాసీ ప్రజలు, వారు నివసించే ప్రాంతాలు బాగా వెనకబడి ఉన్నాయి. అలాగే కొన్ని సామాజిక వర్గాలు అన్ని రంగాల వెనకబడి ఉండడమే గాక, వివక్షకు గురవుతున్నాయి. ఆ ప్రాంతాల పట్ల, ఆ ప్రత్యేక సెక్షన్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించవలసి వుంటుంది. అటువంటి స్పృహ పాలనా యంత్రాంగంలో రావాలి. ప్రభుత్వం చేస్తున్న జిల్లాల విభజనలో వీటికి ప్రాధాన్యత కనబడదం

లేదు. క్రిందినుండి వచ్చిన సూచనలను స్వీకరిస్తున్న దాఖలాలు కనబడడంలేదు. పాలకుల మాటే, కే.సీ.ఆర్. ఆలోచనలే నడిపిస్తున్నాయి. నిరంకుశ పాలనలో ప్రజల మాటలు పట్టించుకోరు.

ఇప్పుడు జిల్లాల సంఖ్య మూడింతలు పెరిగింది. అధికార యంత్రాంగం ఏర్పర్చడంలో మొదటి సంవత్సరాలలో ఇబ్బందులుంటాయి. ఉద్యోగ కల్పన, బదిలీలు అన్నీ నేడు పైరవీలతోనే నడుస్తున్నాయి. కాబట్టి పాత, కొత్త జిల్లాలలో రేపటి పాలన మరింత అవినీతి, లంచగొండితనంతో ఉంటుందనడంలో ఆశ్చర్యం లేదు. పాలనా విధానం మొత్తం అధికార పార్టీ కంట్రోల్‌లో ఉంటుందనడంలో సందేహం లేదు. దోపిడీ కేంద్రాలు వెనకబడిన ప్రాంతాలకు మరింత దగ్గర కావడం ప్రమాదకరమే. దోపిడీ విస్తరణకు ఇదో మార్గం. కే.సీ.ఆర్. రాజకీయ కేంద్రీకరణలో భాగమే తెలంగాణ ప్రభుత్వ పాలనలో వికేంద్రీకరణ అనేది మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

జిల్లాల విభజన రాజకీయాల్లో అన్ని రాజకీయ పార్టీలు 3 నెలలు పూర్తిగా తలమునకలయ్యాయి. ఈ విభజన రాజకీయాల్లో అన్ని పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా ప్రాంతీయతత్వంతో పనిచేసి ఓట్ల రాజకీయాలు నడిపించారు. వీరికి సిద్ధాంత, రాజకీయ నిబద్ధతగాని, రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందాలన్న చిత్తశుద్ధి లేదనేది స్పష్టం. అధికారంలో ఉన్న టీ.ఆర్.ఎస్. తన ప్రయోజనాల దృష్ట్యా చేస్తున్న విభజనను విమర్శనాత్మకంగా చూడకుండా, ప్రతిపక్షాలు కూడా లాభాల్లో వాటాల కోసం పాకులాడాయి. అధికారాన్ని పంచుకోలేక పోయినా, భవిష్యత్‌లో వచ్చే లాభాల కోసం, ప్రస్తుతం సంపదల్లో వాటాలు పొందడానికి ఉవ్విళ్ళూరడం కనబడుతుంది. అందరూ దొంగలే. అధికారంలో ఉన్న దొంగలకు సాధికారత ఉంటుంది.

తెలంగాణలో దోపిడీ పాలకవర్గాలు రాజ్యాధికారానికి వచ్చిన కొద్ది కాలానికే పరిపాలనా యంత్రాంగాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. అన్ని ప్రాంతాలలోని సామాజిక వర్గాలను తమ చెప్పు చేతుల్లో ఉండేలా చూసుకుంటున్నాయి. ఈ సామాజిక వ్యవస్థ పునాదులను సుస్థిరం చేయడానికి, సామాజికంగా ఉన్న ఆర్థిక, సాంఘిక వ్యత్యాసాలను కొనసాగించడానికి, తమ పరిపాలనను సుదీర్ఘంగా కొనసాగించడానికి ఉపరితలాన్ని బలోపేతం చేసుకుంటున్నారు. వర్గ సమజాలు నడుస్తున్న వేల సం॥ల చరిత్రలో నేటి తెలంగాణ పరిణామాలు కొత్తవి కాదు. దోపిడీ వర్గ వ్యవస్థను పునాదుల నుండి పెకలించకుండా దోపిడీ రాజ్యాన్ని ఓడించలేం.

ఈ విభజన రాజకీయమైనదే. ఎవరి ప్రయోజనాలు వారికున్నాయి. పాలకుల దోపిడీ, పీడనలను స్థిరీకరించేందుకు, అధికారాన్ని చెప్పుచేతుల్లో ఉంచుకునేందుకు ఈ విభజన వారికి ఉపకరిస్తుంది. విభజన వలన కలిగిన అనుకూలతలను వినియోగించుకుంటూనే పాలకుల దోపిడీ విధానాలకు, అభివృద్ధి నిరోధక పథకాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాల్సి ఉంటుంది. ప్రజల రాజ్యం పోరాడి సాధించాలి. ప్రజల ప్రజాస్వామ్య పాలనలో మాత్రమే అన్ని జిల్లాలు సమానంగా అభివృద్ధి చెందుతాయి. ★

**(4వ పేజీ తరువాయి)**

గురించి ఆలోచించకుండా ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నాడు. అన్నదాతల ఆకలిచావులను సైతం పక్కకు పెట్టి గుళ్ళు, గోపురాలంటూ యాదగిరిగుట్టకు 200 కోట్లు కేటాయించాడు. హైదరాబాద్‌లోని సాగరతీరం చుట్టూ ఆకాశహర్మ్యాలు నిర్మిస్తానంటూ, స్మార్ట్ సిటీలంటూ ప్రజలకు భ్రమల్ని కల్పిస్తున్నాడు. గుళ్ళకు, దేవతలకు కోట్ల విలువచేసే కానుకల్ని సమర్పిస్తున్నాడు. ఉదా: వరంగల్ లోని భద్రకాళికి 11.7 కిలోల బంగారు (సుమారు 4 కోట్ల విలువ కలిగినవి) బహుకరించాడు. ఇంకోపక్క గోదావరి పుష్కరాలు, కృష్ణా పుష్కరాలంటూ ప్రజల్ని నీటిలో మునకలువేయించి, భక్తిపేరుతో కోట్ల రూపాయలు మూటకట్టుకున్నారు. సెక్రటేరియట్‌ను హైటెక్ హంగులతో నూతనంగా నిర్మిస్తానని 350 కోట్ల రూపాయలు కేటాయించాడు. తెలంగాణ ప్రజల స్థితిగతులు, జీవన ప్రమాణాలు పెరగకుండా గుళ్ళకు, దేవతలకు కోట్ల విలవచేసే బంగారు ఆభరణాల్ని సమర్పిస్తే బంగారు తెలంగాణ అవుతుందేమో చంద్రశేఖర్‌రావుకే తెలియాలి!

ఈ రెండు సం॥లలో తెలంగాణ ప్రజల కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. మూడున్నర కోట్ల ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారాయి. తెలంగాణ ప్రజల జీవనప్రమాణాలు పెంచే మౌలిక రంగాలలో ఎలాంటి పురోగతిలేదు. గత సమైక్యాంధ్ర పాలకుల్లాగే తెలంగాణ రాష్ట్రసమితి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ప్రజా ఆకర్షక పథకాలను ప్రవేశపెట్టి, ప్రజలను మభ్యపెడుతూ 'బంగారు తెలంగాణ'ను సాధిస్తానంటూ ప్రగల్భాలు పలుకుతుండు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో అడుగడుగున తెలంగాణకు ద్రోహం తలపెట్టిన వారందరినీ అధికారంలో భాగస్వామ్యం చేసుకుని తెలంగాణ ప్రజలను వంచించినాడు.

ఎన్నికల ప్రణాళికలో తెలంగాణ రాష్ట్ర సమితి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా అమలు పరుచలేదు. భూములు లాక్కొని ప్రజలకు జీవనాధారం లేకుండా చేసి నిస్సిగ్గుగా వలసలను ప్రోత్సహిస్తుంది. ప్రజాస్వామిక హక్కులను హరించివేయడాన్ని ప్రశ్నిస్తున్న ప్రజాస్వామిక వాదులను, ప్రజా సంఘాలను, ప్రజలను తుపాకీతో భయపెట్టి అణిచివేయాలని చూస్తున్నది. గత రెండున్నర సంవత్సరాలుగా తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసు రాజ్యంగా మార్చి నియంతలా పరిపాలిస్తున్నాడు.

మనం సాధించుకున్నది ఆంక్షలతో కూడిన భౌగోళిక తెలంగాణ. రూపంలో, సారంలో బడా భూస్వాముల, సామ్రాజ్యవాదుల, ఆంధ్ర దోపిడీదారుల పాలనను ఏ మాత్రం తీసిపోదు. నీళ్ళు, నిధులు, నియామకాలు, ప్రజాస్వామిక హక్కులు, ఆత్మగౌరవం కోసం తమ విలువైన ప్రాణాలు అర్పించిన అమరుల కలలను నిజం చేయడానికి వారి ఆశయసాధనలో సమస్త వృత్తుల, సబ్బండవర్ణాల ప్రజానీకం ప్రజాస్వామిక తెలంగాణకై సమరశీల పోరాటానికి సన్నద్ధం కావాల్సిన తరుణం ఆసన్నమైంది. ప్రజాస్వామిక తెలంగాణలో మాత్రమే ప్రజల స్వయం పాలన సాధ్యం అవుతుంది. ★

# సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను పోరాడి సాధించుకున్న కార్మికులకు జేజేలు

## సింగరేణి లాభాల్లో వాటా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కు

2015-16 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి పొందిన లాభాల్లో 23శాతం కార్మికులకు వాటాగా చెల్లించాలని నిర్ణయం జరిగింది. క్రిందటి సంవత్సరంతో పోల్చితే 2శాతం ఎక్కువ ఇస్తున్నారు. సింగరేణి ఈసారి రికార్డు స్థాయిలో 60.38 మిలియన్ మెట్రిక్‌టన్నుల బొగ్గు వుత్పత్తి చేసింది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ ఇంత లాభం గడించలేదు. రాష్ట్రంలో ప్రధాన ఆదాయవనరులైన సింగరేణి బొగ్గు తవ్వకాలు ప్రజల పాలిట మృత్యుద్వారాలు అవుతున్నాయి. ఓపెన్‌కాస్ట్ విధానం అన్ని విధాల ప్రజలకు నష్టం కలిగిస్తున్నా గాని వాటిని బందు పెట్టలేదు. ఇప్పుడు మరో 14 కొత్తగా ప్రారంభించి ప్రజలను నివాస స్థలాలనుండి ఖాళీ చేయిస్తున్నారు. భారీ యంత్రాలు తెచ్చి బొందలు తవ్వడంతో పాటు, కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించి ఉపాధి లేకుండా చేస్తున్నారు. ప్రజల, కార్మికుల బతుకులను ఛిద్రం చేసి అధిక లాభాలు పొందుతున్న ప్రభుత్వాలు న్యాయమైన వాటాను కార్మికులకు హక్కుగా ఇవ్వడం లేదు. దయతో ఇస్తున్నట్లు చేస్తున్నారు. కనీసంగా 25శాతం వాటాను కార్మికులు డిమాండ్ చేస్తుంటే 23 శాతం ఇచ్చి సరిపుచ్చుకోమంటున్నారు.



డ్రిల్ వేస్తున్న కోల్ కట్టర్స్

ఈ ఏడాది సింగరేణి సంస్థకు 1066 కోట్ల రూ॥ల లాభాలు వస్తే అందులో 23శాతం అంటే 245 కోట్ల రూ॥లు కార్మికులకు వాటాగా ప్రకటించారు. 560 కోట్ల రూపాయలు బోనస్‌గా ఇవ్వడానికి అంగీకరించారు. ఈ బోనస్ ఇచ్చే దగ్గర 75శాతం హాజరు ఉన్న కార్మికులకే అంటూ అనేక పరిమితులు విధిస్తున్నారు. వీటిలో కూడా యూనియన్‌ల పైరవీలు నడుస్తున్నాయి. ఇప్పుడు సింగరేణిలో కార్మిక సంఘాల పని పైరవీలు, దందాలతో నడుస్తున్నది. కేసీఆర్ జరుగబోయే కోల్‌బెల్ట్ ఎన్నికల కోసం కార్మికుల వాటా, బోనస్‌ల గురించి మరియు వారసత్వ ఉద్యోగాల గురించి మాట్లాడుతున్నాడు. తన పార్టీకే చెందిన టీ.బీ.జీ.కే.ఎస్.ను గెలిపించుకోవడానికి కూతురు కవితకు కీర్తిని కట్టబెట్టడానికి ఈ వాగ్దానాల వర్షం కురిపిస్తున్నాడు.

ప్రత్యేక తెలంగాణ వస్తే ఓపెన్‌కాస్ట్‌లు ఉండవని, వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరిస్తానని మాట్లాడిన కే.సీ.ఆర్. ఎన్నికల ప్రణాళికలో రాసిన టీ.ఆర్.ఎస్. పార్టీ 2సం॥ల పాటు నిరవధికంగా సమ్మె చేసినప్పటికి కార్మిక కుటుంబాలను నిర్లక్ష్యం చేసిన విషయం తెలియంది కాదు. ఇప్పుడు అత్యవసరంగా అవకాశవాదంతో తన పార్టీ ప్రయోజనాల కోసం ఈ వరాలు ఇస్తున్నాడు. కార్మికులు నిరంతరం పోరాడుతున్నా తమ జీవన్మరణ సమస్యను పట్టించుకోకుండా కార్మిక సంఘం ఎన్నిక కోసం పాలకులు నాటకీయంగా వ్యవహరిస్తున్నారు. కాబట్టి వాటిని అమలు చేశాకనే సింగరేణిలో ఎన్నికలు జరుపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో టీ.ఆర్.ఎస్. చేసిన వాగ్దానాలను ఇప్పటి వరకు అమలు చేయలేదని ఇప్పటి ఈ వాగ్దానాలు కూడా నెరవెరుతాయనే నమ్మకం లేదని కార్మికులు అంటున్నారు. అర్హులైనవారందరికి ఉద్యోగాలు ఇవ్వకుండా ఏవో కుంటిసాకులు చెప్పి కొద్దిమందికే ఇచ్చే విధంగా అధికారులు మాట్లాడుతున్నారు. అందరికి వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. 1998 నుండి వారసత్వ ఉద్యోగ నియమకాలు లేకుండా చేసారని, 18 సం॥ల తర్వాత అది కూడ అనేక విధాలుగా కార్మికులు నాలుగు జిల్లాలలో పోరాడడం ద్వారా ఈ హక్కును తిరిగి సంపాదించుకో గలిగారని అంటున్నారు. పరిష్కారం కాకుండా యూనియన్ ఎన్నికలు జరిగితే అధికార పార్టీకి చెందిన కార్మిక సంఘం ఓటమి పాలవుతుందని గుర్తింపుపొందలేదని పరిశీలకులు అంటున్నారు. ప్రభుత్వ ఇంటలిజెన్స్ ఇదే విషయాన్ని ధృవీకరించింది. వారసత్వ ఉద్యోగాల డిమాండ్ దేశవ్యాపిత జనరల్ సమ్మెలో కూడ సింగరేణి బెల్ట్ అంతా ప్రధాన నినాదంగా మారుమోగింది. సింగరేణి కార్మికులు జనరల్ సమ్మెను గొప్పగా విజయవంతం చేసారు. ఈ డిమాండ్‌కు దేశవ్యాపితంగా మద్దతు లభించింది.

సకల జనుల సమ్మె వేతనం నుండి కార్మికుల అనుమతి లేకుండా గుర్తింపు సంఘం సభ్యత్వం పేరుతో 200 రూ॥ లాక్కోవడం చేస్తుంది. సకల జనుల సమ్మెలో పాల్గొన్న కార్మికులందరికీ సమ్మె వేతనం అందలేదని అంటున్నారు. బ్యాంకు అధికారులు కొందరు బ్రోకర్ల ద్వారా లోన్స్ మంజూరు చేస్తున్నారు. 1998 నుండి సుమారు 10వేల మంది కార్మికులు గైర్హాజరు కారణంతో డిస్మిస్ చేయబడ్డారు. వీరిలో 70 మంది మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అనారోగ్యం పాలై వంద మంది చనిపోయారు. వీరంతా డిస్మిస్ కార్మికసంఘం పెట్టుకుని, ఇతర సంఘాల మద్దతుతో పోరాడడం వలన 400 మందికి ఉద్యోగాలు సాధించుకోగలిగారు. వందమంది కోర్టులో కేసువేసి కోర్టు ద్వారా ఉద్యోగాలు సంపాదించుకున్నారు. మిగిలిన కార్మికులు ఉద్యోగాలు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారు. టీ.ఆర్.ఎస్. పార్టీ ఎన్నికల్లో వాగ్దానం చేసింది కానీ అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను

పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంది. మోసపూరితంగా వ్యవహరిస్తుంది. డిస్మిస్ కార్మికులందరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, వయస్సుపై బడిన, చనిపోయిన కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

గత 3 సంవత్సరాలలో (2013, 2014, 2015) 10 వేల మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేసారు. 2016, 17 సంIIలలో మరో 8వేల మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. సింగరేణి సంస్థలో ఒకప్పుడు 1లక్షా 20 వేల మంది కార్మికులు పనిచేస్తే వారిమీద ఆధారపడి 20 లక్షల మంది జీవించేవారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానాలు, ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణల కారణంగా సింగరేణిలో సంస్కరణలు అమలు జరిపి పెద్ద ఎత్తున 2003-07 మధ్య ప్రవేశపెట్టిన కార్మికుల ఉద్యోగ విరమణలు కారణంగా సింగరేణిలో కార్మికుల సంఖ్య 50 వేలకు పడిపోయింది. నూతన రిక్రూట్‌మెంటులు లేవు. వున్న కార్మికులపైననే పనిభారం పడుతుంది. యంత్రాలు పెట్టి కార్మికులను తొలగించడం చేస్తున్నారు. మరోపక్కన ప్రైవేటుకాంట్రాక్టర్ల ద్వారా పని చేయించడంతో 20 వేల మంది కాంట్రాక్టు కార్మికులు సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సింగరేణిలో కవిత చేత గులాబీజెండా ఎగరవేయించడానికి కే.సీ.ఆర్. హడావుడిగా హామీలు ఇస్తున్నాడు. ఎన్నికలయ్యాక వాటిని అమలు చేయకపోవచ్చు. గతంలో ఇచ్చిన హామీలు ఏవీ అమలు కాలేదు. నూతన భూగర్భ గనుల విధానం గురించి చర్చ కూడ లేకుండా పోయింది. సింగరేణిలో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకోవడం లేదు, పర్మనెంటు వర్కర్లను తగ్గించి కాంట్రాక్టు కార్మికులతో పనిచేయిస్తూ సంస్థ లాభపడుతుందని కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం గడిచి 6నెలలు గడిచినా కంప్యూటర్‌ల యుగంలో లాభాలు తేలలేదని తాత్సారం చేసి ఎన్నికల్లో ఓట్ల కోసం ఇప్పుడు కార్మికులకు వాటాలు ప్రకటించారని కార్మికులు ఆరోపిస్తున్నారు. పథకం ప్రకారం కార్మికులను విభజించి పాలించే కుట్రలను టీ.ఆర్.ఎస్. పార్టీ చేస్తున్నది. ప్రమోషన్లు, లోన్లు, ఇతర సౌకర్యాలు తమ వారికే దక్కే విధంగా అధికారాన్ని వాడుకుంటుంది. సింగరేణిలో రోజురోజుకు రాజకీయ నాయకుల, ప్రభుత్వ అధికారుల ప్రత్యక్ష జోక్యంతో అవినీతి పెరిగిపోతున్నది. గోలేటి బొగ్గు కుంభకోణం, రామకృష్ణపూర్ ఓపెన్‌కాస్ట్‌లో కాంట్రాక్టర్ల మోసం, ఎన్.టీ.పీ.సీ.లో ఇసుక కుంభకోణం, రామగుండం రీజియన్‌లో బొగ్గు కుంభకోణాల్లో పెద్దల అండదండలున్నాయన్నది జగమెరిగిన సత్యం. నాసిరకం మందులు, పాత వైద్య పరికరాలతో కార్మికుల ప్రాణాలతో అధికారులు, డాక్టర్లు చెలగాటమాడుతున్నారు. సింగరేణిలో అన్ని రంగాలలో అవినీతికి అడ్డులేకుండా పోతుంది. కార్మికులకు సరియైన కార్మికసంఘం లేకపోవడంతో మిలిటెంట్ ఆందోళనలను చేపట్టలేకపోతున్నారు.

సెక్యూరిటీ సిబ్బంది ఉద్యోగాల కోసం కాంట్రాక్టు వర్కర్స్‌ను దళారులుగా ఉన్న కాంట్రాక్టర్లు మాయచేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. సింగరేణి అధికారులు లంచాలు తిని ఉద్యోగాలు ఇప్పిస్తున్నారు. గుర్తింపుపొందిన కార్మికసంఘంతో పాటు ఇతర కార్మికసంఘాలు ఈ అవినీతిని చూస్తూ ఊరుకుంటున్నాయి. పరోక్షంలో అందులో భాగం పంచుకుంటున్నారు. కార్మికులను చీల్చడం, మోసగించి లాభ పడడం చేస్తున్నాయి. కార్మికుల పక్షాన నిలిచి పోరాడుతున్న వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు.

సెప్టెంబర్ 2న జాతీయ సంఘాలు బొగ్గుగనుల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల సవరణలపై చేపట్టిన దేశవ్యాపిత ఆందోళనలో సింగరేణి కార్మికులు క్రియాశీలంగా పాల్గొన్నారు. స్థానిక సమస్యలను జోడించి ఆ సమ్మెలో పాల్గొన్నారు. సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సింగరేణి సన్స్ అసోసియేషన్, డిస్మిస్ కార్మికసంఘం, వీ.ఆర్.ఎస్. కార్మికసంఘాలు, 'జేఏసీ' గా ఏర్పడి నిర్వహించిన కార్యక్రమాలు మంచి ఫలితాలనిచ్చాయి. తమ హక్కుల సాధనలో అవిశ్రాంతంగా పోరాడుతున్న కార్మికులకు విప్లవ జేజేలు పలుకుదాం.

ఈ ఆర్థిక సంవత్సరం జూలై నుండి కొత్త వేజ్‌బోర్డు ప్రారంభమైంది. కొత్త వేజ్‌బోర్డు నిర్ణయాలకు అనుగుణంగా జీతాలు పెంచి ఇవ్వాల్సి ఉంది. కార్మికుల జీతాలు, ఇతర అలవెన్స్‌లు నిర్ణయించే వేజ్‌బోర్డు కమిటీ ఏర్పాటు, జీతాల పెంపుదల విషయంలో కార్మికులు ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఉంది. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఉండే విధంగా వేజ్‌బోర్డు నిర్ణయాలు ఉండడం లేదు.

కార్మికులారా!

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తూ ట్రేడ్ యునియన్ వుద్యమాన్ని బలహీనపరుస్తుంది. కార్మిక హక్కుల్ని కాలరాస్తూ కార్మికులను బానిసలుగా మార్చబూనుకోనున్న ప్రయత్నాలను మరింత సంఘటితంగా ఓడించాలి. దోపిడీ వర్గాలు తమ వర్గ ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు, తమ సంక్షోభాలను పరిష్కరించుకునేందుకు శ్రామికవర్గం గతంలో నెత్తుటి త్యాగాలతో పోరాడి సాధించుకున్న హక్కులను సైతం కాలరాస్తున్నాయి. అనేక దుర్మార్గాలకు పాల్పడుతున్నాయి. రాజ్యాంగ సూత్రాలను, చట్టాలను, ఒప్పందాలను ధిక్కరిస్తూ ప్రజాస్వామిక విధానాలను, బేఖాతర్ చేస్తూ దోపిడీ వర్గాలు తమ వర్గ ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు పూనుకుంటున్నాయి.

ఈ విధంగా దోపిడీ వర్గాలు, దోపిడీ వర్గ ప్రభుత్వాలు తమ వర్గ ప్రయోజనాల కోసం ఇంతటి దుర్మార్గాలకు పాల్పడుతున్నప్పుడు కార్మికవర్గం కోసమే, ప్రజల కోసమే పుట్టాయి అనుకుంటున్న ప్రజాసంఘాలు, పార్టీలు ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు ప్రజాశక్తిని ప్రదర్శించేందుకు సంఘటిత, సమరశీల ఉద్యమాలు సాగించేందుకు సిద్ధపడడం లేదు. నిర్బంధాలకు, త్యాగాలకు భయపడకుండా పట్టుదలతో ప్రజా ఉద్యమాలు సాగించేందుకు పూనుకోవడం లేదు. అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ దోపిడీ వర్గ పార్టీలే.

ఈ పార్టీల అనుబంధ సంఘాలే జాతీయ ట్రేడ్ యూనియన్లుగా చెప్పబడుతున్నవి. ఐ.ఎన్.టి.యు.సి., ఎ.ఐ.టి.యు.సి., సి.ఐ.టి.యు., హెచ్.ఎం.ఎస్., వాటి అనుబంధ సంఘాలే. దేశంలో సంఘటిత, అసంఘటిత కార్మికులు పని చేసున్న అన్ని సంస్థలలో, ఇవి పని చేస్తున్నాయి. ఆ పార్టీలకు, వాటి అనుబంధ సంఘాల నాయకులకు శ్రామిక వర్గాన్ని చైతన్యపరిచి, సంఘటితపరిచే లక్ష్యమే లేదు. కాబట్టి దేశంలో దోపిడీ వర్గాలకు అడ్డు–అదుపు లేకుండా పోతుంది. ప్రజల ప్రయోజనాలు కాలరాయబడుతూ విధ్వంసకర విధానాలు పెరిగి పోతున్నాయి. ప్రజల బ్రతుకులు అధోగతి పాలు అవుతున్నాయి.

దోపిడీదారులందరూ కలిసికట్టుగా వ్యవహరిస్తారు. అదే విధంగా ప్రజాసంఘాలు కలిసికట్టుగా ఉండాలి. ఒక ఫ్యాక్టరీలో కార్మికులు సమ్మె చేస్తే అన్ని ఫ్యాక్టరీల కార్మికులు సమ్మెలో పాల్గొనాలి. సంఘటిత సమ్మెల ద్వారానే తక్కువ సమయంలో విజయాలు సాధించబడతాయి. ఇలాంటి సంఘ నిర్మాణాలు, ఐక్యకార్యచరణ లేనందునే ఆయా దోపిడీ వర్గ విధానాలు సజావుగా సాగుతున్నాయి. కార్మిక పోరాటాలు అణిచివేతకు గురవుతున్నాయి.

1980లలో విప్లవ సంస్థల కార్యకలాపాలు కొనసాగినపుడు కార్మికులను విద్యార్థులను, యువకులను పీడిత ప్రజలందరినీ చైతన్యపరుస్తూ సంఘటిత పరుస్తూ సాగించిన పోరాటాల మూలంగా అనేక విజయాలు సాధించుకోబడినాయి. కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని ఆదివాసుల్ని చైతన్య పరిచేందుకు, సంఘటిత పరిచేందుకు వారితో పాటు వారి పోరాటాల్లో పాల్గొని విజయవంతం చేసేందుకు విద్యార్థులు, యువకులు పూనుకోవడం జరిగింది. వందలాది మంది విద్యార్థులు, యువకులు ప్రతి సంవత్సరం నెల రోజులు గ్రామాలకు తరులుతూ రాజకీయ ప్రచారం కార్యక్రమాలు నిర్వహించేవారు. అందులో భాగంగా కార్మిక బస్తీలలో ప్రచారాలు జరిగేవి. సమ్మెల సందర్భంగా గనుల పైకి పోతూ, ఊరేగింపుల్లో పాల్గొంటు కార్మికులకు అండగా ఆందోళనలు, ప్రచారాలు చేసేవారు. కార్మిక, రైతాంగ ఉద్యమాలకు అండగా ప్రచార కార్యక్రమంలో పాల్గొంటు ఎంతో మంది విద్యార్థులు, యువకులు అరెస్టులకు, చిత్రహింసలకు, జైలు నిర్బంధాలకు పోలీసులచే హత్యలకు గురైనారు. ఆనాటి పోరాటాలు సికాస వుద్యమానికి ప్రాణమయ్యాయి.

ఒక కార్మికునికి మద్దతుగా అనేక మంది కార్మికులు, ఒక షిఫ్టుకు మద్దతుగా మిగతా షిఫ్టులు, ఒక గని కార్మికులకు మద్దతుగా అనేక గనుల కార్మికులు, ఒక డివిజన్‌లో జరిగే సమ్మెకు అనేక డివిజనుల కార్మికులు సంఘటితంగానూ, సమరశీలంగానూ పోరాటాలు సాగించడం వల్లనే సింగరేణిలో వందలాదిగా సమ్మెలు విజయవంతమయ్యాయి. చారిత్రాత్మకమైన పోరాటాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, కంపెనీ యాజమాన్యపు మెడలు వంచుతూ అనేక విజయాలు సాధించిన చరిత్ర సింగరేణి కార్మిక వర్గానికి ఉంది.

సింగరేణి ఆల్ అసోసియేషన్స్, జాయింట్ యాక్షన్ కమిటీ (సాజాక్) ఏర్పడి సంఘటితంగా పోరాడేందుకు పూనుకొని అనేక విజయాలు సాధించుకుంటూ రావడం జరిగింది. ప్రభుత్వాల లేదా కంపెనీ యాజమాన్యం లేదా, పోలీసు డిపార్ట్‌మెంట్ మొండి వైఖరులను బట్టి సమస్యల జటిలత్వాన్ని, ప్రాముఖ్యాన్ని బట్టి సమ్మెలు ఉధృతమవడం, విస్తరించడం జరిగేది.

బలమైన శత్రువుకు వ్యతిరేకంగా పోరాడ పూనుకున్నపుడు ఆ సంస్థలోని కార్మికులు సంఘటితంగా పోరాడినా విజయం సాధించలేనపుడు ఇతర సంస్థలలోని కార్మికులను కూడా సంఘీబావ పోరాటాలకు దింపడం సంఘటితత్వాన్నీ, పోరాట ఉధృతిని పెంచి విజయవంతం చేయడానికి కృషి చేయవలసి వుంటుంది.

తమ దోపిడీ వర్గ విధానాలను అమలు చేసుకునేందుకు దోపిడీ వర్గాలు నిరంకుశంగా, నిర్బంధాలు, అణిచివేతలతో ప్రజా ఉద్యమాలను దెబ్బతీయడం జరుగుతున్న పరిస్థితుల్లో సంఘటితమై ప్రజాశక్తిని పదింతలుగా పెంచుకుకేందుకు పూనుకొవాలి.

భూస్వామ్య దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల ప్రాంతీయ ప్రతినిధి అయిన కే.సీ.ఆర్. నాయకత్వంలోని టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం తన పాలనను సుస్థిరం చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ నూతన ఆర్థిక విధానాలను మరింత వేగంగా అమలుచేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. పాలకవర్గాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడడం ద్వారా కార్మికవర్గ సమస్యలు పరిష్కరించుకుంటూ, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం సంఘటిత ఉద్యమాల్లో భాగమవుదాం. కార్మిక, కర్షక ఐక్యతతో విజయం సాధిద్దాం. ★

## మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, విప్లవ నేత, కామ్రేడ్ మావో సే – టుంగ్
## (జననం; డిసెంబర్ 26, 1893 - మరణం; సెప్టెంబర్ 9, 1976)

**కార్మికవర్గపు వర్గపోరాట ఎత్తుగడలను చైనా విప్లవ నిర్దిష్ట పరిస్థితులకు కా. మావో శాస్త్రీయంగా అన్వయింప చేశాడు. నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఐక్యసంఘటన, సాయుధ పోరాటం, పార్టీ నిర్మాణం అనే మూడు మంత్రదండాలను గొప్పగా సమన్వయించాడు. ఐక్యసంఘటన అంటే సాయుధ పోరాటాన్ని నిర్వహించేందుకు ఉపయోగపడే ఐక్యసంఘటనగానూ, పార్టీ అంటే ఐక్యసంఘటన, ప్రజాసైన్యం అనే రెండు ఆయుధాలను ధరించిన వీరయోధగా మావో వివరించాడు.**

**కా. మావో 40వ వర్ధంతిని గొప్ప విప్లవోత్సాహంతో జరుపుకుందాం.**

# ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం

1960-70లలో వచ్చిన సామాజిక మార్పులు విద్యను అన్ని సామాజిక వర్గాలకు దగ్గర చేసింది. అయితే ఇప్పుడు అమలులో వున్న 1990ల నాటి ప్రపంచీకరణ, ఉదారీకరణ, ప్రైవేటీకరణలు విద్యను పునాది వర్గాలనుండి దూరం చేశాయి. విద్య కొనగల ఉన్నత వర్గాలకు దొరుకుతుంది తప్ప పేదలకు దక్కకుండా పోయింది. కొన్ని సామాజిక వర్గాలు క్రమంగా విద్యా అవకాశాలు కోల్పోతున్నాయి. కే.జీ.నుండి పీ.జీ. ఉచిత విద్య, మహిళలకు ఉచిత విద్య, ఆదివాసులకు, దళితులకు ఉచిత విద్య, ప్రైవేట్ విద్యాలయాల్లో రిజర్వేషన్లు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, అందరికీ విద్య అన్న మాటలు బూటకాలే. అందులో వాస్తవం లేదనేది కనబడుతున్న సత్యం.

విద్య సామాజిక మార్పుకు చిహ్నం. సమాజ వికాసంలో విద్యకి కీలకపాత్ర ఉంటుంది. విద్య సృజనను, శాస్త్రీయ దృష్టిని పెంచుతుంది. వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక ప్రగతికి విద్య ముఖ్యం. ప్రాథమిక విద్య ఎంత పటిష్టంగా ఉంటే మాధ్యమిక, ఉన్నత విద్యలు అంత పరిపుష్టం కాగలుగుతాయి.

తెలంగాణలో అక్షరాస్యత 66.5శాతం. దేశంలో 74శాతంతో పోల్చుకుంటే తక్కువ. ఇతర రాష్ట్రాల వరుసలో చివరి వరుసలో వుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు, వివిధ కులాల మధ్య, స్త్రీ, పురుషుల మధ్య తేడాలు అధికంగా ఉన్నాయి. నైజాం పాలనలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నేటి ప్రత్యేక తెలంగాణలో కూడా విద్య నిర్లక్ష్యానికి గురవుతున్నది.

తెలంగాణలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 33,297 పాఠశాలలు (69%) ఉన్నాయి. విద్యార్థులు మాత్రం 48శాతం మాత్రమే ఉన్నారు. 31శాతం ప్రైవేట్ పాఠశాలలో 52శాతం విద్యార్థులు ఉన్నారు. గతంతో పోల్చినపుడు 2015-16 సంవత్సరంలో 1లక్షా 50వేల మంది కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో తగ్గింది. ప్రైవేట్ పాఠశాలలో మాత్రం 2లక్షల మంది కొత్తగా చేరిన విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యాబోధన పద్ధతుల్లో, మరియు ప్రభుత్వ ఉపాధ్యాయుల కొరతలాంటి అనేక కారణాల వలన విద్య ప్రమాణాలు తగ్గడం వలన కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాటు డ్రాపవుట్స్ సంఖ్యకూడా పెరుగుతున్నది. జపాన్‌లో 100శాతం, స్వీడన్‌లో 90శాతం, అమెరికాలో 87శాతం స్కూల్స్, మన దక్షినాసియా దేశాలైన భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్‌లలో 85శాతంకు పైగా స్కూల్స్, ప్రాథమిక విద్య ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం గత సం॥రం బడ్జెట్‌లో 9054కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ సం॥రం పాఠశాల విద్యకు 8574 కోట్ల రూ॥లు కేటాయించింది. 9.6శాతం నుండి 8.2శాతానికి తగ్గించడం వలన ఈ బడ్జెట్‌లో 480 కోట్ల రూ॥లు తగ్గాయి. పెరుగుతున్న జనాభా, అధికమవుతున్న ధరల ప్రమాణాల రీత్యా చూసినా బడ్జెట్ కేటాయింపులు పెంచాల్సి ఉంది. విద్యలో దేశంలోనే చివరి స్థానంలో ఉన్న తెలంగాణలో విద్య బడ్జెట్‌ను తప్పనిసరిగా పెంచాల్సి ఉంది. లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రాల్లో కూడా విద్య కోసం ఎక్కువ కేటాయింపులు చేస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడుతుంటే, మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణలో బడ్జెట్‌లో కోత విధించడం చూస్తే టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతనలేదనిపిస్తుంది.

**దయనీయమైన తెలంగాణ పాఠశాలలోని పరిస్థితి**

చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు బొత్తిగా లేవు. 2596 సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో అవినీతికి అడ్డులేదు. 742 ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రభుత్వ నియంత్రణ నామమాత్రంగానే ఉంటుంది. ఇక మిగిలిన 29 వేల 959 పాఠశాలల్లో పరిస్థితిని విచారిస్తే 17,332 పాఠశాలలకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. 12,435 పాఠశాలలకు ప్రహరీగోడలు లేవు. 11,937 పాఠశాలలకు ఆట స్థలాలు లేవు. విద్యుత్ సరఫరా లేని 3181 పాఠశాలలు ఉన్నాయి. పక్కా భవనాలు లేనివి 3500 పాఠశాలలున్నాయి. ఇంకా 70శాతం పాఠశాలల్లో విద్యార్థులు కూర్చునేందుకు సరిపడా బల్లలు లేవు. ఉపాధ్యాయ, విద్య పర్యవేక్షకుల పోస్టులు అనేక సంవత్సరాలుగా ఖాళీగా ఉండి కొన్ని పాఠశాలలు నడవని పరిస్థితి దాపురించింది. 16,193 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 64శాతం పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేరు. 75శాతం పాఠశాలల్లో ప్రయోగశాలలు లేవు. ఉప విద్యాధికారులు 67 మంది ఉండాల్సిన చోట కేవలం 8మందే ఉన్నారు. 59 పోస్టులు (90%) ఖాళీగా ఉన్నాయి. మండల విద్యాధికారులు 462 మందికి 42 మంది మాత్రమే ఉన్నారు. 420 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. 1606 పాఠశాలల్లో ప్రారంభ సమయానికి ఉపాధ్యాయులు లేరు. వివిధ కారణాలతో ఈ సం॥లో 2,510 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు 405 ఉన్నాయి. 40 మందికన్నా తక్కువగా ఉన్న పాఠశాలలు 10వేల 551 ఉన్నాయి.

ప్రతి సం॥రము 10వేల కోట్ల రూపాయలు అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రభుత్వం కట్టడి చేయడం లేదు. వాళ్ళు తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యా బడ్జెట్ కన్నా ఎక్కువగానే వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం పాఠశాల విద్యపట్ల శాస్త్రీయమైన అవగాహన కలిగి ఉంటే సరియైన విధానాన్ని అనుసరిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన మార్పులు తీసుకరాగలిగితే ప్రజలు తమ పిల్లలకు అనేక వ్యయ ప్రయాసాలకు గురవుతు అప్పులతో ప్రైవేట్ విద్య నేర్పించడానికి ప్రయత్నించరు. ప్రైవేట్ విద్య నేర్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు రాష్ట్రం పట్ల, దేశం పట్ల బాధ్యతగా వ్యవహరించడంలో తేడా ఉంటుంది. రాష్ట్రం, దేశ భవిష్యత్తులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు కనీసం ప్రాథమిక విద్యను మెరుగైన విధంగా ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకులు

**(మిగతాది 14వ పేజీలో)**

# అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకొందాం

**మే 1941**

(యేనాన్‌లో కేడర్ల సమావేశంలో కామ్రేడ్ మావో-సే-టుంగ్ ఈ నివేదికను సమర్పించారు. ఈ నివేదికకాక, "పార్టీ పని విధానాన్ని సరిదిద్దండి," "మూస పార్టీ రచనా పద్ధతిని వ్యతిరేకించండి" అన్న రెండు వ్యాసాలూ కూడా సరిదిద్దుడు వుద్యమంపై కామ్రేడ్ మావో-సే-టుంగ్ రాసిన మౌలిక రచనలే. వీటిలో ఆయన పార్టీ పంథాపై పార్టీలో గతంలో వున్న విబేధాలను సైద్ధాంతిక స్థాయిలో క్లప్తీకరించారు. అంతేకాక, మార్క్సిజం-లెనినిజం పేరుతో పార్టీలో ప్రబలంగా వున్న పెటీబూర్జువా సిద్ధాంతాన్నీ, పద్ధతిని అవి ప్రధానంగా స్వీయాత్మక ఒంటెత్తు ధోరణులుగా వ్యక్తమవడాన్ని, మూస పార్టీ రచనా పద్ధతి రూపంలో వ్యక్తమవడాన్ని కూడా విశ్లేషించారు. మార్క్సిజం-లెనినిజం సైద్ధాంతిక సూత్రాలకు అనుగుణంగా పని విధానాన్ని సరిదిద్దుకునేలా పార్టీ అంతటా మార్క్సిస్టు-లెనినిస్టు శిక్షణను ఉద్యమంగా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ పిలుపు



త్వరలోనే పార్టీ లోపలా, బయటా కార్మికవర్గ సిద్ధాంతానికి, పెటీబూర్జువా సిద్ధాంతానికి మధ్య మహత్తర చర్చకు దారితీసింది. అంతేకాక, వివిధ శ్రేణుల కేడర్లు సైద్ధాంతికంగా పెద్ద ముందడుగు వేయడానికి, పార్టీ ముందెన్నడూ సాధించని ఐక్యతను సాధించడానికి అది వీలుకల్పించింది.)

పార్టీ అంతటా మన అధ్యయన విధానాన్నీ, పద్ధతుల్ని సంస్కరించుకోవాలని నేను ప్రతిపాదిస్తున్నాను. దానికి కారణాలు ఇవి:

మార్క్సిస్టు-లెనినిస్టు విశ్వజనీన సత్యాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో ఆనాటికానాటికి సమైక్యంచేసిన చరిత్రే చైనా కమ్యూనిస్టు పార్టీ గత ఇరవయ్యేళ్ల చరిత్ర. మన పార్టీ శైశవ దశలో మార్క్సిజం-లెనినిజం గురించి, చైనా విప్లవం గురించి మనకున్న అవగాహన ఎంత తక్కువో, ఎంత మిడిమిడి జ్ఞానమో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే, అది ఇప్పుడెంత లోలోతులకుపోతూ వృద్ధి చెందుతోందో చూడగలం. గత వంద సంవత్సరాలుగా అస్తవ్యస్థమయిన చైనా దేశపు ఉత్తమోత్తమ పుత్రీపుత్రులు దేశంకోసం పోరాడుతూ తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఒకరులేని లోటును మరొకరు తీరుస్తూ, వారు తమ దేశాన్నీ, ప్రజల్ని రక్షించే, విముక్తిచేసే మార్గాన్ని అన్వేషించారు. ఇది మనకో సంతోషాన్నీ, విషాదాన్ని కలిగిస్తుంది. కానీ మన జాతిని విముక్తి చేసుకోవడానికి అవసరమైన అత్యుత్తమ ఆయుధమూ, వాస్తవమూ అయిన మార్క్సిజం-లెనినిజాన్ని మొదటి ప్రపంచ యుద్ధానంతరం, రష్యా అక్టోబర్ విప్లవానంతరం మాత్రమే కనుగొన్నాం. ఈ ఆయుధాన్ని ప్రయోగించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చొరవ తీసుకొంది, ప్రచారం చేసింది, నిర్మాణం చేపట్టింది. చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో జోడించబడిన తర్వాత, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజం చైనా విప్లవానికి పూర్తిగా కొత్త రూపునిచ్చింది. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధం ప్రారంభమైనప్పటినుండే మన పార్టీ విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజాన్ని పునాదిగా చేసుకుని యుద్ధంలో నిర్దిష్ట ఆచరణను అధ్యయనం చేయటంలోను, నేటి చైనాను, ప్రపంచాన్ని అధ్యయనం చేయుటంలోనూ మరొక అడుగు ముందుకు వేసింది. చైనా చరిత్రని అధ్యయనం చెయ్యడం కూడా ప్రారంభించింది. ఇవి అన్నీ మంచి లక్షణాలు.

అయితే ఇప్పటికీ మనలో లోటుపాట్లు వున్నాయి. వాటిలో కొన్ని చాలా పెద్దవి కూడా వున్నాయి. ఈ లోటుపాట్లను సరిదిద్దుకోకుండా మన పనిలో ముందడుగు వేయలేమనీ, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో సమన్వయించడమనే మన మహత్తర కర్తవ్యాన్నిగాని నిర్వహించలేమనీ నా అభిప్రాయం.

ముందుగా ప్రస్తుత పరిస్థితులను అధ్యయనం చేయడం తీసుకొందాం. నేటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్ని అధ్యయనం చేయడంలో కొంత విజయాన్ని సాధించాం. కానీ మనంత పెద్ద రాజకీయ పార్టీ స్థాయికి మనం సేకరించిన సమాచారం అతితక్కువే. అంతేకాక, రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలన్నింటిలోనూ మనం చేసిన పరిశోధన క్రమబద్ధమైనదిగాలేదు. సాధారణంగా చెప్పుకోవాలంటే, ఈ అంశాలపై విషయ సేకరణలోనూ, అధ్యయనంలోనూ మనం గత ఇరవై సంవత్సరాలలోనూ క్రమబద్ధంగా, క్షుణ్ణంగా పని చేయలేదు. భౌతిక వాస్తవాన్ని పరిశోధించడానికీ, అధ్యయనం చేయడానికి అవసరమైన వాతావరణం మనకు లేదు. "పిచ్చుకల్ని పట్టే గుడ్డివాడి"లాగా, "చేపల్ని పట్టే గుడ్డివాడి"లాగా వ్యవహరించడం, లేదా మొరటుగానూ, నిర్లక్ష్యంగానూ వుండటం, వాగాడంబరానికి లోనుకావడం, అతితక్కువ పరిజ్ఞానంతోనే సంతృప్తిపడటం-ఇది తప్పుడు పని విధానం, మార్క్సిజం-లెనినిజం మౌలికాంశాలకు భిన్నమైన పద్ధతి. ఆ పద్ధతి ఇప్పటికి మన పార్టీలో చాలా మంది కామ్రేడ్స్‌లో వుంది. పరిస్థితుల్ని చైతన్యయుతంగా అధ్యయనం చేయ్యాలనీ, వ్యక్తిగత ఇష్టాయిష్టాలతోకాక భౌతిక వాస్తవికతతో ముందుకు సాగాలనీ, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు

మనకు నేర్పారు. అయితే మన కామ్రేడ్స్ చాలా మంది ఈ సత్యానికి పూర్తిగా భిన్నంగా నడుస్తున్నారు.

రెండవది, చరిత్ర అధ్యయనాన్ని తీసుకోండి. కొంతమంది పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ఈ పనిలో ఉన్నప్పటికీ అది ఒక క్రమపద్ధతిలో జరగడంలేదు. గత వంద సంవత్సరాల చరిత్ర కానివ్వండి, పురాతన కాలంనాటి చరిత్ర కానివ్వండి, మొత్తం మీద చైనా చరిత్ర గురించి మన పార్టీ సభ్యులు చాలా మంది ఇంకా అయోమయంలోనే వున్నారు. పురాతన గ్రీసును వుదహరించకుండా మాట్లాడలేని మార్క్సిస్టు-లెనినిస్టు పండితులు చాలా మంది వున్నారు. కానీ తమ పూర్వీకుల గురించి మాత్రం వారు పూర్తిగా మర్చిపోయారు. ప్రస్తుత పరిస్థితుల్నిగాని, గత చరిత్రనుగాని లోతుగా అధ్యయనం చేయడానికి అనుకూలమైన వాతావరణం లేదు.

మూడవది, అంతర్జాతీయ విప్లవానుభవాన్ని, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం-లెనినిజాన్ని అధ్యయనం చేయడం తీసుకోండి. చాలా మంది కామ్రేడ్స్ మార్క్సిజం-లెనినిజాన్ని విప్లవాచరణకోసంకాక ఉత్త విజ్ఞాన సముపార్జనకోసం మాత్రమే అధ్యయనం చేస్తున్నట్లుంది. దాని ఫలితంగా వాళ్ళు చదివిన దాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. వాళ్ళు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లను పాక్షికంగా వుదహరించగలరే తప్ప, వారి దృక్పథాన్ని, పద్ధతిని ఆసరా చేసుకుని చైనా ప్రస్తుత పరిస్థితులను, చైనా చరిత్రను నిర్దిష్టంగా అధ్యయనం చేయడానికిగానీ, చైనా విప్లవ సమస్యల్ని నిర్దిష్టంగా విశ్లేషించి పరిష్కరించడానికిగాని అన్వయించలేరు. మార్క్సిజం-లెనినిజంపట్ల అటువంటి ధోరణి వుండటం, ముఖ్యంగా మధ్యస్థాయి, ఉన్నతస్థాయి కార్యకర్తలకు చాలా హానికరం.

నేను పైన పేర్కొన్న మూడు అంశాలు - నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, చరిత్ర అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, మార్క్సిజం-లెనినిజాన్ని అన్వయించడాన్ని నిర్లక్ష్యం చేయడం... ఇవన్నీ మన కార్య విధానంలో పూర్తి చెడు శైలినే సూచిస్తున్నాయి. దీని వ్యాప్తి వల్ల మన కామ్రేడ్స్‌లో చాలా మందికి హాని జరిగింది.

నిజానికి ఈరకమైన పని విధానం వల్ల మన శ్రేణుల్లోని చాలా మంది కామ్రేడ్స్ తప్పుడు తోవలోకి పోయారు. దేశం, ప్రాంతం, రాష్ట్రాలకు ఇంటా బయట నిర్దిష్ట పరిస్థితుల్ని కూలంకషంగా, క్రమబద్ధంగా పరిశోధించడానికి ఇష్టపడనివాళ్ళు తమ మిడిమిడి జ్ఞానం ఆధారంగా ఆజ్ఞలు మాత్రం జారీ చేస్తారు. "నేను అనుకుంటున్నాను కాబట్టి అది అలానే అయివుంటుంది," అనుకునే స్వీయాత్మక పని విధానం మనలో చాలా మంది కామ్రేడ్స్‌లో ఇప్పటికీ లేదూ?

మన చరిత్ర ఏమీ తెలియకపోవటం, లేదా అతికొద్దిగా తెలియటం మూలంగా సిగ్గుపడడానికి బదులు గర్వించేవాళ్ళు కొంతమంది ఉన్నారు. వాస్తవానికి చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, నల్లమందు యుద్ధం నుండీ వంద సంవత్సరాల చైనా చరిత్ర తెలిసినవాళ్ళు బహుకొద్ది మంది మాత్రమే వున్నారు. గత వంద సంవత్సరాల ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక చరిత్రని అధ్యయనం చేయడాన్ని ఎవరూ తీవ్రంగా పట్టించుకోలేదు. తమ దేశం గురించి ఏమీ తెలియని వాళ్ళు విదేశాల పురాతన కథల్ని మాత్రం వల్లె వేస్తారు. కనీసం ఈ విజ్ఞానం అయినా సమగ్రంగా వుండదు. అది కూడా పాత విదేశీ పుస్తకాల నుండి సంగ్రహించిన మిడిమిడి జ్ఞానమే.

విదేశాల నుండి తిరిగి వచ్చిన విద్యార్థులు ఈ జబ్బుతో చాలా దశాబ్దాలుగా బాధపడ్డారు. ఐరోపా, అమెరికా, జపానుల నుండి స్వదేశానికి తిరిగివచ్చిన వాళ్ళు విదేశీ చిలుకపలుకులు మాత్రమే పలుకుతారు. వాళ్ళు పాడిందే పాడే గ్రామఫోనులుగా మారిపోతారు. కొత్త విషయాలను సృష్టించటం, తెలుసుకోవటం అనే బాధ్యతలను మర్చిపోతారు. ఈ జబ్బు కమ్యూనిస్టు పార్టీలో కూడా ప్రవేశించింది.

మనం మార్క్సిజాన్ని అధ్యయనం చేస్తున్నప్పటికీ, మనవాళ్ళు చాలా మంది అనుసరిస్తున్న అధ్యయన పద్ధతి మార్క్సిజానికి పూర్తిగా విరుద్ధమైనది. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు అందించిన సిద్ధాంతం, ఆచరణల మధ్య ఐక్యత అనే ప్రాథమిక సూత్రాన్ని వాళ్ళు జవదాటుతున్నారు. ఈ సూత్రాన్ని జవదాటుతూ, దీనికి పూర్తిగా వ్యతిరేకమైన సిద్ధాంతాన్ని, ఆచరణ నుండి విడదీసే స్వంత సూత్రాన్ని వాళ్ళు రూపొందించుకుంటున్నారు. పాఠశాలల్లోనూ, ఆచరణలో వున్న కార్యకర్తలకు, తత్వశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు చైనా విప్లవ గతితర్కాన్ని అధ్యయనం చేయటంలో విద్యార్థులకు సలహా ఇవ్వడంలేదు. అర్థశాస్త్రం చెప్పే ఉపాధ్యాయులు చైనా ఆర్థిక వ్యవస్థ విశిష్ట లక్షణాలను అధ్యయనం చేయటంలో వారికి సలహా ఇవ్వటంలేదు. రాజనీతి శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు వారికి చైనా విప్లవ ఎత్తుగడల్ని అధ్యయనం చేయడానికి అవసరమైన సలహాలివ్వటంలేదు. సైనిక శాస్త్రం చెప్పే అధ్యాపకులు చైనా ప్రత్యేక లక్షణాలకు అన్వయించి వ్యూహాలు, ఎత్తుగడల గురించి అధ్యయనం చేయటంలో సలహాలివ్వటంలేదు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నెన్నో, తత్ఫలితంగా వ్యాపిస్తున్న తప్పుడు అభిప్రాయాలు ప్రజలకు బాగా హానికలిగిస్తున్నాయి. ఏనాన్‌లో తాను నేర్చుకున్న దానిని ఫూషన్‌లో ఎలా అన్వయించాలో తెలియని వాళ్ళున్నారు. ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్లు సరిహద్దు ప్రాంత ద్రవ్యానికి, కొమింటాంగ్ ద్రవ్యానికీ మధ్యగల సంబంధాన్ని వివరించలేదు. కాబట్టి విద్యార్థులు కూడా దాన్ని వివరించలేకపోవటం సహజమే. ఈవిధంగా చాలా మంది విద్యార్థులు కూడా దాన్ని వివరించలేకపోవటం సహజమే. ఈ విధంగా చాలామంది విద్యార్థులలో వికృత మనస్తత్వం సృష్టించబడింది. చైనా సమస్యలపట్ల శ్రద్ధ చూపడానికి, పార్టీ ఆదేశాలను చిత్తశుద్ధితో అమలుచేయటానికి బదులుగా వాళ్ళు తమ అధ్యాపకుల దగ్గర నేర్చుకున్న పిడిసూత్రాలే శాశ్వతమైనవనీ, మార్చాల్సిన అవసరం లేదని భావించి, వాటిని ఒంట పట్టించుకుంటారు.

అయితే, ఇప్పుడు నేను చేసిన ప్రస్తావన అంతా మన పార్టీలోని అతి చెడ్డవారిని గురించి. అంతా ఇలా వున్నారని నేనడంలేదు. కానీ ఇలాంటి వాళ్ళు కూడా ఇంకా వున్నారు. అంతకంటే ముఖ్యమైన విషయం

ఏమిటంటే, వాళ్లు కొద్దిమందే వున్నా, వాళ్ల మూలంగా కలిగే హాని మాత్రం చాలా ఎక్కువే. ఈ విషయాన్ని తేలికగా భావించకూడదు.

ఈ భావాన్ని మరింత వివరించటంకోసం రెండు భిన్న దృక్పథాలను పోల్చుతాను.

**మొదటిది స్వీయాత్మక ధోరణి.**

ఈ ధోరణిలో వున్నవాడు పరిసరాలను క్రమబద్ధంగాను, క్షుణ్ణంగాను అధ్యయనం చేయలేడు. అతను స్వీయాత్మకమైన వుత్తేజంతో పని చేస్తాడు. ఈనాటి చైనా స్వరూపాన్ని అస్పష్టంగా మాత్రమే చూడగల్గుతాడు. ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి చరిత్రను సమగ్రంగా అవగాహన చేసుకోలేడు. అతనికి ప్రాచీన గ్రీకు దేశం గురించి తెలుసుగాని చైనా గురించి తెలీదు. అతను నిన్న మొన్నటి చైనా గురించి అయోమయంగా వుంటాడు. ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని అవాస్తవికంగా, లక్ష్యం లేకుండా అధ్యయనం చేస్తాడు. చైనా విప్లవంలోని సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించేందుకు అవసరమైన దృక్పథాన్ని, పద్ధతిని తెలుసుకోవటంకోసం కాక కేవలం సిద్ధాంత పరిజ్ఞానంకోసమే సిద్ధాంతం అన్న ధోరణిలోనే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లను అధ్యయనం చేస్తాడు. అతను లక్ష్యానికి గురిచూసి బాణం వేయడానికి బదులు తన ఇష్టం వచ్చినట్లు బాణాలు వదులుతాడు. మనం భౌతిక వాస్తవాలమీద ఆధారపడాలని, ఆచరణలో మార్గదర్శకంగా ఉపయోగపడే సూత్రాలను వాటినుండి గ్రహించాలని మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు ప్రబోధించారు. దానికోసం మనం మార్క్స్ చెప్పినట్లుగా వివరంగా సమాచారాన్నంతటినీ రాబట్టి, దాన్ని శాస్త్రీయ విశ్లేషణకు గురిచేయాలి. మనవాళ్లు చాలా మంది ఇలా చేయకపోగా, సరిగ్గా దీనికి భిన్నంగా ప్రవర్తిస్తారు. వాళ్లు చాలా మంది పరిశోధనలు జరుపుతున్నారు. కానీ ఈనాటి చైనా గురించిగానీ, గతకాలపు చైనా గురించిగానీ అధ్యయనం చేయాలన్న కుతూహలం వాళ్లకులేదు. వాస్తవంతో సంబంధంలేనీ, పనికిరాని 'సిద్ధాంతాల' అధ్యయనంపట్ల మాత్రం ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఇంకా చాలా మంది ఆచరణ చేపడుతున్నారు. కానీ వాళ్లు కూడా భౌతిక పరిస్థితుల అధ్యయనంపట్ల ఏమాత్రం శ్రద్ధ చూపరు. ఉత్త వుత్సాహం మీద ఆధారపడి, సిద్ధాంతాలకి బదులు వాళ్ల వాళ్ల వ్యక్తిగత అనుభూతుల్ని ఏర్పరుచుకొంటారు. ఈ రెండు రకాలకు చెందిన వాళ్లు కూడా స్వీయాత్మకతమీద ఆధారపడి భౌతిక వాస్తవాల అస్తిత్వాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. వాళ్లు ఉపన్యాసాలు ఇచ్చేటప్పుడు ఎ, బి, సి, డి, 1, 2, 3, 4 అంటూ వివిధ హెడ్డింగుల కింద అంశాలు చెప్పుకుంటూపోతారు. వ్యాసాలు రాసేటప్పుడు అతిశయోక్తులు వాడుతారు. వాస్తవాల నుండి నిజం గ్రహించాలనే ఉద్దేశ్యం వారికిలేదు. ఏదో విధంగా నమ్మకం కలిగించి ఇతరులచేత మంచి అనిపించుకోవాలనుకుంటారు. వారు సరుకు లేకుండా పైపై మెరుగులు ప్రదర్శిస్తారు. ఏమాత్రం గట్టితనంలేని ఓటితనానికిపోతారు. తాము ఎప్పుడూ ఒప్పులే చేస్తారు, ఈ భూమిపై తమదే మొదటి శ్రేణి అధికారం అనుకుంటూ "రాచరికపు రాయబారుల"లాగా ప్రతి చోటకీ పరిగెడుతుంటారు. మన శ్రేణుల్లోని కొంతమంది కామ్రేడ్‌ల పని విధానం ఇలా వుంది. ఈ రకమైన నడవడిక, ప్రవర్తనల ద్వారా తమకి తాము హాని కలిగించుకుంటారు. ఇతరులకు దీనిని బోధించటంవల్ల వాళ్లకి కూడా హాని కలుగుతుంది. విప్లవాన్ని నడపటంలో దాన్ని ఉపయోగించటం వల్ల విప్లవానికి హాని చేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే, శాస్త్రీయ విజ్ఞానానికి, మార్క్సిజం-లెనినిజానికి విరుద్ధమైన ఈ స్వీయాత్మక ధోరణి కమ్యూనిస్టు పార్టీకి, శ్రామికవర్గానికి, ప్రజలకి, దేశానికి ప్రబల శత్రువు. పార్టీలోని చెడు అంతా ఈ రూపం ధరిస్తుంది. మనముందున్న శక్తివంతమైన శత్రువుపైన చావుదెబ్బ తీయాలి. స్వీయాత్మక ధోరణిని నాశనం చేయగలిగితేనే మార్క్సిజం-లెనినిజం అనే సత్యం వర్ధిల్లుతుంది. పార్టీ శక్తివంతమవుతుంది. విప్లవం విజయవంతమవుతుంది. శాస్త్రీయ దృక్పథం లేకపోవడం అంటే సిద్ధాంతాన్ని, ఆచరణను మేళవించాలనే మార్క్సిస్టు-లెనినిస్టు ధోరణి లేకపోవటం; అంటే పార్టీ ఉత్తేజంలేదనీ, ఉన్నా తక్కువగా వుందని మనం భావించాలి. ఈ రకమైన వాళ్లని వర్ణించడానికి ఒక గేయం వుంది. అది:

"గోడమీద పిచ్చి మొక్క-దాని తలబరువు, కాడసన్నం, వేరు శూన్యం; కొండల్లో వెదురు మొలక-దాని నాలుక బహుపదును, చర్మం దళసరి, లోనబోలు."

శాస్త్రీయ దృక్పథంలేని వాళ్లని, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల రచనల్లోంచి వాక్యాలను అదే పనిగా ఉటంకించడం మాత్రమే చేయగలవాళ్లని, వాస్తవ పరిజ్ఞానం లేకపోయినా అనవసరమైన ప్రతిష్టనిపొందే వాళ్లని ఈ గేయం చక్కగా వర్ణించదూ? తనలో వున్న ఈ లోపాన్ని సవరించుకోవాలని ఎవరైనా నిజంగా భావిస్తుంటే వాళు ఈ గేయాన్ని బాగా మనసుకు పట్టించుకోవాలి, లేదా మరింత ధైర్యం చూపి దాన్ని తన గది గోడకి అంటించుకోవాలని సలహా. మార్క్సిజం-లెనినిజం ఒక శాస్త్రం. శాస్త్రం అంటే నిజాయితీతో కూడుకున్న నిర్దిష్టమైన విజ్ఞానం. దాంతో ఇష్టం వచ్చినట్లుగా నాటకలాడటానికి వీలులేదు. కాబట్టి ఈ విషయంలో మనం చిత్తశుద్ధి చూపాలి.

**రెండవది, మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం.**

ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని, పద్ధతిని, చుట్టూ వున్న పరిస్థితుల అధ్యయనానికి, క్రమబద్ధమైన క్షుణ్ణమైన పరిశోధనకు అన్వయిస్తాడు. అతను ఉత్త ఉత్సాహంతో మాత్రమే పని చేయడు. స్టాలిన్ చెప్పినట్లు, అతడు విప్లవ ఊపుని ఆచరణతో మిళితం చేస్తాడు. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి చరిత్ర అసమగ్రంగా చదవడు. పురాతన గ్రీకు దేశం గురించి తెలుసుకోవడంచాలదు. అతను చైనా గురించి తప్పక తెలుసుకోవాలి. విదేశాల విప్లవాల చరిత్రేగాక చైనా విప్లవ చరిత్ర కూడా తెలుసుకోవాలి. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి మార్క్సిజం-లెనినిజాన్ని ఒక లక్ష్యంతో అధ్యయనం చేస్తాడు. అంటే, అతను మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా వాస్తవ విప్లవోద్యమంతో సమన్వయపరుస్తాడు. చైనా విప్లవం ఎదుర్కొంటున్న సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన

సమస్యల్ని ఈ సిద్ధాంత వెలుగులో పరిష్కరించబూనుకుంటాడు. ఇది లక్ష్యాన్ని గురిచూసి బాణం వేసే దృక్పథం. చైనా విప్లవం 'లక్ష్యం' అయితే, మార్క్సిజం-లెనినిజం 'బాణం' అవుతుంది. చైనా విప్లవం, తూర్పు విప్లవాలు అనే లక్ష్యాలను గురిచూసి కొట్టడం కోసం చైనా కమ్యూనిస్టులు ఈ బాణాన్ని చేపట్టారు. ఈ రకమైన దృక్పథాన్ని అవలంభించటం వల్ల వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించగల్గుతాం. భౌతికంగా వున్న అన్ని వస్తువులు "వాస్తవాలే." వాటి అంతర్గత సంబంధాలను నిర్దేశించే సూత్రాలే "సత్యం." ఈ సత్యాన్ని "గ్రహించడం" అంటే అధ్యయనం చేయడం. మనం దేశం, గ్రామం, జిల్లాల్లోనూ, వాటి బయటవున్న వాస్తవ పరిస్థితుల అధ్యయనంతో మొదలుపెట్టి, ఊహాజనిత సూత్రాలను విడనాడి, ఈ వాస్తవ పరిస్థితుల్లో అంతర్గతంగా వుండే సూత్రాలను మన ఆచరణకు మార్గదర్శకంగా గ్రహించాలి. అంటే, మన చుట్టూ జరుగుతున్న సంఘటనలలోని అంతరంగిక సంబంధాలన్నీ కనుక్కోగలగాలి. ఈ విధంగా చెయ్యాలంటే మనం స్వీయాత్మక ఊహలమీదగాని, తాత్కాలికమైన ఉత్సాహం మీదగాని, జీవంలేని పుస్తకాల మీదగాని ఆధారపడకూడదు భౌతిక వాస్తవాల మీదనే ఆధారపడాలి. వివరాల్ని విపులంగా సేకరించాలి. మార్క్సిజం-లెనినిజం సాధారణ సూత్రాల వెలుగులో ఆ వివరాల నుండి సరియైన అంతిమ నిర్ణయాలకు రాగలిగాలి. ఈ నిర్ణయాలు అతిశయోక్తులూ కావు, ఉత్త అంకెల పట్టీలూకావు. ఇవి శాస్త్రీయమైన నిర్ణయాలు. ఇది వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించే దృక్పథం. అంతేగానీ, ఏదో విధంగా ఇతరులచేత మంచి అనిపించుకునే దృక్పథంకాదు. ఇది పార్టీ ఉత్తేజం యొక్క వ్యక్తీకరణ. ఇది సిద్ధాంతాన్ని ఆచరణతో సమన్వయపరిచే మార్క్సిస్టు-లెనినిస్టు వైఖరి. ఇది ప్రతి కమ్యూనిస్టు సభ్యుడు కనీసంగానైనా కలిగి వుండాల్సిన దృక్పథం. ఈ దృక్పథాన్ని చేపట్టేవారు "తలబరువు, కాడసన్నం, వేరు శూన్యం"గానూ వుండరు, "పదును నాలిక, దళసరి చర్మం, లోనబోలు"గానూ వుండరు.

పైన వివరించిన అభిప్రాయాలకు అనుగుణంగా నేను ఈ సూత్రీకరణలు చేయదల్చుకున్నాను.

1. మన చుట్టూ వున్న పరిస్థితుల్ని క్రమబద్ధంగానూ, క్షుణ్ణంగానూ అధ్యయనం చేయాల్సిన కర్తవ్యాన్ని మనం పార్టీ ముందు వుంచాలి. మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం, పద్ధతుల పునాదిమీద మన శత్రువుల, మిత్రుల, మన ఆర్థిక, ద్రవ్య సంబంధ, రాజకీయ, సైనిక, సాంస్కృతిక, పార్టీ సంబంధమైన కార్యకలాపాల్ని వివరంగా పరిశీలించాలి. వాటిలోని మార్పుల్ని అధ్యయనం చేయాలి. అపుడు వాటిలో నుండి సరియైన, అవసరమైన నిర్ణయాలకు రాగలగాలి. ఈ లక్ష్యంతోటే ఈ అంశాలమీద పరిశోధన, అధ్యయనం చేయటంపై మన కామ్రేడ్స్ దృష్టిని కేంద్రీకరించాలి. పరిస్థితులు తెలుసుకోవడం, సిద్ధాంతం మీద పట్టు సంపాదించడం అనేవి రెండూ కమ్యూనిస్టు పార్టీలో అగ్రగామి స్థాయిలో వున్న సంస్థల ప్రాథమిక కర్తవ్యాలనే విషయాన్ని మన కామ్రేడ్స్ అర్థం చేసుకొనేటట్లు చేయాలి. పరిస్థితులు తెలుసుకోవడం అంటే ప్రపంచాన్ని తెలుసుకోవడం, సిద్ధాంతం మీద పట్టు సంపాదించడం అంటే ప్రపంచాన్ని మార్చడం అనీ అర్థం. పరిశోధన జరపని వాళ్లకు మాట్లాడే హక్కులేదని మన కామ్రేడ్స్ అర్థం చేసుకునేలా చేయాలి. వాగాడంబరం, దృగ్గోచర విషయాలను కేవలం 1, 2, 3, 4 అంటూ వరసక్రమంలో పెట్టడం చాలదని వారికి తెలియజేయాలి. ఉదాహరణకి ప్రచార కార్యక్రమాన్ని తీసుకోండి. మన శత్రువులు, మిత్రులు మనం సాగిస్తున్న ప్రచార కార్యక్రమం గురించిన పరిస్థితి మనకు తెలియకుండా మనం సరియైన ప్రచార సూత్రాలను రూపొందించలేం. ఏ విభాగానికి సంబంధించిన విషయంలోనైనా వాస్తవ పరిస్థితిని ముందు తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే సక్రమంగా పని చేయగలం. పరిశోధనకు, అధ్యయనానికి అవసరమైన ప్రణాళికను పార్టీ అంతటా రూపొందించుకోవడం అనేది పార్టీ పని విధానంలో మార్పు తీసుకురావడానికి మౌలికమైన అంకెగా ఉపయోగపడుతుంది.

2. గత వంద సంవత్సరాల చైనా చరిత్రకు సంబంధించినంత వరకు అర్హులైన వ్యక్తులందరినీ సమావేశపరచాలి. వాళ్లు పని విభజన చేసుకుని పరస్పరం సహకరించుకుంటూ దాన్ని అధ్యయనం చేయాలి. ఇలా చేయడం ద్వారా మాత్రమే ప్రస్తుతం వున్న అస్తవ్యస్థ పరిస్థితి నుండి బయటపడగలం. ముందుగా ఆర్థిక చరిత్ర, రాజకీయ చరిత్ర, సైనిక చరిత్ర, సాంస్కృతిక చరిత్ర వంటి వివిధ రంగాలలో విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే సమన్వయ పూరితమైన అధ్యయనం సాధ్యపడుతుంది.

3. ఆచరణలో నిమగ్నులైన కార్యకర్తలకు, లేదా కార్యకర్తల కోసం నిర్వహించే పాఠశాలల్లోను విద్యకు సంబంధించి, పార్టీ ఈ కింది సూత్రీకరణను ఏర్పాటు చేసుకోవాలి. అదేమంటే, చైనా విప్లవంలోని ఆచరణకు సంబంధించిన సమస్యలను మార్క్సిజం-లెనినిజం వెలుగులో అధ్యయనం చేయడానికి వుపయోగపడే విద్యను అందించాలి. మార్క్సిజం-లెనినిజాన్ని ఒక జడ పదార్థంగా, ఒంటరి ధోరణిగా అధ్యయనం చేసే పద్ధతిని విడనాడాలి. అంతేగాక, మార్క్సిజం-లెనినిజాన్ని అధ్యయనం చేయడానికి "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ చరిత్ర (బోల్షివిక్) సంక్షిప్త పాఠం"ను ప్రధానమైన పాఠ్యాంశంగా తీసుకోవాలి. అది అన్నిటికన్నా మెరుగైన సమన్వయం; అది గత వంద సంవత్సరాల ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సారాంశం. సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేయడంలో ప్రపంచంలో ఇంతవరకు ఎన్నడూలేని సమగ్రమైన నమూనా. లెనిన్, స్టాలిన్‌లు మార్క్సిస్టు విశ్వజనీన సత్యాన్ని రష్యా విప్లవ నిర్దిష్ట ఆచరణతో ఎలా సమన్వయం చేశారో, అలా చేయడం ద్వారా మార్క్సిజాన్ని మరింతగా ఎలా అభివృద్ధి చేయగలిగారో చూడటం ద్వారా మనం చైనాలో ఎలా పని చేయాలో తెలుసుకోగలుగుతాం.

ఇప్పటికే ఆ విషయాలను పదే పదే చెప్పుకున్నాం. కానీ సాధారణంగా తప్పులు చేయకుండా సత్యాన్ని గ్రహించడం సాధ్యంకాదు. మనం మన అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకోవడంవల్ల సజీవమైన, సుసంపన్నమైన చైనా, ప్రపంచ విప్లవాలకు సంబంధించి సత్ఫలితాలను పొందగలమని నేను గాఢంగా నమ్ముతున్నాను.

★

# హక్కులు పొందడం కన్నా బిచ్చం తెచ్చుకోవడం గొప్పదా?

# ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రత్యేక హోదా హక్కును కాదని ప్రత్యేక ప్యాకేజీనిచ్చింది కేంద్రం

# అదే గొప్ప అని నమ్మ బలుకుతున్నారు ఆంధ్రా పాలకులు

ప్రత్యేకహోదా కావాలని డిమాండ్ చేసిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 7న ప్రకటించింది. ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజల నోట్లో ఈ ప్యాకేజీ బెల్లం ముక్క కుక్కి ఇదే తియ్యనైనది, లాభదాయకం అని వెంకయ్య, చంద్రబాబులు నాటకీయంగా మాట మారుస్తున్నారు. ఏది మంచిదో, ఏది పరిమితమైనదో ప్రజలకు తెలియదని, హోదా కన్నా ప్యాకేజీనే లాభదాయకమని చెప్పి కేంద్రం ఇచ్చింది పుచ్చుకుని వచ్చారు. ప్రజల దగ్గర, మీడియాలో దీనిని సాధించడానికి ఎంతో కష్టపడినట్లు ఫోజులు కొడుతున్నారు. విమర్శించినవాళ్ళ నోళ్ళు మూయిస్తున్నారు. మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో 5సం॥లు హోదా ఇస్తామన్నది, వెంకయ్యనాయుడు 10 సం॥లు, చంద్రబాబు 15 సం॥లు కావాలని డిమాండ్ చేసినది హోదా కోసమే గాని ప్యాకేజీ కోసం కాదు. ఇప్పుడు వాళ్ళు మాటలు మార్చి ప్రజలను వంచించడానికే సిద్ధపడుతున్నారు. కేంద్రం ఇచ్చే బిచ్చం కూడా ప్రజలకందకుండా ఎగరేసుకుపోయేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

1. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2. 2014 ఫిబ్రవరి 20న పార్లమెంటులో ఆనాటి ప్రధాని చేసిన ప్రకటన, 3. నీతి ఆయోగ్ 2015 నివేదిక, 4. 14వ ఆర్థిక సంఘ నివేదికల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం సహాయం అందించాలి. ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ప్రత్యేక హోదానే ఎత్తేసింది. అసలు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రణాళికా సంఘాన్నే రద్దుచేసింది. హక్కుగా ఇవ్వాల్సింది ఇవ్వకుండా దయతో ఇస్తున్నాం. తీసుకుని వెళ్ళండి అంటున్నారు. అది తీసుకోకపోతే ఆ మాత్రం కూడా దక్కదంటూ, కేంద్రానికి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు చంద్రబాబునాయుడు, వెంకయ్యనాయుడు. ఇక ప్రతిపక్షాలు ఒక స్థిరమైన విధానంతో కొట్లాడే పరిస్థితి కానరావడంలేదు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన రాజకీయాల్లో క్షీణించి కోలుకోడానికి అవకాశవాదంతో ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తున్నా ప్రజలకు విశ్వాసం కలగలేదు. పట్టించుకునే వారు లేరు. పవన్‌కళ్యాణ్ ప్రత్యేకహోదా డిమాండ్‌ను ఫోకస్ చేస్తూ రాజకీయాల్లోకి వచ్చి లబ్ధి పొందాలనుకుంటున్నాడు. అందుకే బలప్రదర్శనలు చేస్తున్నాడు. సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నొప్పి తగలకుండా కాపాడుతున్నాడు. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక హోదా డిమాండ్ సాధనపట్ల చిత్తశుద్ధి లేదు. టీ.డీ.పీ. ప్రభుత్వాన్ని విమర్శించి ఓట్లు సంపాదించే నినాదంగా మాత్రమే చూస్తుంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాయలసీమ కరువు పరిష్కారం పట్ల శ్రద్ధతో అది కృషి చేయడం లేదు. ఆ పార్టీ చేసే వీరంగం అంతా క్రమశిక్షణ లేని అరాచకంగా కొట్టి వేయబడుతుంది.

వచ్చిందే పంచుకు తిందాం. ప్రజలేమయిపోతే ఏంటి? ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అంటే పాలకవర్గాల అభివృద్ధే కదా? హక్కుగావస్తే ప్రజలకు హక్కుంటుంది. స్పెషల్ ప్యాకేజీగా వచ్చింది మనకు అనుకూలంగానే ఇస్తారు. వాటాలు సరిగా ఇస్తే సర్దుకుపోవచ్చని దళారీ పాలకులు సర్దుబాట్లు చేసుకుంటున్నారు. ప్రపంచబ్యాంకుకు గతంలో ఆంధ్రప్రదేశ్‌ను తాకట్టుపెట్టిన చంద్రబాబు, రాజధాని నిర్మాణం పేరుతో నేడు ప్రభుత్వాన్నే దళారీగా మార్చిన చంద్రబాబు, భవిష్యత్తులో ప్రత్యేక ప్యాకేజీతో లాభపడాలనుకుంటున్నాడు. ఆంధ్రప్రదేశ్ విడిపోయి రెండున్నర సం॥లు గడిచాక ఇచ్చే వేలకోట్ల రూపాయల నిధులు రాజకీయ నాయకుల, కాంట్రాక్టర్ల జేబుల్లోకి చేరే విధంగా తెరవెనుక కథలు నడిచాయన్నది వారి వ్యవహారశైలిలోనే కనబడుతున్నది. సహాయం పేరుతో స్పెషల్ ప్యాకేజీ ఉదారంగా, దయతో కేంద్రం యిస్తున్నట్లుగా చెపుతున్నారు.

1969లో చర్చ మొదలై ఐదవ ఆర్థిక సంఘం సిఫార్స్‌తో అమలులోకి వచ్చిన 'ప్రత్యేకహోదా' అనే చట్టపరమైన హక్కు కొత్తగా ఏర్పడిన, వెనుకబడిన, కొన్ని ప్రత్యేక పరిస్థితులున్న రాష్ట్రాలకు ప్రత్యేక హోదాగా గుర్తించి సహాయం ఇస్తున్నారు. అటువంటి ప్రత్యేక హోదా 11 రాష్ట్రాలలో అమలులో వుంది. అవి జమ్మూ కశ్మీర్, మణిపూర్, నాగాలాండ్, అస్సాం, సిక్కిం, మేఘాలయ, మిజోరాం, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాలు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. దీనిలో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు వివిధ కారణాల వలన వెనుకబడి ఉన్నాయి. కరువు సమస్యతో వర్షాభావ రాయలసీమ తల్లడిల్లుతున్నది. ఇప్పుడు రాష్ట్రానికి రాజధాని నిర్మాణం కొత్తగా చేసుకోవాల్సిన ప్రత్యేక పరిస్థితి ఉంది. రాష్ట్రం విడిపోయినపుడు వేలకోట్ల రూపాయల లోటు ఉంది. ప్రత్యేక హోదా పొందడానికి అన్ని రకాల అర్హత ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హక్కును కేంద్రం నిరాకరించడం, కుంటి సాకులు చెప్పడం ప్రజలను మోసగించడమే తప్ప మరొకటి కాదు. టీ.డీ.పీ.తో కలిసి కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న బీ.జే.పీ. 2014 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు రాబట్టు కోవడం కోసం ప్రత్యేక హోదా ఇస్తామని, 10సం॥లు ఆ హోదా ఉండాలని మాట్లాడిన నాయకులు మోడీ, వెంకయ్యనాయుడు ఇప్పుడు కుట్ర పూరితంగా స్పెషల్ ప్యాకేజీతో సరిపుచ్చుకోవడమే అధికలాభం అని వంచిస్తున్నారు. ఎన్.డీ.ఏ. భాగస్వామి టీ.డీ.పీ. రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా ప్రజలకు హక్కుగా రావలసిన దానికోసం గట్టిగా కొట్లాడకుండా రాజీధోరణితో ప్రజలకు అన్యాయం చేస్తుంది. చంద్రబాబు తన దళారీ స్వభావాన్ని

మరోసారి నిరూపించుకున్నాడు.

రాష్ట్రాల విభజన నాటికి 16 వేల కోట్ల లోటుబడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్ విడిపోయింది. 30 శాతం జనాభా 40 శాతం భూభాగం గల రాయలసీమ లోని 4 కరువు జిల్లాలు, వనరులుండి నిర్లక్ష్యం కారణంగా వెనకబడ్డ ఉత్తరాంధ్ర జిల్లాలు, గుంటూరు జిల్లాలోని పల్నాడు, ప్రకాశం జిల్లాలోని కనిగిరి లాంటి కొన్ని ప్రాంతాలు బాగా వెనకబడి ఉన్నాయి. ఇక్కడ కరువు, రైతాంగ ఆత్మహత్యలు, చేనేత పరిశ్రమ దెబ్బతినడం లాంటి తీవ్ర సమస్యలున్నాయి. లోటు బడ్జెట్ మరియు రాజధాని నిర్మాణ ఖర్చులతో కలుపుకొని అనేక ఖర్చులున్న ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అవసరం ఉంది. 5 కోట్ల మంది ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న అభివృద్ధికి తోడ్పడవలసి ఉంది. వివిధ పేర్లతో ఇచ్చే ప్రత్యేక ప్యాకేజీని ప్రత్యేక హోదాతో పోల్చలేం. హక్కుగా, చట్టబద్ధంగా రావలసింది రాకుండా చేసి దయతో, ఉదారంగా సహాయం పేరుతో బిచ్చం ఇవ్వడం వివక్ష చూపి అవమానించడం తప్ప ఇంకొకటి కాదు. ఇది ఎప్పటికీ అణిగిమణిగి ఉండేలా చూసుకునే విధానం తప్ప మరొకటి కాదు. ప్రత్యేక హోదా కల్పిస్తే చట్టబద్ధత వస్తుంది. రాష్ట్రంలో అధికార పార్టీకి రాజకీయ స్వేచ్ఛ వస్తుంది. టీ.డీ.పీ.ని తన కౌగిలి నుండి జారిపోకుండా, ఆంధ్ర ప్రజలను కేంద్రం పట్టులో బిగించడానికే కేంద్రం ప్రత్యేక హోదాను ఇవ్వడం లేదు.

రెండున్నర సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా అంశాన్ని నానబెట్టి ఏ.పీ.కే కాదు భవిష్యత్ లో ఏ రాష్ట్రానికి కూడా ప్రత్యేక హోదా ఇచ్చేది లేదన్నారు. ఇది 14వ ఆర్థిక సంఘం సిఫార్స్ అన్నారు. ఇప్పుడు ప్రణాళిక సంఘాన్ని రద్దు చేశారు. నీతి ఆయోగ్ తెచ్చారు. ఎన్.డీ.ఏ. ప్రభుత్వం 10 సంIIల ప్రత్యేక హోదా వాగ్దానాన్ని విస్మరించి ప్రజల్ని మోసం చేయడానికి సిద్ధపడింది. కేంద్ర మంత్రివర్గంలో పదవులు తీసుకుని తెలుగుదేశం పార్టీ ఆ మోసంలో భాగమయ్యింది. మేం ఇంత చేసాం! అంత చేసాం అని దబాయిస్తున్న నాయుళ్లిద్దరూ ఎంత మోసం చేశారో అర్థమయ్యాక ప్రజల్లో ఆ పార్టీల నిజ స్వభావం బహిరంగమయ్యాక ఆ గొప్పలన్నీ తిరగబడతాయని గుర్తించుకోవడం లేదు.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్తీకరణ చట్టం 2014 మీద పార్లమెంటులో చర్చ జరిగినపుడు, విడిపోయాక ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా దెబ్బతింటుందని, అందువల్ల దానికి అదనపు సౌకర్యాలు, వసతులు, నిధులు సమకూర్చాలని ఆనాడు ప్రతిపక్షంగా బీ.జే.పీ. గట్టిగా వాదించింది. ప్రత్యేక ప్రతిపత్తిగల రాష్ట్రంగా గుర్తించాలని, అటువంటి హామీ ఇవ్వకపోతే బిల్లును వ్యతిరేకిస్తామని, ఓటింగుకు వెడతామని బెదిరించింది. ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే 10 సంIIలు ప్రత్యేక హోదా కల్పిస్తామని వాగ్దానం చేసింది. నేడు అధికారంలో ఉన్న చంద్రబాబు కూడా అదే విధంగా మాట్లాడి 15 సంIIల ప్రత్యేక హోదా కోసం కొట్లాడుతానన్నాడు. ఇప్పుడు మాట మార్చి ఇద్దరూ జంటగా గొంతులు కలిపి ఒకే పాట పాడుతున్నారు. విమర్శిస్తున్నవారిని మూర్ఖులని ఎదురుదాడికి దిగుతున్నారు. ఏరుదాటాక తెప్పతగలేస్తున్నారు. మరో మాటలో ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని బోడి మల్లయ్యలను చేస్తున్నారు.

ప్రత్యేక హోదా కన్నా మెరుగైన ప్యాకేజీ ఇస్తామని, హోదాకు కాలం చెల్లి పోయిందని, ప్యాకేజీనే ఉపయోగకరమని, ఆంధ్రప్రదేశ్‌కు నిరంతరసాయం అందిస్తామని, హోదాకు తగ్గ సాయం చేస్తామని, లక్ష కోట్లకు పైగా ప్రయోజనం వుంటుందని, ఏ.పీ.ని ప్రత్యేక రాష్ట్రంగానే కేంద్రం గుర్తిస్తుందని, రాష్ట్రానికి ఇప్పటికే ప్రాజెక్టులు, సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కర్మాగారాలు మంజూరు చేశామని, ముందుగానే అన్ని ఇచ్చేశాం అని అబద్ధాలు అద్భుతంగా చెప్పటం మొదలుపెట్టారు. ఇచ్చింది ఎంత? వచ్చింది ఎంత? వాళ్ళు పంచుకు తిన్నది ఎంత? ఈ లెక్కలు తేలడం కష్టం. ప్రజలకు చేరింది మాత్రం ఏమీలేదు. ప్రజలకిచ్చింది 'సున్నా'. ఇది మాత్రం నిజం. ఇది సత్యం. నేను ఇప్పటికీ 15 సంIIల ప్రత్యేక హోదా కోసమే కొట్లాడుతాను అని చంద్రబాబు నాయుడు ఇంకా ప్రజల్ని మోసం చేయడానికి చూస్తున్నాడు. ప్రత్యేక హోదా రాలేదు. ఇక రాదు. ఈ పేరుతో ఏం జరిగింది. ఏం జరగబోతుంది. తెలుసుకోవడం అవసరం.

ప్రత్యేకహోదా రాదని చంద్రబాబుకు తెలుసు. ప్రతిపక్షాలకు కూడా స్పష్టమే. ఆ నినాదం ఎన్నికల్లో ఓట్లు, అధికారం తెస్తుందని తెలుసు. అధికారంలోకి వచ్చాక కూడా అదే నినాదం. తాము నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల నుండి కాపాడేందుకు తమ అవినీతిని దాచుకునేందుకు, తమ పాలనలో లోపాలు కప్పిపుచ్చుకునేందుకు ఒక సాధనంగా ఈ డిమాండ్ ఉపయోగపడింది. ప్రతిపక్షాలకు కూడా ప్రజల్ని పక్కదారి పట్టించడానికి, ప్రభుత్వాన్ని విమర్శించడానికి తోడ్పడింది. మేధావుల్ని భ్రమల్లో ముంచి, ప్రజల్ని మోసం చేసి పాలక పార్టీలన్నీ ఈ డిమాండ్ చుట్టూ పరుగులెత్తించాయి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌తో వీరంతా చెలగాటమాడుతున్నారు.

నిబంధనల ప్రకారం స్పెషల్ క్యాటగిరీ సాధ్యం కాదని అంటున్న కేంద్ర ప్రభుత్వం లోని నాయకులకు ప్రత్యేక హోదా 10 సంIIల డిమాండ్ చేసినపుడు ఈ విషయం తెలియదనుకోవాలా? ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశం చుట్టూ 2 సంIIలకు పైగా ప్రజల్ని ఆకర్షించిన పాలకపక్షాలు దానిని సాధించడం లేదు. కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు తమ దళారీ స్వభావం రీత్యా ఒక ఒప్పందం కుదుర్చుకుని రాబోయే లాభాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా పంచుకు తినడానికి సిద్ధమయ్యారు. దానిపేరు స్పెషల్ ప్యాకేజీ. రాజమార్గంలో కాకుండా దొడ్డిదారిన అన్నీ ఇస్తాం. ఆంధ్రప్రదేశ్ పట్ల ప్రత్యేక శ్రద్ధతో ఇలా చేస్తున్నాం అంటున్నారు కేంద్ర పాలకులు. ఏదో ఒకటి ఇచ్చినప్పుడే తీసుకోవాలి. లేకుంటే అది కూడా దక్కదు అని రాష్ట్ర పాలకులు నమ్మబలుకుతున్నారు. అదే విజ్ఞత, గౌరవం అంటూ మీడియా భజన చేస్తుంది. దీనిని కాదన్నవారు, విమర్శించిన వారు అజ్ఞానులు, బాధ్యత తెలియనివారు అవుతారట. వెంకయ్యానాయుడు, చంద్రబాబు,

అరుణ్‌జైట్లీ, మోడీల మంత్రాంగం ఇదే.

ప్రత్యేక ప్యాకేజీ దళారీ పాలకవర్గాలకు వరప్రసాదమే. ఎటువంటి నిబంధనలు లేకుండా నిధులు వచ్చి పడుతుంటే వారికి పరమానందం. పోలవరం, గాలేరు-నగరి, హంద్రీ-నీవా లాంటి సాగునీటి పథకాల నిర్మాణ ఖర్చులు పెంచి తమ వారి బ్యాంకు బ్యాలెన్స్ పెంచుకున్న వారికి ఇది ఆమోదమే. ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూర్చే ప్రత్యేక ప్యాకేజీని కోరకుండా ఎవరైనా పరోక్ష ప్రయోజనాలు కలిగించే ప్రత్యేక హోదా కోరుతారా? అసలు చంద్రబాబుకు ప్రత్యేక ప్యాకేజీనే గిట్టుబాటు వరం. కేంద్రానికి, వెంకయ్యనాయుడికి దండిగానే లాభాలవాటా అందే హామీ దొరికింది కనుకనే దీనికి ఇంత ఆరాటం, ఇంత పెద్ద ఎత్తున సమర్థన. అరచేతిలో వైకుంఠం చూపిస్తూ లక్షల కోట్లతో అభివృద్ధిని 'గాలిలో మేడలు కడుతూ' వర్ణిస్తున్నారు.

రాజధాని నిర్మాణంలో జరిగిన అవినీతి, పచ్చని భూముల్లో జరిగిన జన విధ్వంసం, రియల్ ఎస్టేట్ వ్యాపారం అన్నీ రాష్ట్ర ప్రభుత్వం దళారీ స్వభావాన్ని కళ్ళకు కట్టినట్లు చెపుతున్నాయి. ఇప్పుడు స్పెషల్ ప్యాకేజీలో ఎంత అవినీతి, మోసం, కుట్ర దాగి ఉంటాయో చెప్పనవసరం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో నిత్యం కరువు పరిస్థితుల్లో ఉన్న రాయలసీమకు కరువు తీరే మార్గం కనబడుతుందా? అన్ని రకాల వనరులున్నా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం నుండి బయటపడే మార్గం కానవస్తుందా? గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతం, ప్రకాశం జిల్లా వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధి సూచికలున్నాయా? కేంద్ర, రాష్ట్రాలు చెప్పిన లెక్కలు, ఇచ్చిన డబ్బులు అక్కడికి చేరతాయని నమ్మకం లేదు. ఇప్పటికే ఇచ్చిన వాటిల్లో ఒక్కటి కూడా అక్కడికి అందినది లేదు. ఇక ముందు అందవు. మధ్యలో దళారులున్నారు. పంపకాలు ముందే జరిగిపోయి గుట్టుచప్పుడు కాకుండా నడిచిపోతున్నాయి. కాలం గడుస్తుంది. కాకమ్మ కథలు మరింత పకడ్బందీ కథనాలతో ముందుకు వస్తాయి. రేపు మరో నినాదంతో మరో ఆరోపణతో వీళ్ళే ప్రజల్ని మోసం చేస్తూ పక్కదారి పట్టిస్తారు. పాలక, ప్రతిపక్ష పార్టీల మధ్య ఈ మేరకు ఒక ఒప్పందం ఉంటుంది. మీడియా వీరి చేతుల్లో ఉండి మంచి మసాలాతో సర్వం సిద్ధపరుస్తుంది. ప్రత్యేక హోదా దాటిపోయింది. ప్రత్యేక ప్యాకేజీని దాటి రేపు ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్ రాయలసీమ, ఉత్తరాంధ్రల నుండి రాకపోతే భవిష్యత్ ఆశ్చర్యపోవాల్సిందే.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన ప్రకటనలో ప్రత్యేక హోదా ఒక అంశమే. మరో ఆరు విషయాలు దానిలో ఉన్నాయి. 1. ప్రత్యేక హోదా 2, రెండు రాష్ట్రాలలోనూ పారిశ్రామికాభివృద్ధికి పన్ను రాయితీలు 3. ఒడిశాలో కోరాపుట్ బోలంగిరి కల్హాండి (కె.వి.కె.)లోనూ, యూపీ ఎంపీలకు చెందిన బుందేల్‌ఖండ్ లోనూ అమలు చేస్తున్న ప్రత్యేక ప్యాకేజీ తరహాను ఏపీకి వర్తింపచేయడం 4. పోలవరం పునరావాసం 5. సిబ్బంది, ఆర్థిక వనరుల కేటాయింపు, 6.14వ ఆర్థికసంఘం సిఫార్సుల వరకూ ఆగకుండానే రెవెన్యూ లోటు భర్తీ. ఇవన్నీ చెప్పిన తర్వాత ముగింపులో మన్మోహన్ అన్న మాట మరింత ముఖ్యమైనది. "ఈ చర్చల ద్వారా మేము కేవలం తెలంగాణ ఏర్పాటుకేగాక సీమాంధ్ర సౌభాగ్య సంక్షేమాలకు గట్టిగా కట్టుబడి వున్నామని తెలియజేయదలచాము" అని పేర్కొన్నాడు. కాంగ్రెస్ తప్పోప్పులు, బీజేపీ, టీడీపీ విశిష్టతల గురించి దండకాలు చదివేబదులు ఈ మాటల స్ఫూర్తిని గుర్తించడం బాధ్యతగల నాయకుల కర్తవ్యం. ఆ బాధ్యత ఈ పాలకులకు లేదు. ఏ పాలకులకు లేదు.

ఇంత నగ్నంగా, బహిరంగంగా రాజకీయాల్లో మోసం కొనసాగుతుంటే నిజాల్ని గుర్తించిన ప్రజలు దోపిడీ పాలక వర్గ పార్టీలకు చరమగీతం పాడకమానరు. ప్రజలు తమ శక్తిని గుర్తించి భవిష్యత్‌ను తమ చేతుల్లోకి తీసుకుంటారు. పీడిత ప్రజల మౌలిక సమస్యల వైపు దృష్టిపెట్టి చైతన్యవంతం చేసి నిర్మాణాయుతంగా పోరాడడం ద్వారా ఈ బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ ప్రభుత్వాలను కూల్చి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయగలం.

ప్రజల్ని చీల్చే పాలకులు ప్రజలు చైతన్యవంతమయితే తోకముడుస్తారు. ప్రజలు నిజాలు తెల్సుకుని ఐక్య ప్రజా ఉద్యమాల్లో తమ శక్తిని గుర్తిస్తారు. ప్రజలు పోరాడి విజయాలు సాధిస్తారు. ఈ దోపిడీ దుర్గాలను కూల్చి ప్రజారాజ్యాన్ని నిర్మిస్తారు. ఆనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రజల ప్రయోజనాలతో విరాజిల్లుతుంది. ★

## సాంస్కృతిక విప్లవం 50వ వార్షికోత్సవాలను గొప్ప విప్లవోత్సాహంతో జరుపుకుందాం.

**కార్మికవర్గ పార్టీ తనలోని దాగిన బూర్జువా భావజాలాన్ని, ఏజెంట్లను బహిరంగంగానూ, సమగ్రంగానూ, కింది నుండి ఎండగట్టే విధంగా విశాల ప్రజాబాహుళ్యాన్ని జాగృతం చేయటం కోసం ఒక రూపాన్ని, పద్ధతిని కనుగొన్నది. అదే మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం. వందల, లక్షల ప్రజాబాహుళ్యం తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలిబుచ్చేట్లుగా, పెద్ద పెద్ద పోస్టర్లను రాసేట్టుగా, గొప్ప చర్చలు నిర్వహించేట్టుగా వారిని జాగృతులను చేయాలి. అలా చేయటం ద్వారా మాత్రమే పార్టీలోకి చొరబడిన ప్రతీఘాతుకులను, శత్రు ఏజెంట్లను, అధికారంలోని పెట్టుబడిదారీ మార్గీయులను బట్టబయలు చేయగలుగుతాం. పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరించాలని ప్రయత్నించే వారి కుట్రల్ని ధ్వంసం చేయగలుగుతాం.**

**సాంస్కృతిక విప్లవం పెట్టుబడిదారీ పునరుద్ధరణకి వ్యతిరేకంగా జరిగిన పోరాటం నుండి అభివృద్ధి చెందిన సైద్ధాంతిక ఆయుధం.**

**గొప్ప శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం 16మే, 1966లో ప్రారంభమయ్యింది**

# హరితహారం పేరుతో ఆదివాసుల భూముల దురాక్రమణ

అర్ధరాత్రి వేళ గ్రామాలపై దాడులు చేస్తూ ప్రజల్ని బెదిరించి బయటికి రాకుండా ఇళ్ళలోనే దిగ్బంధనం చేస్తున్నారు. రాత్రికి రాత్రి పంట పోలాలని దున్ని పంట నాశనం చేసి, భూములు ఆక్రమిస్తున్నారు. ఎవరు వాళ్ళు దొంగలా? బందిపోట్లా? దొంగలు, బందిపోట్లు దోచుకుంటే ఇంట్లో వున్న వస్తువులు, డబ్బు, బంగారం దోచుకుంటారు. కానీ వీళ్ళు రైతుల జీవితాలని, వారి పిల్లల భవిష్యత్తును దోచుకుంటున్నారు. ఎవరు వీళ్ళు. ఘనత వహించిన ఏలినవారు. కంచే చేను మేసినట్లుగా ప్రజలని రక్షించాల్సిన పాలకులే భక్షిస్తున్నారు. ఎన్నికల కంటే ముందు ఆదివాసులకు, దళితులకు 3 ఎ॥ చొప్పున భూములు పంచుతాం అని ప్రచారం చేసి ప్రజల్ని నమ్మించిన టి.ఆర్.ఎస్. ప్రభుత్వం అధికారం చేతుల్లోకి వచ్చాక ప్రజల భూముల్ని బలవంతంగా లాక్కుంటున్నది. దొంగలు, బందిపోట్లు దోచుకుంటే వారిని శిక్షించడానికి కోర్టులు, జైళ్ళు వుంటాయి. కానీ, ఈ ఘరానా దొంగల్ని, రాజ్యాంగాన్ని తమ చేతిలో పెట్టుకుని ఆడించే వారిని ఎవరు శిక్షించాలి?



నిరుపేదల పంట భూములను లాక్కుంటున్న కేసీఆర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చేవే. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన టి.ఆర్.ఎస్. ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ప్రాజెక్టుల కోసం, కంపెనీల కోసం రకరకాల పేర్లతో విస్తృతంగా భూములు సేకరణ చేస్తున్నది. హరితహారం పేరుతో అడవులు పెంచుతాం అంటూ విశాల అటవీ ప్రాంతాలు కలిగిన జిల్లాల్లో పోడు భూముల్ని ఆక్రమిస్తున్నది. ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ వరంగల్ జిల్లాల్లో భద్రాచలం, కొత్తగూడెం, ములుగు, మంథని, ఉట్నూరు, అసిఫాబాద్, డివిజన్‌లలో పోడు భూములు ఆక్రమణ ప్రధానంగా చేస్తున్నది. వీటిలో ఖమ్మం- వరంగల్ ఏజెన్సీలో ప్రయత్నాలు వేగవంతం అయ్యాయి. ఈ రెండు జిల్లాల్లో దాదాపుగా రెండు లక్షల ఎకరాలకి పైగా ప్రజలు సాగు చేస్తున్న పోడు భూముల్ని స్వాధీనం చేసుకొని, అక్కడ జామాయిల్, టేకు, ఉసిరి వంటి మొక్కలు నాటి అడవిని పెంచుతారట.

హరితహారం పేరుతో సంవత్సరానికి నియోజకవర్గానికి 40 లక్షల మొక్కల చొప్పున మూడు సంవత్సరాలలో 230 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకి జీవనాధారం అయిన పంటలు పండే పట్టా భూములు, పోడు భూముల్లో జామాయిలు, టేకు వంటి సామ్రాజ్యవాదులకి లాభాలు పండే మొక్కల్ని నాటే ఈ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం వున్నదో అందరికీ తెలిసిందే.

**అడవుల్ని నాశనం చేస్తున్నది ఎవరు?**

అడవులు తగ్గడానికి కారణం ఆదివాసుల పోడు వ్యవసాయం అంటూ దశాబ్దాలుగా పాలక వర్గాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. నిజానికి అడవి మీద ఆధారపడి బతికే ఆదివాసులు వేల సంవత్సరాలుగా అడవిలో పోడు చేసుకొని బతికారు. అప్పుడు అడవి నాశనం కాలేదు. అడవిలోని వృక్ష సంపద, జంతువులు, పక్షులు, ఖనిజ సంపద, వాగులు- వంకలు ఏవీ కూడా నాశనం కాలేదు. వాటిని అన్నింటిని సంరక్షిస్తూ, రాజుల, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల, ఆ తరువాత భారత దోపిడీ పాలక వర్గాల దాడుల నించి అడవిని రక్షిస్తూ ప్రాణాలర్పించిన చరిత్ర ఆదివాసులకి వుంది. నేటికీ అదే చరిత్ర కొనసాగుతున్నది. బ్రిటిష్ వాళ్ళ పాలనలో మొదలైన అడవుల విధ్వంసం నేటికీ భూస్వాముల, దళారీ నిరంకుశ బూర్జువాల, సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసమే నాశనం అయిపోతున్నది. పెద్ద ఎత్తున అడవుల్ని నరికి తరలించింది. భూ తల్లి గర్భాన్ని చీల్చి ఖనిజ సంపదని ఎత్తుకుని వెళుతున్నది వీళ్ళే. కానీ, 'దొంగే దొంగా, దొంగా' అని అరిచినట్లు వీళ్ళు ఆదివాసుల పోడు భూముల వల్లనే అడవులు తగ్గాయంటూ, ఆదివాసుల భూముల్ని ఆక్రమించి సామ్రాజ్యవాదులకి అప్పగిస్తున్నారు. 1995-2005 వరకు పది సంవత్సరాలలో దేశంలో మైనింగ్ రంగంలో ఉన్న బహుళ జాతి కంపెనీల వల్ల 5 లక్షల ఎకరాల అడవి నాశనం అయ్యిందని ప్రభుత్వ అధికార సర్వేలు తెలుపుతున్నాయి. ఇంకా అనధికారికంగా ఆ లెక్క మరో పదింతలున్నా ఆశ్చర్యం లేదు. మరి పది సంవత్సరాలలో ఇంత అయితే, 7 దశాబ్దాలుగా భారత పాలకుల చేతిలో, అంతకంటే ముందు బ్రిటిష్ వారి చేతిలో ఎంత అడవి నాశనం అయ్యింది. లెక్కలు తేల్చేది ఎవరు? ఈ దోపిడీ దొంగలకు శిక్షలు వేసేది ఎవరు?

**భూముల నుంచి తరమబడుతున్న ఆదివాసులు**

1867 నుండి 2006 వరకూ ఎన్ని చట్టాలు వచ్చినా వాటితో ఆదివాసులకి ఒరిగింది ఏమీ లేదు. 'చట్టాలు కలిగినోడి చుట్టాలు' అన్న చందంగా ఆదివాసుల నుండి ఆదివాసేతర భూస్వాములు తరతరాలుగా భూములు లాక్కుంటున్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదివాసులకు అనుకులమైన చట్టాలు ఏవీకూడా అమలు కావటం లేదు. సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనా అమలుకు, వనరులు కొల్ల గొట్టడానికి షెడ్యూల్డు ఏరియాలు కేంద్రాలుగా మారటం వలన రాజ్యాంగంలో చెప్పిన 5వ షెడ్యూల్, పెసా చట్టం వంటివి కూడా హస్యాస్పదం అయ్యాయి. 50నుండి 70శాతం భూమి ఆదివాసేతరుల ఆధీనంలో వుంది. 1990 నాటికి ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే వందల, వేల ఎకరాల ఆదివాసీల భూములను ఆక్రమించిన

భూస్వాములు 60మందికి పైగా వుంటారని ఒక అంచనా. స్థూలంగా లక్షల ఎకరాల భూమి గిరిజనేతర భూస్వాముల చేతుల్లో చట్ట విరుద్ధంగా వుంది.

2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసులకు భూ యాజమాన్యం కల్పించాల్సి వుండగా వారిపై కేసులు పెట్టి భూములు గుంజుకుంటున్నారు. పోడు భూముల్నే కాదు. పట్టా భూముల్ని కూడా గుంజుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో చంద్రుగొండ మండలంలో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో భూములు ఆక్రమించారు. మట్వాడ గ్రామ ప్రజలు గతం నుండి సాగు చేస్తున్న భూములకి 2006లో పట్టాలు ఇచ్చారు. వాస్తవం ఇలా వుంటే అధికారులు 2006 తరువాత సాగు చేశారంటూ ఆ పట్టా కాగితాలని చింపేశారు. ఈ రకంగా చేసి ఆ గ్రామ పంచాయితీ పరిధిలో 1800 ఎకరాలు భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ పంచాయితీలోని హనుమాన్‌తండాలో ముందు పట్టాలు ఇచ్చారు. తర్వాత మళ్ళీ ఇస్తాం అని చెప్పి తీసుకుని తిరిగి ఇవ్వలేదు. కొన్ని చోట్ల ఎన్నికల ముందు పట్టాలు ఇస్తామని చెప్పి తర్వాత మొండి చెయ్యి చూపించారు. మరి కొన్ని చోట్ల ప్రజలు పట్టా కాగితాలు తీసుకుని వెళితే అవి తప్పుడు లెక్కలు అని దబాయించి, వాటిని రద్దు చేశారు. 2005 కన్నా ముందే ఎప్పుడో పట్టాలిచ్చిన భూముల్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నేడు ప్రభుత్వం తీసుకున్న భూమిలో 2006 తర్వాత సాగులోకి తెచ్చిన భూమి 5 శాతం కూడా వుండదు. ఇలా అనేక తప్పుడు పద్ధతులు ఉపయోగించి కుట్రపూరితంగా ప్రభుత్వం ప్రజల భూముల్ని లాక్కుని సామ్రాజ్యవాదులకి ధారాదత్తం చేస్తున్నది. రైతే దేశానికి వెన్నెముక అంటూ వెన్నెముక విరవటమే కాదు. కాలి కింద భూమి లేకుండా చేస్తున్నది. బతుకు లేకుండా చేస్తున్నది. కోనేరు రంగారావు కమిటీ “48 శాతం భూమి నేడు గిరిజనేతరుల చేతుల్లో వుంది. ప్రతి సం॥ వందలాది ఎకరాల భూమి గిరిజనేతరుల చేతుల్లోకి పోతున్నది. గట్టి పాలనా చర్యలు తీసుకోక పోతే, కొంత కాలానికి గిరిజనుల చేతుల్లో భూమి లేకుండా పోయే ప్రమాదం వుంది” అని చెప్పింది. నేడు ఆ ప్రమాదం మరింత వేగంగా ముందుకు వస్తున్నది.

### ప్రభుత్వ దమన కాండని ఎదిరిస్తున్న ఆదివాసులు

గతంలో ఫారెస్టు అధికారులకి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసులు ఇప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ప్రజల ప్రతిఘటన వలన భూములు స్వాధీనం కాక పోవడంతో ప్రభుత్వం పోలీసుల్ని దించి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకుంటున్నది. భూములు స్వాధీనం చేసుకునే గ్రామంలో ముందుగా 144 సెక్షన్ విధిస్తున్నారు. పోరాటాన్ని నడిపే నాయకుల్ని ముందే అరెస్టులు చేస్తున్నారు. ప్రజలు ఇళ్ళ నుండి బయటికి రాకుండా కట్టుదిట్టం చేస్తున్నారు. తీసుకోవల్సిన భూముల చుట్టూ తాడుతో పోలీసులు వలయాన్ని ఏర్పాటు చేసి, ఫారెస్టు అధికారులకి కబురు ఇస్తే వాళ్ళు ట్రాక్టర్లు, ప్రోక్లెయిన్‌లతో పంట చేన్లు దున్నేసి, చుట్టూ ఎవరు రాకుండా లోతైన గుంతలు తవ్వుతున్నారు. గ్రామాలపై అర్ధ రాత్రి వేళ దాడులు చేస్తున్నారు. పచ్చని పంట పొలాలను అర్ధరాత్రుల్లో దున్నేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని ఏజన్సీలో టేకులపల్లి, కారెపల్లి, ఇల్లందు మొదలైన మండలాలలో పోలీసుల కాపలాతో బోడు, కొప్పురాయి మొదలైన గ్రామాలలో మొక్కజొన్న చేతికొచ్చే దశలో ట్రాక్టర్లతో దున్నించారు. నోటి కాడి కూడు లాక్కోవడం అంటే ఇదే.

ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తే పోలీసుల్ని పెద్ద ఎత్తున దించుతున్నారు. అయినాగాని భూమి లేకపోతే బతుకు లేదని ప్రజలు పోలీసులపై తిరగబడుతున్నారు. చేతికి ఏది అందితే దాంతో తిరగబడుతున్నారు. పోలీసులు చేసే లాఠీఛార్జీలో కాళ్ళు, చేతులు విరిగినా, తలలు పగిలినా ప్రతిఘటిస్తున్నారు. కొన్ని చోట్ల ప్రజలు ప్రతిఘటించడంతో పోలీసులు, ఫారెస్టు అధికారులు 2, 3 సార్లు వెనుదిరగాల్సి వచ్చింది. దాంతో ప్రజలు అప్రమత్తంగా లేని సమయాల్లో మీటింగ్‌లకి, పనులకి వెళ్ళిన సమయాల్లో భూముల్ని దొంగల్లాగా ఆక్రమించారు.

పోలీసుల పహారాలో రైతుల భూముల్ని అన్యాయంగా దాడులు చేసి ఆక్రమించటం చూస్తుంటే ఇంగ్లండులో కంచెలు వేసి రైతుల్ని బలవంతంగా తరిమి కొట్టిన పెట్టుబడిదారుల క్రూరత్వం గుర్తుకు వస్తుంది. ఇంగ్లండులో పెట్టుబడిదారులు రైతులని దున్నేవారికి భూమి అనే నినాదంతో ఆకర్షించారు. రైతులు నెత్తురు ధారబోసి భూస్వాముల్ని కూల్చితే అధికారం అందుకున్న పెట్టుబడిదార్లు రైతుల్ని మోసం చేసి, భూమికి దూరం చేశారు. టి.ఆర్.ఎస్. కూడా రైతుల్ని ఘోరంగా వంచించి భూములను లాక్కుంటున్నది.

### పోరు దారిలో మహిళలు

భూమి కోసం పోరాటం జరిగిన అన్ని చోట్ల మహిళలు ముందు వరుసలో వున్నారు. మీటింగులలో, ర్యాలీలలో, సమస్యలపై చర్చించటంలో అంతటా మహిళలే ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు. పోలీసుల్ని ఎదిరించి పోరాడటంలో, ప్రతిఘటించడంలో ముందుంటున్నారు. పోలీసుల కళ్ళలో కారం చల్లుతున్నారు. బాలాజి తండా మహిళలు ఇసుక చల్లి ప్రతిఘటించారు. కాబట్టి, పోలీసులు మహిళల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. మహిళల్ని కొట్టడం, అసభ్యంగా ప్రవర్తించి, అవమానించడం చేస్తున్నారు. అయినా, మహిళలు వాటిని లెక్క చేయటం లేదు. భూముల్ని రక్షించుకోవడం కోసం, కోల్పోయిన భూముల్ని తిరిగి సాధించడం కోసం పోరాడుతున్నారు. నిర్బంధంలో భాగంగా మహిళలపై కేసులు పెట్టి వేధిస్తున్నారు. మిట్టపల్లిలో 30 మందిపై కేసులు పెడితే అందులో 24 మంది మహిళలే. బాలాజి తండాలో 22 మందిలో 15 మంది, ఒడ్డుగూడెంలో 24 మందికిగాను 23 మంది మహిళలపైనే కేసులు పెట్టారు. ఆరుగురు మహిళలు 14 రోజులు జైలులో ఉండి బెయిలుపై బయటికి వస్తున్న క్రమంలో మళ్ళీ వారిపై ఫారెస్టు అధికారులు కేసులు పెట్టారు.

**పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప**

దేశంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు అందరూ వాళ్ళు ఏ పార్టీ వాళు ్ళ అయినా గాని బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారు. రైతుల్ని భూములకి దూరం చేసి కూలీలుగా మారుస్తున్నారు. కూలీ కోసం పొట్టచేత పట్టుకుని తిరిగే దయనీయ స్థితికి రైతుల్ని నెడుతున్నారు. సామ్రాజ్యవాదుల కంపెనీలలోకి కట్టు బానిసల్లాగా తరలిస్తున్నారు. 'బంగారు తెలంగాణ' అంటు ప్రజల్ని మభ్యపెడుతూ, ప్రజల బంగారు భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం జీవో 41,123 ల ద్వారా ఓపెన్‌కాస్ట్, సాగు నీటి ప్రాజెక్టులు, హరితహారం, రోడ్ల నిర్మాణం, ఫార్మా కంపెనీలు, సెజ్‌లు మొదలైన వాటి కింద భూములు కోల్పోవడంతో రైతాంగం పెద్ద ఎత్తున నిర్వాసితులౌతున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఈ రెండేళ్ళలో ప్రభుత్వం వివిధ అవసరాల పేరుతో సేకరించిన భూమి 4,99, 538 ఎకరాలు అని ప్రభుత్వ అధికార గణాంకాలు చెప్తుతున్నాయి. ఇవి కాక అనధికారికంగా మరో 5 లక్షల ఎకరాల భూమి సేకరించటానికి ప్రభుత్వం సిద్ధంగా వున్నట్లు అర్థం అవుతున్నది. వివిధ భూసేకరణ చట్టాల ద్వారా నిర్వాసితులౌతున్న వారిలో ప్రధానంగా ఆదివాసీలు, దళితులు, ఇతర వెనుకబడిన కులాల వారే అధికంగా వున్నారు.

పోరులేనిదే భూమిలేదు, భూమి లేనిదే బతుకు లేదు. అందుకనే, భూమి కోసం సాగే పోరాటాన్ని కొనసాగించాల్సిందే. ప్రభుత్వాలు ఎంత నిర్బంధం తెచ్చినా, ఎన్ని అడ్డంకులు కలిగించినా వాటిని ఎదుర్కొంటూ పోరాడాల్సిందే. రైతాంగం సమైక్యమై, సంఘటితంగా పోరాడితేనే కానీ విజయం సాధించలేం. పశ్చిమ్ బెంగాల్‌లో సింగూర్ రైతాంగం పోరాడి భూములు సాధించుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో లోహండి గూడ రైతాంగం టాటా కంపెనీని తరిమి కొట్టారు. దున్నే వారికి భూమి అని పోరాడటమే గాక, ఉన్న భూముల్ని రక్షించుకోవటం కోసం కూడా పోరాడాల్సి వస్తున్నది. నేడు ప్రజల ముందు తెగించి పోరాడటం తప్ప మరొక దారి లేదు. దేశాన్ని సామ్రాజ్యవాదులకి ధారాదత్తం చేస్తున్న పాలకులకి వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యమై పోరాడక పోతే మరొక రూపంలో దేశ ప్రజలు సామ్రాజ్యవాదులకి బానిసలు అవుతారు.

తరతరాలుగా రైతాంగం భూమి కోసం పోరాడుతునే వుంది. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడుదాం. ప్రజలు అజేయులు. భారతదేశం అర్ధవలస-అర్ధ భూస్వామ్య దేశం. ఢిల్లీ, హైదరాబాద్‌ల లోని పాలకులు దోపిడీ వర్గాలకు చెందిన వారే. సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం దళారీలుగా పరిపాలిస్తున్నవారే. ఈ దేశంలో భూస్వామ్యం పోకుండా, సామ్రాజ్యవాదాన్ని నాశనం చేయకుండా దోపిడీ అంతం కాదు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం పోరాడడం, ఈ దోపిడీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించడంలో భాగంగా జరగాల్సిందే. తెలంగాణలో ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడడం కూడా అందులో భాగమే.

★

**(41 పేజీ తరువాయి)**

అక్రమాలు అరికట్టబడాలని, హత్యాకాండలు, అవినీతి ఆగిపోవాలని టిఆర్ఎస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుకు ఏ మాత్రం చిత్తశుద్ధి, నిజాయితి ఉంటే నేర సామ్రాజ్యాన్ని నడిపిస్తున్న పోలీసు ఇంటిలిజెన్స్, ఎస్ఐబి డిపార్ట్‌మెంట్‌ల ద్వారా కాకుండా హైకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ముక్తకంఠంతో డిమాండ్ చేయాలని మా పార్టీ పిలుపునిస్తుంది.

నయీం హంతక ముఠా ద్వారా రాజకీయ హత్యలు చేయించిన పోలీసు అధికారులనే కాకుండా, ఆయా హత్యల్లో నయీం ముఠా సభ్యులతో సివిల్ దుస్తులతో ప్రత్యక్షంగా పాల్గొంటూ హత్యలు చేసిన పోలీసులపై కూడా కేసులు నమోదు చేసి శిక్షించాలి.

కరీంనగర్ జిల్లాలో మోహన్‌రెడ్డిని ముందు పెట్టి పెద్ద ఎత్తున ప్రజల ఆస్తులు, భూములను కాజేసిన, ప్రజలను బెదిరింపులకు, వారు ఆత్మహత్యలకు పాల్పడేలా భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసు అధికారులను, అలాగే తెలంగాణలోని ఆయా జిల్లాలో ల్యాండ్ మాఫియా నడిపిస్తున్న పోలీసు అధికారులపై చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలి.

నయీం ముఠా సాగించిన హత్యలు, అక్రమ దందాలలో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉండి ప్రస్తుతం టీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న నాయకులు, కార్యకర్తలను కాపాడుకోవడం కాకుండా నిష్పక్షపాతంగా అరెస్టు చేసి నేరస్తులను శిక్షించాలి. నయీం ముఠా కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఇతర రాష్ట్ర పోలీసు అధికారులు, రాజకీయ నాయకులు, మాజీ మాఫీయాల పేర్లన్నీ బయటపెట్టి వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి.

**నయీం ఏనాటికైనా ప్రజల చేతుల్లో ఖతం అయ్యేవాడే**

నయీం మా ఉద్యమంలో పనిచేసి దిగజారిపోయి, కోవర్టుగా మారి పార్టీకి తీవ్ర నష్టం చేసి, భువనగిరి నుంచి మొదలు పక్క రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో కూడా పార్టీకి నష్టం కలిగించడానికి ఎస్ఐబి డైరెక్షన్‌లో లొంగిపోయిన మాజీలలో చాలా మందిని చేరదీసి, రాయపూర్, జగదల్‌పూర్, సుక్మా, నవరంగ్‌పూర్‌లలో బేసులు ఏర్పాటు చేశాడు. వారిని వాడుకుంటూ, వారి కుటుంబాలతో సహా ఈ బేసులలో మాములు కుటుంబాలుగా దించాడు. వారు మా పార్టీ కార్యకర్తల కార్యకలాపాలు సేకరించే క్రమంలో ఉన్నారు.

వీరంతా వెంటనే ఈ కార్యకలాపాలకు స్వస్తి చెప్పి సామాన్య జీవితం గడపాలి. లేకుంటే ప్రజల చేతిలో ఇలాంటి వారు ఖతం కాక తప్పదని హెచ్చరిస్తున్నాం. ఈ దోపిడీ వర్గాలు అవసరం ఉన్నంత వరకు నయీంలను వాడుకొని, అవసరం తీరాక వారే అంతమొందిస్తారని నయీం సంఘటనతో మరోసారి రుజువైంది. కాబట్టి మరెవ్వరూ ఈ దోపిడీ వర్గాలకు ఉపయోగపడద్దని హెచ్చరిస్తున్నాం. -జగన్

## అమరవీరుల జీవిత చరిత్రలు

### కాటేపల్లి అమరవీరులకు విప్లవ జోహార్లు

### కా. ఆత్రం శోభన్ (చార్లెస్) డీ.సీ.ఎం.



కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సమన్వయంతో బ్రాహ్మణీయ హిందు మతోన్మాద ఫాసిస్టు బి.జె.పి. ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ పాశవిక దాడిలో భాగంగా జూన్19, 2016న తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో అహిరి తాలుక కాటెపల్లి అడవుల్లో కోవర్టు ద్వారా గ్రేహౌండ్స్, సి-60 కమాండో బలగాలు కా॥ చార్లెస్ (డి.సి.ఎం.), కా॥ ముఖేష్ (ఎ.సి.ఎం.), కా॥ దినేష్ (పి.ఎం.) లను పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి హత్యచేసినారు. కామ్రేడ్ ఆత్రం శోభన్‌ది బ్రిటీష్ సైన్యాలతో సాహసోపేతంగా పోరాడిన రాంజీ గోండ్ పుట్టిన జిల్లా. నైజాం సర్కార్‌తో వీరోచితంగా పోరాడిన కొమురం భీం జన్మించిన పోరుగడ్డ, ఇంద్రవెల్లి పోరాటాల వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న కా॥ చార్లెస్ ఆదిలాబాద్ జిల్లా తిర్యాణి మండలం రొంపెల్లి గ్రామంలో నీరుపేద ఆదివాసీ (గోండు) ఆత్రం గంగు, సోంబాయ్‌ల కుమారుడు. చిన్న తనములో తల్లి తండ్రులు ఇద్దరు అనారోగ్యంతో మరణించారు. కా॥ చార్లెస్ మేనమామ భీం దగ్గర పెరిగినాడు. చిన్నప్పటి నుండి రాంజీ గోండ్, కొమురం భీం, ఇంద్రవెల్లి పోరాటాలను కథలు, కథలుగా విన్న కా॥ శోభన్ ఆదివాసులకు (గోండ్) న్యాయం జరగాలంటే కల్లె సర్కార్‌తో (దొంగ ప్రభుత్వం) పోరాడాలని నిర్ణయించుకుని, గ్రామంలోకి వస్తున్న దళాలకు సహకారం అందిస్తూ పార్టీ అప్పగించిన పనులను బాధ్యతగా చేస్తూ 2004లో పూర్తికాలం కార్యకర్తగా దళంలో చేరినాడు. కొద్ది కాలం దళంలో పని చేసిన తర్వాత అమరుడు కామ్రేడ్ మహేశ్ (ఎస్.జెడ్.సి.ఎం.)కి గార్డుగా నియమింపబడ్డాడు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటూ నాయకత్వ రక్షణ బాధ్యతలు నిర్వహిస్తూ దళం కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవాడు. దళ సభ్యులందరితో కలిసి మెలిసి ఉండేవాడు. కా॥ చార్లెస్ ఏ గ్రామనికి వెళ్ళినా ఆ గ్రామ ప్రజలతో వెంటనే కలిసిపోయేవాడు. తనకు తెలిసిన విప్లవ రాజకీయాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పేవాడు.

2011 లో జరిగిన ప్లీనం నిర్ణయం మేరకు ఆదిలాబాద్ జిల్లా ఉద్యమాన్ని పునర్నిర్మాణం చేయడానికి దళాలను నిర్మాణం చేసి జిల్లాకు పంపించడంలో భాగంగా కా॥ చార్లెస్ గార్డ్ నుండి రిలీవ్ అయి మంగి దళ కమాండర్‌గా బాధ్యతలను చేపట్టి ఏరియాలో పలు కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాడు. జిల్లా ఉద్యమాన్ని బలోపేతం చేయడం కొరకు నిరంతరం కృషి చేసినాడు. పార్టీ అప్పగించిన పనులను బాధ్యతగా, సమర్థవంతంగా నిర్వహించినాడు.

పార్టీ నిర్వహించిన పలు మిలటరి క్యాంపులలో, రాజకీయ క్లాస్‌లలో పాల్గొని పట్టుదలగా నేర్చుకొని, తను నేర్చుకొన్న వాటిని తోటి దళ సభ్యులకు నేర్పించేవాడు. వరంగల్ జిల్లా ఏటూరు నాగారంలో రేయాన్స్ కంపెనీ డిప్యూటి మేనేజర్ కార్మికులను వేధింపులకు గురి చేస్తూ, ఉద్యోగాల నుండి తొలగిస్తూ, పోలీసులతో కుమ్మక్కై కార్మికులపై తప్పుడు కేసులు బనాయించడం సరైంది కాదని పార్టీ హెచ్చరించినప్పటికీ తన పద్ధతులను మార్చుకోకపోగా దళంపై దాడి చేయించడానికి ప్రయత్నం చేయడంతో 2011లో రేయాన్స్ డిప్యూటి మెనేజర్‌ను ఖతం చేయాలనే పార్టీ నిర్ణయాన్ని అమలు చేయడంలో కా. శోభన్ ప్రముఖ పాత్ర వహించాడు.

ఖమ్మం జిల్లాలోని దొంగల జగ్గారంలో ఇన్‌ఫార్మర్ బాలజీని, కె.కె.డబ్ల్యు.లో ఇన్‌ఫార్మర్‌ను ఖతం చేయడంలో, గడచిరోలి జిల్లాలో అహిరి, సిరోంచ దళాలతో కలిసి పలు చర్యలలో, ఛత్తీస్‌గఢ్‌లోని భద్రకాళి కొత్త పోలీస్‌స్టేషన్‌పై జరిపిన కాల్పుల్లో, చర్ల పోలీసులపై జరిపిన అంబుష్‌లలో చురుకుగా పాల్గొన్నాడు.

ఆదిలాబాద్ జిల్లా మంగి ఏరియాలోని కెరిగూడెం ఇన్‌ఫార్మర్ బల్హార్ సాహు (35సం॥) ఖతం చేసినాడు. బెజ్జూర్ మండలం గూడెం దగ్గర ప్రాణహిత నదీపై వంతెన నిర్మాణం చేస్తున్న వాహనాలను దగ్ధం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. నిర్వాసిత సమస్యకు, గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన పార్టీ బంద్ పిలుపులను విజయవంతం చేయడంలో భాగంగా దహనం చేసిన చర్యలలో ప్రధాన పాత్ర పోషించాడు.

2012 సెప్టెంబర్‌లో మహారాష్ట్రలోని లంకచేను వద్ద ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో సి-60 కమాండో బలగాలు జరిపిన కాల్పుల నుండి సురక్షితంగా రిట్రీట్ అయినాడు. 2014 ఆగస్టులో అదిలాబాద్ జిల్లా కుర్రెగడ్ దగ్గర దళంపై గ్రేహౌండ్స్ బలగాలు జరిపిన కాల్పుల నుండి, సెప్టెంబర్‌లో భీమునిలొద్దిలో జరిగిన కాల్పుల నుండి, 2015 ఆగస్టులో లక్కమేడ గుట్టలవద్ద ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో సి.60 కమాండో బలగాలు జరిపిన కాల్పుల నుండి తోటి సహచరులను రక్షిస్తూ, రిట్రీట్ అయినాడు.

కా. చార్లెస్ 2004 నుండి పార్టీలో పట్టుదలగా పనిచేస్తు ఎ.సి.ఎం.గా, ఎ.సి. కార్యదర్శిగా డి.సి.ఎం.గా ఎదిగాడు. 2011లో తోటి దళ సభ్యురాలు కా॥ జ్యోతిని వివాహం చేసుకున్నాడు. 2015లో జరిగిన జిల్లా ప్లీనంలో డి.సి.ఎం.గా ఎన్నుకోబడ్డాడు. గత 12 సం॥లుగా అదిలాబాద్ జిల్లా ఉద్యమ నిర్మాణం కొరకు తన శక్తిమేరకు కృషి చేశాడు. కొద్ది మంది దిగజారిపోయి శత్రు ముందు మోకరిల్లినప్పటికీ పార్టీపై అచంచల విశ్వాసంతో నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోవడానికి చివరి వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడి మహారాష్ట్రలోని అహిరి దగ్గర కాటెపల్లి అడవుల్లో తెలంగాణ గ్రేహౌండ్స్, సి-60. కమాండో బలగాలు కోవర్టు ద్వారా హత్యచేసిన ఘటనలో అమరుడు అయినాడు.

### కా॥ కుడియం సోమ్రూ (ముఖేష్ ఎ.సి.ఎం.)

తెలంగాణ గ్రేహౌండ్స్, సి-60. కమాండో బలగాలు కోవర్టు ద్వారా హత్యచేసిన ఘటనలో అమరుడు అయినాడు. కా॥ కుడియం సోమ్రూ



(ముఖేష్) దండకారణ్యంలోని పశ్చిమబస్తర్ డివిజన్ నేషనల్ పార్క్ ఏరియాలోని ముఖరం గ్రామంలో జన్మించాడు. తండ్రి కుడియం బండి, తల్లి ఇరిపేలు. నిరుపేద ఆదివాసీ (కోయ) కుటుంబం. చిన్న తనంలో తండ్రి అనారోగ్యంతో మరణించాడు. తల్లి కూలి పని చేస్తు కా॥ ముఖేష్‌ను పెంచి పెద్ద చేసింది. ముఖరం గ్రామం మొదటి నుండి విప్లవోద్యమానికి బలమైన గ్రామంగా ఉంది. ముఖరం గ్రామ సంఘ నాయకుడిగా కా॥ ముఖేష్ చిన్నాయన ఉండగా, కా॥ ముఖేష్ చిన్నప్పటి నుండి విప్లవ భావాలతో పెరిగాడు. ముఖరం గ్రామానికి ఇరువైవుల పర్సగడ్ పోలీస్ క్యాంప్ రాణిబోధిలి పోలీస్ క్యాంపులు ఉన్నాయి. రెండు క్యాంపుల పోలీసులు నిరంతరం కూంబింగ్‌ల పేరుతో గ్రామం పై దాడులు చేస్తూ కనబడ్డ వారినందరిని చిత్రహింసలు పెడుతూ, ఆస్తులను ధ్వంసం చేస్తూ దాడులు చేసేవారు. పోలీసులు గ్రామంపై దాడులకు వచ్చినపుడల్లా ప్రజలు అడవులకు వెళ్ళి ప్రాణాలు కాపాడుకునేవారు.

పోలీసులు దాడులకు వచ్చినపుడు గ్రామ మిలీషియా, దళం కలిసి పోలీసుల దాడులను తిప్పికొట్టెవారు. కా॥ ముఖేష్ చిన్నప్పటి నుండి పోలీసులు గ్రామంపై చేసున్న దాడులను చూస్తు పోరాడితే తప్ప బతుకు లేదని ఆలోచించి పూర్తికాలం కార్యకర్తగా 2009 దళంలో చేరాడు. రాష్ట్రకమిటీ నిర్ణయం మేరకు కా॥ ముఖేష్‌ను తెలంగాణకు బదిలీ చేయడంతో ఎలాంటి శషబిషలు లేకుండా పార్టీ నిర్ణయానికి కట్టుబడి తెలంగాణకు వచ్చాడు. కా॥ ముఖేష్ తెలంగాణలో ఖమ్మం జిల్లాలో రాష్ట్ర కమిటీ సభ్యుడికి గార్డుగా నియమింపబడ్డాడు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటు తనకు అప్పగించిన గార్డ్ బాధ్యతలను 2011 వరకు బాధ్యతగా నిర్వహించాడు. గార్డ్ బాధ్యతలు నిర్వహిస్తూనే దళం కార్యక్రమాలలో పాల్గొంటూ సమిష్టి పనులను చేస్తూ అందరితో స్నేహభావంతో కలిసి మెలిసి ఉండేవాడు. కా॥ ముఖేష్‌కు చదువుపై అసక్తి ఉండేది. దానితో తను తెలుగు రాయడం, చదవడం, మాట్లాడడం తొందరలోనే నేర్చుకున్నాడు.

2011లో కా॥ ముఖేష్‌ను గార్డ్ నుండి రిలీవ్ అయ్యి అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి దళంలో ఎ.సి.ఎం.గా బదిలీ అయినాడు. ఏరియా కొత్త అయినప్పటికీ కా॥ ముఖేష్ పట్టుదలతో ఇంద్రవెల్లి ఏరియా ప్రజలతో కల్సిపోయి పలు కార్యక్రమాలు నిర్వహించాడు. తనకు తెలిసిన విప్లవ రాజకీయాలు ప్రజలకు చెపుతూ ప్రజల నుండి నేర్చుకోవడానికి నిరంతరం కృషి చేసేవాడు.

కా॥ ముఖేష్ ముక్కు సూటిగా వ్యవహరిస్తాడు. ఎదుటి వారి తప్పులను సూటిగా విమర్శిస్తాడు. తన తప్పులను ఎవరైనా గుర్తు చెస్తే వెంటనే మార్చుకుంటాడు. పార్టీ పద్ధతులను తను పాటిస్తూ అందరు పాటించాలని గుర్తు చేసేవాడు. 2015లో తోటి దళ సభ్యురాలు కా॥ మీనను పెళ్ళి చేసుకున్నాడు.

ఛత్తీస్‌గఢ్‌లోని దుర్మ దగ్గర పోలీసులతో, 2012లో లంకచేను వద్ద సి.-60. కమాండో బలగాలు, 2015 ఆగస్టులో లక్కమేడ వద్ద సి.-60. కమాండో బలగాలు జరిపిన దాడులలో శత్రువుపై ఫైరింగ్స్ చేస్తూ రిట్రీట్ అయినాడు.

మహారాష్ట్రలోని అహిరి-సిరొంచ దళాలతో కలిసి పలు చర్యల్లో పాల్గొన్నాడు. అదిలాబాద్ జిల్లా మంగి ఏరియాలో కేరిగూడం లోని ఇన్‌ఫార్మార్ బల్లార్ సాహును ఖతం చేసిన ఘటనలో, బెజ్జూర్ మండలం గూడెం దగ్గర వాహనాలను ధ్వంసం చేసిన ఘటనలో పాల్గొన్నాడు.

కా॥ముఖేష్ అదిలాబాద్ జిల్లా ఉద్యమ నిర్మాణంలో 2011 నుండి భాగమైనాడు. జూన్ 19-2016న తెలంగాణ గ్రేహౌండ్స్, సి-60 కమాండో బలగాలు కలసి కోవర్టు ద్వారా కాటేపల్లి అడవిలో మాటుగాసి పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి హత్యచేసిన ఘటనలో అమరుడు అయినాడు. కా॥ ముఖేష్ పట్టుదల, క్రమశిక్షణ, బోల్షివిక్ స్పిరిట్ మనకందరికి ఆదర్శం.

### కా॥ కుంజం లక్ష్మణ్ (దినేష్) (పి.ఎం.)



కా॥ దినేష్ దంతెవాడ జిల్లా దర్భ డివిజన్, మలేంగేర్ ఏరియా ఈరేల్ గ్రామ ఆదివాసీ (కోయ) కుటుంబంలో జన్మించాడు. చిన్ననాటి నుండి విప్లవ భావాలతో పెరిగినాడు. 2006 నుండి దర్భ డివిజన్ విప్లవోద్యమానికి బలంగా ఉంటుంది. ఏరియాలోని ప్రజలు పార్టీ కార్యక్రమాల్లో భాగమవుతూ, సమిష్టి కార్యక్రమాల్లో పాల్గొంటారు. శత్రువు నిరంతరం కూంబింగ్ పేరుతో గ్రామాలపై దాడులు చేస్తూ ప్రజల ఆస్థులను ధ్వంసం చేస్తూ, మహిళలపై అత్యాచారాలు చేస్తూ, బూటకపు ఎన్‌కౌంటర్స్ చేస్తుంటే, ప్రజల్ని రక్షించుకోవడానికి శత్రువు దాడులని తిప్పికోట్టడానికి పార్టీ పిలుపు మేరకు ఏరియాలోని ప్రతి గ్రామంలో మిలీషియాను ఏర్పాటు చేసుకున్నారు. కా॥ దినేష్ తన గ్రామంలోని మిలీషియాలో చేరి కొంత కాలం పనిచేసి పూర్తికాలం కార్యకర్తగా దళంలో సభ్యుడిగా చేరాడు. పార్టీ నిర్ణయం మేరకు 2014లో తెలంగాణకు బదిలీ అయి, తెలంగాణ కమీటీ నిర్ణయం మేరకు అదిలాబాద్ జిల్లా మంగి దళ సభ్యుడుగా చేరినాడు. 2014 నుండి అమరుడయ్యేంత వరకు అదిలాబాద్ జిల్లా మంగి దళ సభ్యుడుగా చురుకుగా పనిచేసినాడు.

2014లో మంగి ఏరియాలో కుర్రెగడ్ దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో కాల్పులు జరుపుతూ రిట్రీట్ అయ్యాడు. భీమ్‌ముసి లోద్దిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో దళం నుండి విడిపోయి ప్రజల సహకారంతో దర్భకు చేరుకుని తిరిగి మళ్ళీ మంగి ఏరియాలో పని చేయడానికి సంసిద్ధతతో వచ్చినాడు. దళంలో సమిష్టి పనుల్లో ముందుండేవాడు. క్రమశిక్షణతో అందరితో కలిసి మెలిసి ఉండేవాడు. పార్టీ అప్పగించిన పనులను చేయడంలో చురుకుగా ఉండేవాడు.

మహారాష్ట్రలోని అహిరి-సిరోంచ దళాలతో కల్సి పలు మిలిటరీ చర్యల్లో పాల్గొన్నాడు. 2015లో లక్కమేడ గుట్టలలో సి.-60 కమాండో బలగాలతో జరిగిన కాల్పుల్లో క్షేమంగా రిట్రీట్ అయినాడు. అదిలాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం గూడేం దగ్గర వాహనాలు తగల బెట్టిన చర్యలో పాల్గొన్నాడు. అతి తక్కువ కాలంలో తెలుగు మాట్లాడడం, రాయడం, చదవడం నేర్చుకున్నాడు. ఏరియాలో ప్రజలతో కలసి చేసిన పలు కార్యక్రమాలలో ముందున్నాడు. తనకు తెలిసిన విప్లవ రాజకీయాలను సభ్యులకు, ప్రజలకు చెప్పేవాడు. దళంలో అన్ని పనులను బాధ్యతాయుతంగా చేసేవాడు.

జూన్ 9-2016 నాడు తెలంగాణ గ్రేహౌండ్స్, సి-60. కమాండో బలగాలు సంయుక్తంగా చేసిన కోవర్టు కుట్రతో పట్టుకొని కాటెపల్లి అడవిలో హత్యచేసిన ఘటనలో కా॥ చార్లెస్ (డి.సి.ఎం.) కా॥ ముఖేష్ (ఎ.సి.ఎం)లతో పాటు కా॥ దినేష్ అమరుడైనాడు. కాటేపల్లి అమరులకు అరుణాఅరుణ జోహర్లు అర్పిస్తూ, వారి ఆశయాలను తుదకంటా కొనసాగిద్దామని శపథం చేద్దాం.

## తూర్పు కనుమల్లో విరబూసిన ఎర్రమందారాలు. ఆదివాసుల పోరుకేతనం. కా॥ రవి



బక్కపలచని రూపం చెదరని చిరునవ్వు, ప్రేమతో మెరిసే కళ్ళు, పీడిత ప్రజలంటే అనంతమైన ప్రేమ, శత్రువు పట్ల తీవ్రమైన వర్గకసి ఆదివాసీ ప్రజలకి కొండంత అండగా, శత్రువుకు నిత్యం ఒక సవాల్‌గా తూర్పు కనుమల్లో పొడిచిన సూర్యుడు, మన్యం ముద్దు బిడ్డ, అల్లూరి వారసుడు, ఆదివాసుల పోరుకేతనం మన గాలికొండ రవి.

విశాఖ జిల్లా చింతపల్లి మండలం కొమ్మంగి గ్రామంలో కుడుముల వెంకట్రావు (రవి) జన్మించాడు. రవి పుట్టిపెరిగిన ప్రాంతం 1980,90ల వరకు ఈస్ట్ డివిజన్ ఉద్యమానికి ఆయువు పట్టుగా ఉండింది. రవి దగ్గరి బంధువులైన కా॥ జవ్వాది నాగరాజు, కా॥ ఎమజుక్క వెంకటేశ్వర్లు విప్లవోద్యమంలో పని చేస్తూ 1985 సెప్టెంబర్‌లో అమరులు అయ్యారు. చాలా సహజంగానే అక్కడి ఉద్యమ ప్రభావం, అమరుల ప్రభావం రవి మీద పడింది.

కా॥ రవి పార్టీలోకి వచ్చినప్పటి నుండి శత్రువుపై జరిపిన అనేక దాడుల్లో చురుకుగా పాల్గొన్నాడు. 1998 చివరిలో బొడిగెడ్డ-బోడపడ జంట రెయిడ్‌లతో మొదలుకుని ధారకొండ, కలిమెల- మోటు, కోరాపుట్, ఆర్. ఉదయగిరి, నాల్కో వరకు పలు పోలీస్‌స్టేషన్‌లు, క్యాంపులపై పి.ఎల్.జి.ఎ. నిర్వహించిన దాడులలో కా॥ రవి కీలక పాత్ర పోషించాడు. ఈ దాడులలో రవి ప్రధాన అస్సాల్ట్ టీమ్‌లలో వుంటూ, దాడులు విజయవంతం చేయటంలో ముందున్నాడు. బుద్దడుపాడు, తూరుమామిడి, లూసం, పలగరేవు, గునికిరాళ్ళు, బలిమెల ఇలా అనేక ఆంబుష్‌లలో శత్రు బలగాలను నిర్మూలించటంలో ధైర్యంతో, తెగువతో ముందుండి పోరాడేవాడు. అనేక ఎన్‌కౌంటర్లలో నిబ్బరంగా వుంటూ శత్రువును ప్రతిఘటిస్తూ సురక్షితంగా పి.ఎల్.జి.ఎ. బలగాలను రిట్రీట్ చేయించేవాడు. నాల్కో, గునుకరాళ్ళ ఘటనల్లో గాయాలపాలైనప్పటికీ, తను నిర్వహించాల్సిన కర్తవ్యాన్ని పనిపూర్తి చేయటంలో తనకు తానేసాటి. ఉద్యమానికి తీవ్ర నష్టాల్ని కలిగించిన గబ్బిలం సంజీవరావు, బుటారి రంగడు వంటి అనేక మంది ప్రజా ద్రోహులను, ప్రజా వ్యతిరేకులైన భూస్వాములు, పెత్తందార్లను శిక్షించటంలో ముందుండేవాడు. కా॥ రవి శత్రువు ఎత్తుగడల్ని తిప్పికొడుతూ, ధైర్యసాహసాలతో, త్యాగానికి సిద్ధపడి ప్రజాయుద్ధ చర్యల్ని తీవ్రతరం చేశాడు. తీవ్రమవుతున్న ప్రజాయుద్ధంలో పార్టీ అప్పగించిన బాధ్యతల్ని చేపట్టి నెరవేర్చాడు. సి.ఆర్.సి. ఏర్పరిచిన మొదటి కంపెనీలో ప్లాటూన్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. 2010లో మొదటి కంపెనీకి కంపెనీ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించి నాయకత్వం వహించాడు.

నిర్బంధ పరిస్థితుల్లో తీవ్ర అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా, చివరి వరకూ పీడిత ప్రజల విముక్తికై అంకుఠిత దీక్షతో కృషి చేశాడు. అన్ని విధాలుగా కేడరుకి ఆదర్శంగా నిలిచాడు.

2016 ఏప్రిల్ నెలలో కా॥ రవి తీవ్ర అనారోగ్యంతో అమరుడు అయ్యాడు. ఆంధ్రా-ఒడిస్సా రాష్ట్రాలలో కామ్రేడ్ రవి 2 దశాబ్దాల విప్లవ కృషి ఆదర్శవంతమైనది. విద్య, వినయం, పట్టుదల విశ్వాసం, ధైర్యసాహసాలు, ప్రజలతో కలిసి పోవడం, అమితంగా ప్రేమించడం తెలిసిన ఒక బాధ్యాతయుతమైన ప్రజాయుద్ధ నాయకుడు, కార్మిక వర్గ చైతన్యాన్ని అణువణువునా కలిగి ఉండి ప్రజల పట్ల ప్రేమను, శత్రువు పట్ల ద్వేషాన్ని వ్యక్తం చేసిన మన విప్లవ నాయకునికి వినమ్రంగా జోహార్లర్పిద్దాం.

## నారాయణపట్న ఉద్యమానికి ఊపిరూదిన కా॥ జైరాం.



కా॥ జైరాం దండకారణ్యంలోని బీజాపూర్ జిల్లా కేసూరు గ్రామంలో నిరుపేద కోయ ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. కేసూరు పశ్చిమ్ బస్తర్‌లోని బైరాంగఢ్ ఏరియాలో పార్టీ కార్యకలాపాల ప్రభావం బలంగా వున్న గ్రామం. 2005లో సల్వాజుడుం పేరుతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఫాసిస్టు దమనకాండ జరిపినప్పుడు వీరి గ్రామంపై కూడా పదే పదే దాడులు చేసి నష్టపరిచారు.

కా॥ జైరాం పై చిన్నతనం నుండి పార్టీ కార్యకలాపాల ప్రభావం వున్నది. సి.ఎన్.ఎమ్. పాటలతో ఉత్తేజం పొందాడు. సల్వాజుడుం దాడులను తిప్పికొడుతూ 2006లో సి.ఆర్.సి. కంపెనీ-1, కంపెనీ-3 లలో పని చేస్తున్న సమయాలలో ఆయా యూనిట్స్ చేపట్టిన ముఖ్యమైన అన్ని మిలిటరీ చర్యలలో తను ముందుండేవాడు. చారిత్రాత్మకమైన

నయాగడ్ మళ్లి రెయిడ్, నాల్కో రెయిడ్, బలిమెల, పోత్కల్, పాలూరు, పాట్మంగ్ వంటి విజయవంతమైన రెయిడ్‌లలో, ఆంబుష్‌లలో పాల్గొన్నాడు. ఎన్నోసార్లు శత్రువు చేసిన దాడులను తిప్పికొట్టాడు. పై అన్ని మిలిటరీ చర్యలలో కూడా తాను అడ్వాన్స్‌లో ముందుండేవాడు. రిట్రీట్‌లో వెనుక వుండేవాడు. తనచొరవ, ధైర్యం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను గుర్తించి సి.వై.పి.సి. జైరాంను పి.పి.సి.ఎమ్.గా ప్రమోట్ చేసింది.

2016లో జరిగిన టి.సి.ఒ.సి.లో భాగంగా ప్రమాదవశాత్తు మైన్‌పేలి కా॥ జైరాం అమరుడు కావటం ఎ.ఒ.బి. ఉద్యమానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. కా॥ జైరాం టీచర్‌గా, టెక్నీషియన్‌గా, ఆన్‌స్ట్రక్టర్‌గా, సెక్షన్ కమాండర్‌గా, డాక్టర్‌గా ప్రజలకి అందించిన సేవలు మరువలేనివి.

## పట్టణం నుండి పల్లెలకు వీచిన పోరుపవనం కా॥ ఆజాద్.



కా॥ ఆజాద్ విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవాని పాలెం గ్రామంలో విప్లవ ప్రభావం కలిగిన కుటుంబంలో జన్మించాడు. ఆజాద్ అసలు పేరు గోపాల్. కా॥ ఆజాద్ చిన్నప్పటి నుండి విప్లవ భావాలతో పుట్టిపెరిగాడు. అలా 2002లో పార్టీలోకి రిక్రూట్ అయ్యి, పార్టీ తనకి అప్పగించిన కొరియర్ బాధ్యతలను అత్యంత జాగరూకతతో, చాకచక్యంగా నిర్వహించాడు. ఆ క్రమంలో 2006లో అరెస్టు అయ్యాడు. శత్రువు పెట్టిన చిత్రహింసలన్నింటిని దృఢచిత్తంతో తట్టుకున్నాడు. జైలు నుంచి బయటికి వచ్చి ఇంటి దగ్గర కొంత కాలం వుండి మళ్ళీ 2009లో అటవీ ప్రాంతంలో పని చేయడానికి వచ్చి 2009 నుండి అమరుడయ్యేంత వరకు ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఏరియాను ఉద్యమ కార్యక్షేత్రంగా ఎంచుకుని పని చేశాడు. దళ సభ్యుడిగా మొదలై గాలికొండ ఏరియా కమిటీ కార్యదర్శిగా ఎదిగాడు. పలగరేవు ఆంబుష్, కిల్లంకోట దగ్గర ఆపర్చునిటీ ఆంబుష్‌లలో దూకుడుగా వచ్చిన శత్రువుపై దాడి చేసి, నష్టపరిచారు. ఈ దాడుల్లో కా॥ ఆజాద్ ముఖ్య పాత్రని నిర్వహించాడు.

ప్రజాయుద్ధ నాయకునిగా ఎదిగే క్రమంలో ప్రజాద్రోహి ఇచ్చిన సమాచారంతో శత్రువు దళం మకాంపై దాడి చేయటంతో కా॥ ఆజాద్ అమరుడు అయ్యాడు. 2016 మే 4న విశాఖ జిల్లా కొయ్యూరు మండలం యుచిడిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని మర్రిపాకల-పాల సముద్రం గ్రామాల మధ్యన జరిగిన ఎన్‌కౌంటర్ శత్రువుతో ముఖాముఖి పోరాడుతూ కా॥ ఆనంద్, కా॥ కమల లతో పాటు కా॥ ఆజాద్ కూడా అమరుడయ్యాడు.

## పోరు వనంలో పుష్పించిన ఎర్ర కలువ కా॥ కమల.

కా॥ కమల మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్‌లోని చవులూరు గ్రామంలో 26 సంవత్సరాల క్రితం నిరుపేద ఆదివాసీ కుటుంబంలో జన్మించింది. కా॥ కమల స్వంత పేరు గంగి. గ్రామంలో వుంటూ పార్టీ అప్పగించిన పనులు చేస్తూ 2007లో పార్టీలోకి రిక్రూట్ అయ్యింది. 2009లో కోరాపుట్ జిల్లాలోని బైఫర్‌గూడ ఏరియాలోకి విస్తరణలో భాగంగా కమల కూడా వెళ్ళింది. అక్కడి ప్రజలతో కలిసి పోయి ప్రజా సమస్యలపై ప్రజలని పోరాటాలలోకి కదిలించింది. 2012లో టి.సి.ఒ.సి.లో భాగంగా దన్నుగూడ వద్ద బి.ఎస్.ఎఫ్. అధికారులను చంపి ఆయుధాలు స్వాధీనం చేసుకున్న ఘటనలో చురుకుగా పాల్గొన్నది. 2012లో పార్టీ కా॥ కమలను ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ చేసింది. గుమ్మ ఏరియాలో మహిళా ఉద్యమ నిర్మాణ బాధ్యతలు తీసుకుని ఉద్యమంలో మహిళల భాగస్వామ్యం పెంచింది. 2013లో టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌కు పార్టీ బదిలీ చేస్తే వెళ్ళింది. ఆ రంగంలో ఎటువంటి అనుభవం లేకపోయినా, పట్టుదలగా నేర్చుకుని అనుభవాన్ని సాధించింది. విప్లవోద్యమంలో తన వంతు పాత్రను నిర్వహిస్తూ, ఎదుగుతున్న క్రమంలో మే 4న మర్రిపాకల వద్ద జరిగిన దాడిలో కా॥ ఆజాద్, కా॥ ఆనంద్ లతో పాటు అమరురాలయ్యింది.

## పోరు కేరటంలా ఎగసిన విప్లవ యోధుడు కా॥ ఆనంద్.



కా॥ ఆనంద్ తూర్పు గోదావరి జిల్లా, అడ్డతీగల మండలం, దబ్బపాలెం గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. ఆనంద్ స్వంత పేరు జడుమూరు వెంకటేశ్వర్లు. కా॥ ఆనంద్ పుట్టిపెరిగిన ప్రాంతం గతంలో వర్గ పోరాటం జరిగిన ప్రాంతం. ఆ ప్రభావంతో, పార్టీలో వున్న తన అన్న ప్రోత్సాహంతో 2004లో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. కోనలోవ దళ సభ్యుడుగా, తరువాత గార్డుగా బాధ్యతలు నిర్వహించాడు. 2008లో ఏరియా కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. కొంత కాలం ఈస్ట్ ప్లాటూన్‌లో, జోన్ యాక్షన్ టీమ్‌లో పని చేశాడు. 2013నుండి అమరుడయ్యేంత వరకూ గాలికొండ ఏరియా కమిటీ సభ్యుడిగా, ఎల్.జి.ఎస్. డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. కా॥ ఆనంద్ ఆర్. ఉదయగిరి, నాల్కో వంటి రెయిడ్స్‌లో పాల్గొన్నాడు. గొల్లవలస ఫైరింగ్‌లో గాయపడినప్పటికీ ఎటువంటి గందరగోళానికి గురికాకుండా నిబ్బరంగా, ధైర్యంగా కొట్లాడుతూ రిట్రీట్ అయ్యాడు. 2016 మే 4వ తేదీన మర్రిపాకల వద్ద జరిగిన ఎదురుకాల్పులలో కా॥ ఆజాద్, కా॥ కమలలతో పాటు అమరుడు అయ్యాడు.

మర్రి పాకల ఎన్‌కౌంటర్‌లో అమరులైన తూర్పుకనుమల ముద్దు బిడ్డలకు వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం. ★


**అమరవీరులకు విప్లవ జోహార్లు**

**అమరవీరుల ఆశయాలను తుదవరకు కొనసాగిద్దాం**

(చివరి పేజీ తరువాయి)

## జంత్రి (రామగూడ) అమరులు


కా. దినేష్


కా. బుద్రి


కా. శ్వేత


కా. రూపి


కా. రాజేష్


























### అజరామరులు

ఓ అమరులారా....
శత్రువుతో వీరోచితంగా
పోరాడుతూ
నేలకొరిగిన వీర యోధులారా
అజరామరులు మీరు
మీ మరణం వృధా కాదు – మీ త్యాగం
వృధా పోదు
మీ నెత్తుటితో తడిసిన యుద్ధ
భూమిలో
పోరు విత్తనాలు మొలకెత్తుతాయ్
ప్రజా యుద్ధంలో
దోపిడీ పాలకవర్గాలను కూల్చివేసి
మీ నెత్తుటి బాకీ తీర్చుకుంటాం
మీ ఆశయాలను కొనసాగిస్తూ
ప్రజారాజ్యం నిర్మిస్తాం

### ఆకాశంలో అరుణతారలు

సామ్రాజ్యవాదుల కుట్రల్లో
ప్రకృతి సంపదల దోపిడీ
భారత పాలకవర్గాల దన్నుతో
మూలవాసుల గెంటివేత
సైన్యాల మోహరింపులు
క్యాంపులలో తోడేళ్ల గుంపులు
కీకారణ్యంలో ఖాకీల క్రౌర్యం
కనబడ్డవాళ్ళ కాల్చివేత
గ్రేహౌండ్స్ బలగాల అకృత్యాలు
ఆదివాసుల హక్కుల హననం
రాజ్యం రక్త దహానికి
బలిమెలలో బందూకుల గర్జన
పచ్చని అడవిలో నెత్తుటి ఏరులు
నేలకొరిగిన పుడమితల్లి పుత్రులు, పుత్రికలు
ఆకాశంలో అరుణతార లయ్యారు

# బహుముఖ ప్రజ్ఞావంతుడు, దళిత, ప్రజాస్వామిక ఉద్యమాల నాయకుడు విప్లవోద్యమ మిత్రుడు బొజ్జా తారకంకు విప్లవ జోహార్లు

కామ్రేడ్ బొజ్జా తారకం తూర్పు గోదావరి జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామంలో 1940 సం॥లో జన్మించాడు. భార్య విజయ భారతి ప్రముఖ దళిత కవి బోయి భీమన్న కూతురు, విద్యావంతురాలు. విజయ భారతి గారి ఉద్యోగం బదిలీ కావడంతో నిజామాబాద్‌కు వచ్చి లాయర్‌గా ప్రాక్టీస్ కొనసాగించారు.



నిజామాబాద్‌లోనే ప్రజాస్వామిక ఉద్యమాలలో పాల్గొంటూ దళితుల హక్కుల కోసం పోరాటాలను ప్రారంభించాడు. అంబేద్కర్ సంఘాన్ని ప్రారంభించి నడిపారు. పౌరహక్కుల సంఘంలో ఉపాధ్యక్షుడుగా పని చేసారు. ఆయనను ప్రభుత్వం ఎన్నో సార్లు అరెస్టు చేసి జైలులో నిర్బంధించింది. ఎమర్జెన్సీలో కూడా ఆయన కొన్ని నెలలు జైలు జీవితం గడిపారు. నిర్బంధంలో తన అనుభవాల ఆధారంగా రాసిన "పోలీసులు అరెస్టు చేస్తే" అనే రచన విస్తృత ప్రచారం పొందింది. 30 వేల కాపీలను పోలీసులు కొని తగుల బెట్టారు. 1985లో కారంచేడులో దళితులపై జరిగిన మారణకాండకు నిరసనగా గవర్నమెంటు ప్లీడర్ పదవికి రాజీనామా చేసారు. అప్పుడే జడ్జి అయ్యే అవకాశం గురించి చర్చిస్తే "జడ్జి కావడం కన్నా ప్రజలు ముఖ్యం" అన్నారు. కత్తి పద్మారావు కార్యదర్శిగా దళిత మహాసభను స్థాపించారు. కారంచేడు ఘటనకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపితంగా వచ్చిన ప్రజా కదలిక, దళితుల్లో కలిగిన చైతన్యంలో విప్లవోద్యమ చొరవను తారకం గారు ఆహ్వానించారు. ఆ ఉద్యమంతో పాటు వరుసనే జరిగిన చుండూరు, నీరుకొండ, పదిరికుప్పం, వేంపేట, లక్ష్మీపురం, వై. చెర్లోపల్లి లాంటి దళితులపై జరిగిన దారుణ మారణకాండలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించడంలో ప్రముఖ భూమికను నిర్వహించారు. తారకం గారు సంపాదకులుగా 1991 నుండి 1994 వరకు 4 సం॥ల పాటు నలుపు పత్రికను నడిపారు. స్వయంగా కుల వివక్షను, వేదనను అనుభవించిన దళిత మేధావి తారకం గారు కుల నిర్మూలన కోసం అంబేద్కర్ సిద్ధాంతాన్ని స్వీకరించారు. దళితులకు రాజ్యాధికారం అవసరాన్ని గుర్తించి అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగారు. అసమానతలున్న వర్గ సమాజంలో భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంగా జరుగుతున్న విప్లవోద్యమంకు మద్దతుగా నిలిచారు. హై కోర్టు లాయర్‌గా, పౌరహక్కుల ఉద్యమ నేతగా, మంచి రచయితగా, మంచి వక్తగా సమాజాన్ని చైతన్య పరిచారు. సామాజిక మార్పు కోసం విశేషంగా కృషి చేసారు. చుండూరు కేసును ప్రత్యేక కోర్టుకు బదిలి చేసినపుడు బి. చంద్రశేఖర్ జడ్జిగా, తారకం స్పెషల్ ప్రాసిక్యూటర్‌గా ప్రజల తరపున కేసులకు న్యాయం జరిగేలా విశేషంగా కృషి చేసారు. బొజ్జా తారకం అధ్యక్షుడుగా చుండూరు దళితుల న్యాయ పోరాట కమిటీని ఏర్పాటు చేసారు.

**పౌరహక్కుల నేతగా ప్రధాన భూమిక** – రాజ్యహింసకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పోరాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లపై కోర్టుల్లో బాధితుల పక్షాన నిలబడి అవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లని నిరూపించడంలో కీలకపాత్ర వహించారు. ఎన్‌కౌంటర్లు జరిగిన ప్రాంతాలకు వెళ్లే నిజ నిర్ధారణ కమిటీల్లో ఉండేవారు. పౌరహక్కుల సంఘం నాయకులు హత్యలకు గురయినపుడు తీవ్రంగా ప్రతిస్పందించారు. రాష్ట్రంలోను, దేశంలో రాజ్యహింసకు వ్యతిరేకంగా జరిగిన అనేక పౌరహక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఖైదీల హక్కుల కోసం జరిగిన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఉరిశిక్షను రద్దు చేయాలని పోరాడారు. కా. బొజ్జా తారకం గారు సి.ఆర్.పి.పి. అధ్యక్షులుగా పనిచేసారు. కర్నాటక లోని తూనికూరు జైలు నుండి అనంతపూర్ జిల్లాకు చెందిన 20 మంది రాజకీయ ఖైదీలు విడుదల కావడానికి విశేషంగా కృషి చేసారు.

8 సం॥రాలు పౌరస్పందన వేదికలో పనిచేసిన తారకం గారు చర్చల అనంతరం ప్రజా భూ కమీషన్ చైర్మెన్‌గా రాష్ట్రమంతా తిరిగి భూ సంబంధాలను అధ్యయనం చేసారు.

2004లో ప్రభుత్వం విప్లవ పార్టీలతో చర్చలు జరిపినపుడు మధ్యవర్తుల కమిటీలో ఉండి ప్రముఖ పాత్రను నిర్వహించారు. నాలుగు రోజులు చర్చల్లో భాగస్వామిగా ఉన్న తారకం గారు చివరలో సమీక్ష సందర్భంగా ప్రభుత్వం నిజాయితీ లేని విధానాన్ని బహిర్గతం చేస్తూ మాట్లాడడమే కాకుండా విప్లవ పార్టీలు ముందుకు తెచ్చిన భూమి, ప్రజాస్వామ్యం లాంటి ఏ సమస్యలకు సమాధానం చెప్పకుండా చీట్ చేసిందని ఆ మంత్రివర్గం ముందే ప్రభుత్వ విధానాన్ని నిశితంగా విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం అండతో ఆదివాసీ ప్రజానీకంపై అమలు చేసిన సల్వాజుడుం హత్యాకాండను వ్యతిరేకించాడు. జూన్ 2012లో సార్కిన్‌గూడ మారణకాండపై వేసిన నిజనిర్ధారణ కమిటీలో నిజాలు వెల్లడించి ఆదివాసులకు అండగా నిలిచారు. గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా బీ.డీ.శర్మతో కలిసి దేశమంతా తిరిగి ప్రచారం చేసారు. 1/70 అమలు కోసం పోరాడిన తారకం గారు, 1989లో ఎన్.టీ.ఆర్. ప్రభుత్వం 1/70ని రద్దు చేయాలని చూస్తే తీవ్రంగా ప్రతిఘటించారు.

తారకం గారు ముస్లిం మైనారిటీల హక్కుల కోసం పోరాడారు. వారిపై రాజ్యహింసను ఖండించారు. వికారుద్దీన్ లాంటి ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించారు. ఎన్‌కౌంటర్లను హత్యలుగా నమోదు చేయాలని హైకోర్టులో వాదించిన ప్రముఖుడు. ప్రత్యేక తెలంగాణ పోరాటాన్ని సమర్ధించిన తారకంగారు నూతన రాష్ట్రంలో గ్రేహౌండ్స్ బలగాల గాలింపు చర్యలను, బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించారు. తారకం గారు ఐదు దశాబ్దాల ఉద్యమకారుడు. నాలుగు దశాబ్దాల దళిత ఉద్యమ నాయకుడు.

2016 సెప్టెంబర్ 16న శుక్రవారం రాత్రి కామ్రేడ్ బొజ్జా తారకం గారు అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. పీడిత ప్రజల పక్షాన నిలిచి పోరాడిన అమరునికి ప్రజా విముక్తి పత్రిక వినమ్రంగా జోహార్లు చెబుతుంది. ★

# ఆమె జీవితమే పోరాటం-ఆదివాసులే ఆమె ఊపిరి
# అదే మహాశ్వేతాదేవి జీవిత మాధుర్యం

మహాశ్వేతాదేవి బంగ్లాదేశ్ లోని ఢాకా లో 1926లో జన్మించారు. తండ్రి మనీష్ ఘటక్ ప్రసిద్ధ కవి. తల్లి ధరిత్రిదేవి రచయిత్రి, సంఘ సేవకురాలు. మహాశ్వేతాదేవి ఢాకాలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. దేశ విభజన తరువాత ఆ కుటుంబం పశ్చిమ బెంగాల్‌కు తరలి వచ్చింది. చిన్న వయసులోనే 'గణనాట్య' అనే థియేటర్ బృందంతో కలిసి పని చేశారు. బి.ఏ. చదువుతున్న రోజుల్లో మార్క్సిస్టు భావజాలం పట్ల ఆకర్షితురాలయ్యారు. ఆమె శాంతినికేతన్‌లో బి.ఎ. ఆనర్స్, కలకత్తా యూనివర్సిటీలో ఎమ్.ఎ. పూర్తి చేశారు. ప్రముఖ నాటక రచయిత బిజోన్ భట్టాచార్య (ఇప్టా వ్యవస్థాపకుల్లో ఒకరు) తో 1948లో వివాహం జరిగింది. వారి కుమారుడు నబరుణ్ భట్టాచార్య బెంగాలీ నవలాకారుల్లో సుప్రసిద్ధుడు. కమ్యూనిస్టు అన్న ఆరోపణల కారణంగా 1950లో తపాలాశాఖలో ఉద్యోగాన్ని పోగొట్టుకున్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆధారంగా 1956లో రాసిన "ఝాన్సీర్‌రాణి" తో రచనా జీవితం ప్రారంభించారు.



1959 లో భర్తతో విడాకులు తీసుకున్నారు. వృద్ధాప్యంలో కొడుకు కేన్సర్ వ్యాధితో చనిపోయాడు. వ్యక్తిగత జీవితంలో కొన్ని సమస్యలు వున్నా, ఆమె ఉద్యమ ప్రవాహ జీవితంలో ఆటు, పోటులు ఎన్ని ఎదురైనా ముందుకే పయనించారు. వెట్టి బతుకుల విషయంలోనూ, బ్రిటీషువాళ్ళ నేరస్థ జాతులుగా వెలివేసిన ఆదివాసీ తెగల గురించి ప్రత్యేక శ్రద్ధతో పట్టించుకుని పోరాడారు. వారి గురించి రచనలు చేశారు. సుదీర్ఘ అధ్యయనం, ఆచరణ, కార్యశీలత ఆమెను ఒక సృజనశీలిగా, చరిత్రలో నిలిచి పోయే మహా రచయిత్రిగా, మానవీయత నిండిన మహా మనిషిగా, ఆదర్శ ఆదివాసీ మాతగా మలిచాయి. మహాశ్వేతాదేవి చెమటను, నెత్తురును పట్టించుకుని శ్రమజీవికి పట్టం కట్టారు. మహాశ్వేతాదేవి 1964లో బిజయ్‌గడ్ కాలేజీలో అధ్యాపక వృత్తిలో చేరారు.

బ్రిటిష్ వారిపై పోరాడిన బిర్సాముండా అనే గిరిజన వీరుని జీవితం ఆధారంగా 1977లో ఆమె రాసిన 'అరణ్యేర్ అధికార్' నవల తొలిసారి ఆదివాసీల స్వరాన్ని నాగరిక సమాజానికి వినిపించింది. ఆదీవాసీలు కూడా ఆమెను తమ గోడు వినిపించగల గొంతుగా గుర్తించారు. ఆమె చెప్పిన తమ కథ 'అరణ్యేర్ అధికార్' ను ఆదివాసీ భాషలోకి అనువదించుకున్నారు. అలాగే మహిళలు, దళితులు ఎదుర్కొంటున్న వివక్ష, సమస్యల గురించి ఎన్నో రచనలు చేశారు. బీహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో గిరిజనుల పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారు.

చరిత్ర అనేది సామాన్యుల జీవితాల నుండే వస్తుందనీ, పీడిత తాడిత వర్గాలే తన రచనకి ఉత్ప్రేరణ అని, మనిషిని మనిషిగా చూసే సమాజం రావాలని, వర్గ పీడన నుంచి వర్గ పోరాటం ప్రారంభమయిందని తన రచనలు పీడిత వర్గాలకే అంకితమని మహాశ్వేతాదేవి ప్రకటించారు. ఆమె రాసిన వంద కథానికలు బెంగాలీ భాషలో 7 సంపుటాలుగా వెలువడ్డాయి. ఆమె సాహిత్యాన్ని హిందీ, ఇంగ్లీష్‌ల్లోనే కాక, అనేక భారతీయ భాషల్లోకి అనువదించడం ద్వారా విస్తృతమైన పాటక జనంలోకి ఆమె రచనలు వెళ్ళాయి.

ఆమెకు లెక్కలేనన్ని ఆవార్డులు వచ్చాయి. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు (1979), జ్ఞానపీఠ్ అవార్డు (1996), రామన్ మెగసేసే అవార్డు (1997) లాంటివి ఎన్నో వచ్చాయి. అవార్డులన్నింటి కన్నా ప్రజల ఆదరణ, అభిమానమే తనకు ఎంతో ప్రియమైనవని పలు సందర్భాల్లో ఆమె పేర్కొన్నారు. కలకత్తాలోని తన నివాసంలో ఆదివాసులు తయారు చేసిన వస్తువులు సేకరించి, అమ్మి వారికి సహాయం చేసింది. ఆమె ఆదివాసీ ప్రపంచ బందీ. నందిగ్రాం, సింగూర్ పోరాటాలతో ఆమె పోరాట ఆచరణ విస్తరించింది. లాల్‌గడ్ పోరాటం ఆమెలో నూతన విశ్వాసాన్ని రగిలించింది. కిషన్‌జీని మమతా ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపినప్పుడు సి.పి.ఎమ్. లాగే తృణమూల్ కాంగ్రెస్ కూడా ఫాసిస్టు పోకడలు పోతున్నదని విమర్శించారు.

1970 దశకం దేశాన్ని విప్లవ మార్గంలోకి నడిపిన నక్సలైట్ ఉద్యమం నేపథ్యంలో రచించిన 'హజార్ చౌరాసియాకీమా' (ఒక తల్లి పేరుతో వచ్చిన తెలుగు నవల)ను, 'రుదాలి' నవలను అవే పేర్లతోను 'గాంగోర్' అనే కథను 'చోలీకే పీఛే' అనే పేరుతోను హిందీలో తెరకెక్కించారు. అంతరించి పోతున్న గిరిజన తెగలు, పలుకుబడులు, జన పదాలను గ్రంథస్థం చేయాల్సిన అవసరం ఉందని ఆమె తరచు స్పష్టం చేస్తుండేవారు. పరపీడన నుండి వర్గ పోరాటం ప్రారంభమైందన్నది ఆమె నిశ్చితాభిప్రాయం. అందుకే ఆ పోరాటాలకు మద్దతునిచ్చారు.

మహాశ్వేతాదేవి జూలై 28 మధ్యాహ్నం 3.15 నిముషాలకు తన 91వ యేట తుదిశ్వాస విడిచారు. ఆమె చేసిన విశేష కృషిని, ఆదివాసుల పట్ల వున్న అంకిత భావాన్ని శ్లాఘిస్తూ, ప్రజా విముక్తి పత్రిక వినమ్రంగా జోహార్లు అర్పిస్తోంది. ★

## ఖమ్మం

**పోరాడి సాధించుకున్న తునికాకు రేటు:** చర్ల, శబరి ఏరియా పరిధిలో తునికాకు రేటు పెంపుకొరకు పోరాడాలని ప్రజలకు పిలుపునిస్తూ, 50 ఆకుల కట్టకు రూ॥2.00, మరణించిన వారికి రూ॥ 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ప్రమాదవశాత్తు గాయాల పాలైన వారికి రూ॥లు 2 లక్షల 50 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మే-2016లో పోస్టర్లు, పత్రిక ప్రకటనల ద్వారా ప్రచారం చేయగా ప్రజలందరు ఐక్యమై తునికాకు కాంట్రాక్టర్‌తో పోరాడి ఒక కట్టకు రూ॥లు 1.50పైసలు సాధించుకున్నారు.

**ప్రజల మద్దతుతో కొనసాగించిన మిలీషియా ప్రతిఘటన చర్యలు:** శబరి ఏరియాలోని ఏడుగురాళ్లపల్లి పోలీసు స్టేషన్ సమీపాన ప్రెషర్ బాంబు అమర్చగా విఫలమయ్యింది. చర్ల మండలానికి కిలో మీటరు దూరంగా లెనిన్ కాలని వద్ద ల్యాండ్‌మైన్ పేల్చగా ఈ రెండు ఏరియాల్లో శత్రువును గందరగోళానికి గురి అయి, తాత్కాలికంగా శత్రువు కూంబింగ్‌లు ఆపుకున్నాడు.

**మే4, 5న సి.ఆర్.బి. ఇచ్చిన బంద్‌ను విజయవంతం చేసిన ప్రజలు:** బంద్‌ను విజయవంతం చేయడంలో భాగంగా పోస్టర్లు, పత్రిక ప్రకటనల ద్వారా ప్రచారం చేశారు. చర్ల, శబరి ఏరియా పరిధిలో పెద్దమిడిసిలేరు గ్రామ బ్రిడ్జి వద్ద మిలీషియా సహాయంతో మైన్ పేల్చిడం జరిగింది. దుమ్ముగూడెం మండలానికి అతి సమీపాన ఉన్న సీతానగరం బి.ఎస్.ఎన్.ఎల్. సెల్ టవర్‌ను ధ్వంసం చేసి, సోలార్ ప్లేట్లు 10 స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాలలో చింతూరు, దుమ్ముగూడెం మండలాలోని ఆదివాసీ గ్రామాల ప్రజలు సుమారు 580 మంది, మిలీషియా పాల్గొని బంద్‌ను విజయువంతం చేయుడంలో భాగస్వాములైనారు. ఏడుగురాళ్ళపల్లి-పేగా గ్రామాల మధ్యలో రోడ్డును ధ్వంసం చేయడం జరిగింది.

శబరి ఏరియా చింతూరు మండలం ఏడుగురాళ్ల పల్లి పోలీస్‌స్టేషన్‌కు 100 గజాల దూరంలో 2016 మే 25న శత్రువుపై బాంబు దాడి చేయడంతో, శత్రువు మరణించినప్పటికీ, ప్రచారం చేయలేదు.

**నిర్బంధం:** శత్రువు కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దాడిలో భాగంగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాలలోని చర్ల, శబరి ఏరియాలో గ్రామాలపై రాత్రి, పగలు అనే తేడా లేకుండా చుట్టుముట్టి నిరంతరం దాడులు చేస్తూ, ఆదివాసీ ప్రజలను, యువకులను అరెస్టులు చేసి, జైళ్లో పెడుతున్నారు. బైండోవర్ కేసులు బనాయించి, ప్రతిరోజు సంతకాలకు రావాలని షరతులు విధించుతున్నారు.

చర్ల మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన మిలీషియా డిప్యూటి కమాండర్ మడకం సోనాల్‌తో పాటు మరో ఇద్దరు సాధారణ వ్యక్తులు భద్రాచలం వెల్లుతుండగా, కలివేరు గ్రామం వద్ద అరెస్టు చేసి, కూంబింగ్ నిర్వహిస్తుండగా, చెన్నాపురం అడవుల్లో తారసపడ్డారని, అరెస్టు చేసి జైళ్ళో బంధించారు.

పూసుగుప్ప గ్రామానికి చెందిన ఏడుగురు గ్రామస్తులపై తప్పుడు ఆరోపణలు వేసి, బైండోవర్ కేసులు బనాయించినారు. ఈ సాకుతో పూసుగుప్ప ప్రజలందరిని స్టేషన్‌కు సంతకాలకు రావాలని పిలిచి, మావోయిస్టు పార్టీ సానుభూతిపరుల్ని అరెస్టు చేసి, తీవ్రంగా చిత్రహింసలు పెట్టినారు. ఊట్లపల్లి గ్రామ వాసి, తాటి పాపారావును అరెస్టు చేశారు.

సరిహద్దు గ్రామాలైన, ఎర్రంపాడు, చెన్నాపురం, బత్తినిపల్లి, బట్టిగూడెం, తిప్పాపురం, రాళ్ళగట్ట, రాంపురం, కుర్నపల్లి, బక్కచింతలపాడు, పందిన గుబ్బల్, కొనేవాయి, కొర్‌కోడుపాడు, గ్రామాల ప్రజలను దళాల కదిలికల, ప్రతి రోజు సమాచారం అందించాలని, క్రమం తప్పకుండా నలుగురు వచ్చి సమాచారం ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించి, భయభ్రాంతుల్ని చేయడం జరిగింది.

**ప్రజల ప్రతిఘటన:** శబరి ఏరియా చింతూరు మండలానికి చెందిన, కలిగుండ, దయ్యాలవాగు, బిల్లుడుగుంపు 3 గ్రామాలను పోలీసులు తెల్లవారుజామున 4-45 ని॥ల సమయంలో చుట్టుముట్టి గ్రామాల ప్రజలను అరెస్టు చేసి, చింతూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్ళగా, ఆయా గ్రామాల ప్రజలు వెంటనే ఆందోళన చేసి విడిపించుకున్నారు. ముగ్గుర్ని వదల కుండా కొట్టి బయపెట్టి లొంగదీసుకోవాలనుకున్నారు. కానీ, పోలీసుల ప్రలోభాలకు వారు లొంగకపోవడంతో బైండోవర్ కేసులు పెట్టి వదిలేశారు.

**సంస్కరణలు:** దండకారణ్యంలో, తెలంగాణలో పార్టీ నుండి ప్రజలను వేరుచేయడానికి చేపడుతున్న ప్రభుత్వం సంస్కరణలో భాగంగా అభివృద్ధి పేరుతో, ప్రధానమంత్రి సడక్ యోజన పేరు మీద రోడ్లు, కమ్యూనికేషన్, కార్పొరేట్ సెక్యూరిటీ, అటాక్ ప్రూఫ్ పోలీసు స్టేషన్లు, జి.పి.ఎస్.వంటి సాంకేతిక పరిజ్ఞానం గల పరికరాలు, పెట్రోలింగ్ వాహనాలు, పోలీసు వ్యవస్థకు అధికంగా బడ్జెట్ కేటాయించి పనులు వేగవంతం చేస్తున్నారు. వాటిలో భాగంగానే తిప్పాపురం, చెన్నాపురం, ఎర్రంపాడు, బత్తినిపల్లి, పెద్దమిడిసిలేరు, కుర్నపల్లి, గ్రామాల మీదుగా ఆర్.కొత్తగూడెం మేయిన్‌రోడ్డుకు కలపాలని కొలతలు తీసి నిర్మాణానికి, సిద్ధంగా వున్నారు.

**అమరవీరుల సంస్మరణ సభ:** అమరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా 29న పూజారి కాంకేరు ఆర్.పి.సి. పరిధిలోని చర్ల ఏరియా కస్తూరిపాడు, చిన్న ఊట్ల గ్రామాల ప్రజలు 200 మందికి పైగా ప్రజలు సంస్మరణ సభలో పాల్గొన్నారు. రైతు అధ్యక్షుడు జెండా ఆవిష్కరణ చేసి, నివాళులర్పించారు. 2 ని॥లు పాటు మౌనం పాటించి, అమరులకు జోహర్లు అర్పించారు.

ఈ సభ సందర్భంగా రైతుకూలీ సంఘం నాయకుడు మాట్లాడుతూ, అమరుల త్యాగాలను, పోరాట పటిమను, ప్రజలకు తెలియచేశాడు. ఈ సభను ఉద్దేశించి, జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశ పేరుతో ప్రజలపై, పార్టీపై దాడిని తీవ్రతరం చేశారు. ఈ దాడిని ఆదివాసీ ప్రజలు సమర్ధవంతంగా తిప్పికొడుతున్నారు. ఆదివాసీ, దళిత, ముస్లిం మైనార్టీ వర్గాల ప్రజల హక్కులు కాలరాస్తున్నారన్నారు. అటవీ సంపదను, సహజ వనరుల్ని సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు ధారదత్తం చేయాలనే లక్ష్యంతో హింసాకాండను తీవ్రతరం చేస్తున్నారన్నారు. ప్రజల్ని కట్టు బానిసలుగా

మార్చివేయాలనే కుట్రలో భాగంగానే పార్టీని నిర్మూలించి, ప్రజలను పార్టీకి దూరం చేయాలని ప్రయత్నిస్తున్నారు. అమరుల ఆశయాలను, కొనసాగిస్తూ నూతన సమాజ నిర్మాణంకై తుదివరకు పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సి.ఎన్.ఎమ్. కళాబృందం పాటలు, నృత్యాలు, నాటకాలు వేసి, ప్రజలను ఉత్తేజపరుస్తూ సభను విజయవంతం చేశారు.

శబరి ఏరియా పరిధిలో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ముందుగా జెండాను ఆవిష్కరించి, అమరులను స్మరిస్తూ 2 ని॥షాలు మౌనం పాటించినారు. సభకు 9గ్రామాల నుండి ప్రజలు, సానుభూతిపరులు, సంఘ నాయకులు, మిలీషియా సభ్యులు, ఛత్తీస్‌గఢ్ నుండి మరికొద్ది మిలీషియా సభ్యులు, మొత్తం 550 మంది ప్రజలు సభకు సంప్రదాయక ఆయుధాలు, విల్లంబులు, బర్మార్లు, గొడ్డళ్ళు, కత్తులతో హాజరయ్యారు.

అమరుల ఆశయాలను వారి త్యాగాలను ఎత్తిపడుతూ నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం తుది శ్వాస వరకు పోరాడాలని పిలుపునిస్తూ సభను ముగించడమైనది.

**పోలీసు ఇన్‌ఫార్మర్లకు దేహశుద్ధి:** చర్ల ఏరియా పూజారికాంకేరు ఆర్.పి.సి. పరిధిలో కొంత మంది ఇన్‌ఫార్మర్లను ప్రజా కోర్టులో విచారించి, ప్రజల నిర్ణయం మేరకు కొందరిని దేహశుద్ధి చేశాం. మరికొందరిని హెచ్చరించి వదిలివేయడం జరిగింది.

శబరి ఏరియా పరిధిలోని ఇన్‌ఫార్మర్ పాస్టర్ ఉయిక మారయ్యను మరో వ్యక్తిని విచారించి, ప్రధాన సూత్రదారి అయిన పాస్టర్ ఊయిక మారయ్యను ప్రజల నిర్ణయం మేరకు హతమార్చడం జరిగింది. ఊయిక మారయ్యను గతంలో పలుమార్లు ప్రజాకోర్టులో పెట్టి పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించినప్పటికీ తన పద్ధతులు మార్చుకోక పోవడంతో ప్రజల సమక్షంలో హతమార్చి, మరికొందరిని హెచ్చరించి వదిలి వేయడం జరిగింది.

## సింగరేణి

**నల్లబ్యాడ్జీలతో ఆందోళనలు చేసిన సింగరేణి కార్మికులు:** 1998 నుండి ఇప్పటివరకు 10వేల మంది కార్మికులను, సింగరేణి యాజమాన్యం డిస్మిస్ చేసింది. గనుల్లో సరిగా గాలి రాక, ఇతర సమస్యలతో ఆరోగ్యం దెబ్బతిని విధులకు సరిగా హాజరు కాలేకపోయారు. యాజమాన్యం గనులలో కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి ఉద్యోగ భద్రత కల్పించకపోగా, కార్మికులు విధులకు హాజరుకాలేదనే సాకుతో బలవంతంగా విధుల నుండి బయటకు నెట్టివేసింది. దీనితో కార్మికులు రోడ్డున పడ్డారు. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఇతర పనులు దొరకక మానసిక వేదనకు గురై ఆరోగ్యాలు దెబ్బతిని వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక వందల మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బతుకులు బాగుపడతాయని ఆశపడ్డ కార్మికులకు నిరాశే మిగిలింది. టీ.ఆర్.ఎస్. ప్రభుత్వంపై భ్రమలు తొలగిపోయి పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని సింగరేణి కార్మికులు ఐక్యంగా వారసత్వ ఉద్యోగాలు, డిస్మిస్ కార్మికుల ఉద్యోగాలు, వీ.ఆర్.ఎస్. డిపెండెంట్‌లకు ఉద్యోగాలు వెంటనే కల్పించాలని 1998లో అకారణంగా నిలిపివేసిన వారసత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని, సింగరేణి యజమాన్యాన్ని డిమాండ్ చేస్తూ కార్మికులందరు ఏరియాలోని గనుల మీద, డిపార్ట్‌మెంటులలో, వర్క్‌షాపులలో ఎక్కడికక్కడ నల్లబ్యాడ్జీలు దరించి ఆందోళనలు చేపట్టారు.

**వారసత్వ ఉద్యోగాలకై సింగరేణి కార్మిక బిడ్డల పోరుబాట:**



ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా పాలకుల హాయంలో సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగిందని టీ.ఆర్.ఎస్. నాయకులు పదే పదే ఊకదంపుడు ఉపన్యాసాలు చేసినారు. ముఖ్యమంత్రి కే.సీ.ఆర్. వారసత్వ ఉద్యోగాలతో పాటు డిస్మిస్ కార్మికల ఉద్యోగాలు, వీ.ఆర్.ఎస్. డిపెండెంట్‌లకు ఉద్యోగాలు ఇస్తానని అసెంబ్లీలో ప్రకటించాడు. కానీ ఆ మాటలు నీటి మూటలయ్యాయి. ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం కూడ ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బతుకులు బాగు పడతాయని అనుకున్న కార్మికులకు కన్నీళ్ళే మిగిలాయి. కార్మికుల బిడ్డల ఆశలు, నిరాశలయ్యాయి. అడుక్కుంటే హక్కులు రావని, పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని, 'పోరాడితే పోయేది ఏమి లేదు–బానిస సంకెళ్లు తప్ప' అనే స్ఫూర్తితో సింగరేణి కార్మికుల బిడ్డలు ఎన్నికలకు ముందు టీ.ఆర్.ఎస్. పార్టీ నాయకుడు చంద్రశేఖర్ రావు సింగరేణి కార్మికలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వారసత్వ ఉద్యోగాలు, డిస్మిస్ కార్మికుల ఉద్యోగాలు, వి.ఆర్.ఎస్. డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, సకల జనుల సమ్మెలో పాల్గొన్న ప్రతి కార్మికుని కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గనుల మీద నల్లబ్యాడ్జీలతో నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు, సింగరేణి అధికారుల ఘేరావ్, జీ.ఎం. కార్యాలయాన్ని ముట్టడించడం లాంటి రకరకాల రూపాలతో పోరాటాలు చేస్తున్నారు.

**ఓపెన్‌కాస్ట్‌ల సర్వే పనులను అడ్డుకున్న గ్రామప్రజలు**

తెలంగాణను బొందలగడ్డగా మార్చే ఓపెన్‌కాస్ట్‌లను రద్దు చేస్తానని హామీ ఇచ్చిన కే.సీ.ఆర్. 19 గ్రామాలను బొందలగడ్డగా మార్చే 'కళ్యాణి మెగా' కంపెనీకి 14 ఓపెన్‌కాస్ట్ బావులను తవ్వుకోవడానికి అనుమతులు మంజూరు చేస్తే 14 గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, సింగరేణి కార్మికులు అందరు కలిసి మిలిటెంట్ పోరాటాల ద్వారా అడ్డుకున్న సంగతి అందరికి తెలిసినదే. సింగరేణి యజమాన్యం, మందమర్రి, బెల్లంపల్లి డిప్యూటీ తహసీల్దార్‌లను, ఆర్.ఐ.లు ఆగస్టు 10న ఖాసీపేట మండలం దుబ్బగూడెం, ఎర్రగుంట పల్లెలో సర్వే పనులు చేయడానికి వస్తే భూములు కోల్పోతున్న గ్రామాల ప్రజలు సర్వే అధికారులను నిలదీసి, 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోతున్న కుటుంబానికి ఒక్కొక్కరికి ఉద్యోగాలు కల్పించి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను కట్టించి, నష్టపరిహారం చెల్లించి, కుల వృత్తులకు, చిరు వ్యాపారులకు ఆదారం చూపించిన తర్వాతనే సర్వే పనులు చేపట్టాలని సర్వేకు వచ్చిన అధికారులను సర్వే పనులు చేయకుండా అడ్డుకున్నారు. ★

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## తెలంగాణ రాష్ట్ర కమిటీ

–రాజ్యం పెంచి పోషించిన ప్రజా హంతకుడు నయీం.

–కిరాతక నయీం చావు పీడిత ప్రజలకు పండుగే.

–నయీంను సృష్టించింది చంద్రబాబు ప్రభుత్వం. నడిపించినవి వై.ఎస్.ఆర్., రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు. –నయీం సామ్రాజ్యానికి కొంతకాలం అండగా ఉన్న కెసిఆర్ ప్రభుత్వం, సొహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు నుంచి అమిత్ షాను కాపాడేందుకు, మై హోమ్. రామేశ్వరరావుకు ప్రమాదం ఏర్పడినందుకే నయీం కాల్చివేత. –నయీం ముఠా హత్యలు, అక్రమ దందాలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న ఏపి సిఎం చంద్రబాబు, ఎంఎల్‌సి కర్నే ప్రభాకర్, నేతి విద్యాసాగర్ రావు, మాజీ డిజిపి అరవిందరావు, ఎస్ఐబి చీఫ్ శ్రీరామ్ తివారి నుంచి మొదలు నేటి ఎస్ఐబి సజ్జనార్‌ల పాత్రలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలి. –నయీం నేర సామ్రాజ్యంలో పాత్రధారులు, ప్రయోజనం పొందిన వారి పేర్లు, ఆస్తుల వివరాలు అధికారికంగా బయటపెట్టాలి. ల్యాండ్ మాఫియా, హంతక ముఠాల ద్వారా అక్రమంగా సంపాదించిన భూములు, బంగారం, డబ్బు, బంగ్లాలు, వాహనాలు తదితర ఆస్తుల్ని ప్రభుత్వం జప్తు చేసి ప్రజల పరం చేయాలి.

**ప్రియమైన ప్రజలారా!**

హంతక ప్రభుత్వాల పోలీసు యంత్రాంగం ఎస్ఐబి డైరెక్షన్‌లో ఎంతో మంది ప్రజలను, పౌరహక్కుల నేతలను, ప్రజా ఉద్యమకారులను కిరాతకంగా చంపిన ప్రజా హంతకుడు నయీం చావు వార్త పీడిత ప్రజలకు పండుగ వంటిదే. కాకుంటే తనను పెంచి, పోషించి ఎన్నో చీకటి హత్యలకు ఆయుధంగా వాడుకున్న దోపిడీ పాలక వర్గం చేతిలో కన్నా ప్రజల చేతిలో నయీం ఖతం అయితే ప్రజలు ఎక్కువగా సంతోషపడేవాళ్లు. 'ప్రజాస్వామ్యం' పరిరక్షకులుగా, రాజ్యాంగా బద్ధులుగా, చట్ట నిబద్ధులుగా ఊదరగొడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అవి ఏ పార్టీలకు చెందినవైనా ప్రజలను వంచనకు గురిచేస్తూనే ఉన్నాయి. ప్రధానంగా తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రోద్బలంతో, పోలీసు, ఎస్ఐబి డైరెక్షన్‌లో మా పార్టీ నేతృత్వంలో సాగుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు తెలుగుదేశం పార్టీ (చంద్రబాబు నాయుడు) హయాంలో వివిధ టైగర్ల, కోబ్రాల పేరుతో నయీం నాయకత్వంలో హంతక ముఠాలు సృష్టించబడ్డాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిల ప్రభుత్వాలు, 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పడి రెండు సంవత్సరాల టి.ఆర్.ఎస్. ప్రభుత్వం, కే.సి.ఆర్. పరిపాలన వరకు కూడా నయీం హంతక ముఠా అరాచకాలకు, హత్యలకు మద్దతు అందిస్తూ వస్తూనే ఉన్నాయి. నయీం నాయకత్వంలోని హంతక ముఠా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, బయటి రాష్ట్రాల్లో కూడా సాగిస్తూ వచ్చిన హత్యాకాండలు, దుర్మార్గాలన్నింటినీ ఈ ప్రభుత్వాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా సమర్థిస్తూ వచ్చాయి.

నయీం నాయకత్వంలోని హంతక ముఠా రెండు దశాబ్దాలుగా ఏమి చేసింది. అనే కంటే ఈ హంతక ముఠా చేత ఆయా పార్టీల పాలకులు, పోలీసు ఇంటిలిజెన్స్ ఎస్ఐబి అధికారుల, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులు ఏమేమి చేయించారు? వారి అండతో మరింతగా రెచ్చిపోతూ నయీం తన నేర సామ్రాజ్యాన్ని ఎలా విస్తరించిందో పరిశీలిస్తే ఈ పాలకవర్గాల అసలు స్వభావం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ప్రత్యర్థులను, విప్లవోద్యమాలను, ప్రజా ఉద్యమాలను నిర్మూలించడానికి, దెబ్బతీయడానికి పాలక వర్గాలు, ప్రభుత్వాలు వాటి యంత్రాంగం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను చట్టబద్ధంగాను, చట్టాలను అతిక్రమిస్తూ, ఎంతటి హత్యాకాండనైనా, ఎన్ని దుర్మార్గాలకైనా, ఎంతటి దమనకాండకైనా సాగిస్తుంటారని వర్గ సమాజ చరిత్ర చెబుతూనే వుంది. సామ్రాజ్యవాదులు, వారి దళారీ పాలకులు, బ్యూరోక్రాట్స్ తమ రాజకీయ, వ్యక్తిగత అవసరాల కోసం బిన్‌లాడెన్ నుంచి నయీం వంటి వారి నాయకత్వంలో హంతక ముఠాలను నడిపించి, హత్యలు, అత్యాచారాలు, అవినీతి, దుర్మార్గాలను సాగింపచేస్తారని, చివరకు పాలకులకే ఆటంకంగా, తమకు ప్రమాదకరంగా మారిన పక్షంలో అంతమొందిస్తారని తెలంగాణ రాష్ట్రంలో తాజాగా జరిగిన నయీం కాల్చివేత ఘటన రుజువు చేస్తుంది. మొత్తం తెలంగాణను శాసించేందుకు తానే ఒక ఆధిపత్య శక్తిగా నిరూపించేందుకు తహతహలాడుతున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, ముఖ్యంగా తనకు ప్రధాన ఆదాయ వనరు, తనకు గుండె కాయ అయిన మై హూమ్ రామేశ్వర్ రావుకు, కొండా విశ్వేశ్వర్ రావులకు వంటి వాళ్లకు ప్రమాదం ముంచుకొస్తే తప్ప, తమ ప్రయోజనాలకు, లావాదేవీలకు ఆటంకం ఏర్పడుతున్నదని, తమ నేర చరిత్రంతా బహిరంగ పడే అవకాశం ఉన్నదనే ఆలోచనతో, భయంతోనే, ప్రధానంగా సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ నిందితుడు అమిత్ షా, నేడు దేశాన్ని ఏలుతున్న బిజెపి అధ్యక్షుడుగా ఉన్నాడు. ఆయనకు రాజకీయంగా ఇబ్బంది రావచ్చుననే భయంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కనుసన్నల్లో నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) ఎస్ఐబి లతో నయీంను ఎన్‌కౌంటర్ పేరుతో అంతమొందించారు తప్పితే చట్టాలను, ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికి కాదని ప్రజలు గుర్తించాలని కోరుతున్నాం. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో అధికారం నడిపిన టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ దోపిడీ విధానాల అమలుకు అడ్డుగా విప్లవోద్యమం ఉంది అని, అది తమ ఉనికికే ప్రమాదంగా భావించి, పౌరహక్కులను కాలరాసేందుకు సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా అమెరికా రూపొందించిన లో ఇంటేన్సివ్ కాన్‌ప్లిక్ట్ (ఎల్ఐసి) వ్యూహంలో భాగంగా పోలీసు, ఇంటిలిజెన్స్, ఎస్ఐబిల ఉన్నతాధికారుల నేతృత్వంలో చట్టబద్ధ దమనకాండతో

పాటు హంతక ముఠాల ద్వారా, కోవర్టు విధానాల ద్వారా అనేక మంది విప్లవకారులను హత్య చేసిన వీరి కార్యకలాపాలు నేటికి అమలు అవుతున్నాయి. ఇదే నయీం ముఠా, ప్రభుత్వ ప్రయోజిత హంతక ముఠాల చేత గతంలో మా పార్టీ నాయకులను, కార్యకర్తలనే కాకుండా ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను, ప్రజా ఉద్యమాల సానుభూతిపరులను, సామాన్య ప్రజలను, రాజకీయ నాయకుల ప్రత్యర్థులను కూడా పాలకులు పాశవికంగా హత్య చేయించారు. మాజీ నక్సలైట్ ఈదన్న హత్యతో మొదలుకొని తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత, పౌరహక్కుల సంఘం నతయకుడు పురుషోత్తం, ఆజం అలీ, కనకాచారి, మున్నేప్ప, గంటి ప్రసాదం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకుడు ఆకుల భూమయ్య లాంటి మరెందరినో కిరాతకంగా చంపివేయించాయి. నేడు నయీంను ఎన్‌కౌంటర్ పేరిట మట్టుపెట్టినంత మాత్రాన పాలకవర్గాలు, ప్రభుత్వం, రాజ్య యంత్రాంగం ముఖ్యంగా పోలీసు అధికారులు తమ హత్యా విధానాలను, చీకటి మాఫియాను ఆపుకుంటారని, ఆగిపోతాయని ప్రజలు కలలో కూడా భావించవద్దు.

తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడి కెసిఆర్ ముఖ్యమంత్రిగా పాలన చేస్తున్న కాలంలో భువనగిరి ప్రాంతంలో ఇదే నయీం ముఠాచే ఒక ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ఒక జర్నలిస్టును, మరొక వ్యక్తి మాయం చేయబడినా, హత్య కావించబడినా కేసులు ఎందుకు నమోదు కాలేదో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ప్రజల, ప్రజాస్వామిక ఉద్యమాల వ్యతిరేకత, ప్రతిఘటన, వుద్యమాల ప్రభావాల వల్ల కొంత ఎక్కువగానో, తక్కువగానో తప్పితే ఈ దోపిడీ వ్యవస్థలో పాలకవర్గం స్వభావంలోనే ఈ ప్రజా వ్యతిరేక, హంతక, అవినీతి, అరాచక విధానాలు ఉంటాయని మరచిపోరాదు.

కారణం ఏదైనప్పటికీ నయీం హంతకులు ఖతం కావాల్సిందే, అంతేకాదు ఇటువంటి హంతక ముఠాలను సృష్టించిన, సృష్టిస్తున్న, వారితో అనేక హత్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగింపజేసి వారితో పలు ప్రయోజనాలు పొందిన వారిలో సిఎం కెసిఆర్, తన బిడ్డ నిజామాబాద్ ఎంపి కవిత (కవితకు ఎన్నికలకు ముందు నయీం ఐదు కోట్ల రూపాయలు ముట్ట జెప్పాడు) మొదలుకొని తను ఇష్టంగా ఎంఎల్‌సిగా చేసుకున్న కర్నే ప్రభాకర్, బంగారు తెలంగాణ కోసం గులాబి కండువ కప్పి తన మందలో కలుపుకున్న నాటి కాంగ్రెస్ శాసనమండలి ఉపనేత నేతి విద్యాసాగర రావు నయీం బినామిగా వున్న విషయం సిఎం కెసిఆర్‌కు తెలియదనుకోవాలా?

ఇప్పటి దాకా ఈ రెండు దశాబ్దాల నయీం నేర ప్రపంచంతో సంబంధం ఉన్న మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, తుమ్మల నాగేశ్వరరావు, ఎంఎల్ఏ తీగల క్రిష్ణారెడ్డి, మరెందరో ఇవ్వాళ నీ గూటిలోనే ఉండి, టిఆర్ఎస్ నాయకులుగా, ప్రజా ప్రతినిధులుగా చలామణి అవుతున్నారు కదా! ఈ విషయం సిఎం కెసిఆర్ కండ్లు, చెవులైన ఇంటిలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డికి తెలియదా! తెలిసినా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుకి చెప్పడం లేదా? నయీంను ముందు పెట్టి భూముల కబ్జా, వందల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకున్న పోలీసు అధికారులు మాజీ డిజిపి అరవిందరావు, డి.టి. నాయక్, ఇప్పటి కమీషనర్ ఆఫ్ పోలీస్ మహేందర్ రెడ్డి, ఎస్ఐబి చీఫ్‌లు శ్రీరాం తివారి నుంచి నేటి తెలంగాణ రాష్ట్ర ఎస్ఐబి చీఫ్ సత్యనారాయణ వరకు నయీంతో లబ్ది పొందిన విషయం బహిరంగ రహస్యమే. గౌతమ్ సావంగ్, స్టీఫెన్ రవీంద్ర, నేటి ఇంటిలిజెన్స్ శివధర్‌రెడ్డలు మావోయిస్టు ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు ఉపయోగపడుతున్నాయని నయీం దందాలకు అండగా ఉన్నారు. టిడిపి మాజీ మంత్రి ఉమా మాధవరెడ్డి, కాంగ్రెస్ మాజీ మంత్రి డి.కె. అరుణ నుంచి మరికొంతమంది మాజీ ఎంఎల్ఏలు, మాజీ మంత్రులు, ఎంపిలు నయీం ముఠా చేత ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు పెట్టుకొని ప్రయోజనం పొందినవారు ఇప్పటివరకు బహిరంగ రహస్యమే కదా. ఇప్పుడయితే డాక్యుమెంట్స్ రికార్డ్స్, డైరీలు సాక్ష్యంగా దొరుకుతున్నాయన్న వార్తలు మీడియాలో వస్తున్నాయి. కదా. వాటిని ప్రజల ముందుకు పెట్టి వీరిని శిక్షించాలని మా పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ నయీం హంతక ముఠా స్థాపనకు, వాటి కార్యకలాపాలకు సూత్రదారులు, నేడు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు నుంచి మొదలు మంత్రులు, మాజీ మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌లు, ఎంఎల్‌సిలు, డిజిపిలు, ఐపిఎస్ అధికారుల వంటి ఉన్నత స్థానంలో ఉన్న వాళ్లను శిక్షించాలంటే కెసిఆర్ ప్రభుత్వం నియమించిన సిట్‌తో కాకుండా హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని, ప్రజలు, ప్రజాస్వామికవాదులు డిమాండ్ చేస్తూ వుద్యమించాలని మా పార్టీ పిలుపునిస్తుంది. వేలాది ఎకరాలను ప్రజల నుంచి కబ్జా చేసిన భూమిని, బాధితుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు తిరిగి ఇప్పించాలి అని డిమాండ్ చేయాలి. వేల కోట్ల ఆస్తులను, మిగతా అక్రమ ఆస్తులను, నయీం బినామీలైన వారు ఏ స్థాయిలో ఉన్నా, వారి ఆస్తులను జప్తు చేసి ప్రజల పరం చేయాలి. సూత్రధారులైన రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు, ఎస్ఐబి ఇతరత్రా ప్రభుత్వాధికారులు, కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులు, తదితర నేర సామ్రాజ్యపు బాగస్థులందరిని అరెస్టు చేసి శిక్షించాలని ప్రజాస్వామిక వాదులంతా డిమాండ్ చేయాలి.


ల్యాండ్ మాఫియా, హంతక ముఠాల ద్వారా అక్రమంగా సంపాదించిన భూములు, బంగారం, డబ్బు, బంగ్లాలు, వాహనాలు తదితర ఆస్తుల్ని ప్రభుత్వం జప్తు చేసి ప్రజల పరం చేయాలి. నయీంతో సంబంధం ఉన్న వాళ్లు ఏ పదవుల్లో ఉన్నా వారందరిని తొలిగించి శిక్షించాలి. నయీం నేర సామ్రాజ్యంలో పాత్రధారులు, ప్రయోజనం పొందిన వారి పేర్లు, ఆస్తుల వివరాలు అధికారికంగా బయట పెట్టాలి. రాజ్యాంగ వ్యతిరేక, చట్ట వ్యతిరేక, హంతక, అవినీతి కార్యకలాపాలు సాగింపచేస్తూ వస్తున్న వారందరూ శిక్షకు గురి కావాల్సిందే అని డిమాండ్ చేయాలి.


**(మిగతాది 30వ పేజీలో)**


# జంత్రి (రామగూడ) కోవర్టు దాడిలో అమరులైన కామ్రేడ్స్‌కు పేరుపేరునా విప్లవ జోహార్లు


బ్రాహ్మణీయ హిందూ మతోన్మాద ఫాసిస్టు బీ.జే.పీ. (ఎన్.డీ.ఏ.) కూటమి దేశంలోని ప్రకృతి సంపదలను సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు ధారదత్తం చేయడానికి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవదశ దాడిని తీవ్రతరం చేసింది. అందులో భాగంగా జరిగినదే జంత్రి (రామగూడ) కోవర్టు దాడి. విశాఖ బాక్సైట్ గనులను అడ్డుకుంటున్న మావోయిస్టులను నిర్మూలించడానికి నరహంతక చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వ అండదండలతో ఆంధ్రా ఓడిశా బార్డర్ మల్కన్‌గిరి జిల్లాలోని జంత్రి (రామగూడు) దగ్గర ఉన్న మావోయిస్టుల సమాచారం తెలుసుకొని లైసెన్స్ కిరాయి నరహంతక గ్రేహౌండ్స్ బలగాలు దుర్మార్గంగా కోవర్టు దాడికి పాల్పడి దాదాపు 31 మంది మావోయిస్టులను పొట్టన బెట్టుకున్నారు. మూడు రోజులుగా, మూడు దఫాలుగా బూటకపు హత్యలకు పాల్పడ్డారు. వాట్సప్‌లో ఎన్‌కౌంటర్ సమాచారం పెట్టి తలలపై వెలలను లెక్కకట్టి పైశాచిక ఆనందంతో రక్తపు కూడు తినడానికి కేరింతలు కొడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విలువైన ప్రకృతి సంపదలను విదేశాలకు తరలించకుండా ఆదివాసులతో కలిసి పోరాడుతున్న మావోయిస్టులపై అత్యంత క్రూరమైన దాడులను కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వం ఆదివాసులపై, మావోయిస్టులపై కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశ దాడులను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, హక్కుల సంఘాలు ముక్త కంఠంతో ఖండించాలి. భూమి, భుక్తి, విముక్తి కోసం నవసమాజ నిర్మాణం కోసం జరిగే నూతన ప్రజాస్వామిక విప్లవంలో తమ నులివెచ్చని నెత్తురును ధారబోసి తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన జంత్రి (రామగూడ) అమరులకు పేరుపేరునా అరుణారుణా జోహార్లు.

ప్రజా పోరాటంలో శత్రువు మూకల్ని మట్టికరిపించి మీ నెత్తుటి బాకీని తీర్చుకుంటాం. మీ ఆశయాలను తుదివరకు కొనసాగిస్తాం.



కా. వెంకటరమణ


కా. దయ


కా. సింహాచలం


కా. కేశవరావు


కా.మమత


కా. లత


కా. దాసు


కా.రైనా


కా.మున్న


కా. గంగాల్


కా. రైనో


కా. జలీన

(మిగతాది 35వ పేజీలో)